# డెవిల్స్ ఇన్ నికోబార్

మధుబాబు



MVS PUBLICATIONS

# డెవిల్స్ ఇన్ నికోబార్

రచన

మధుబాబు

"అంబా" అంటూ భయంతో కొయ్యబారి నిలబడి పోయిందా లేగదూడ. వాడి కత్తులలాంటి కోరపళ్ళు కనపడేలా గుర్రుపెడుతూ, రెండు వైపుల నుంచీ కమ్ముకున్నాయి రెండు అడవి కుక్కలు. మూడడుగుల ఎత్తు, నల్లగా నిగడ బొడుచుకున్న బొచ్చుతో తోడేళ్ళలాగా కనిపిస్తున్నాయవి. ఆట తమకంతో తల్లిని వదిలి చెంగు చెంగున గంతులు వేస్తూ, పొదలలోకి ప్రవేశించిన దూడను సమయం చూసి, ఒడుపుగా చుట్టుకున్నాయి.

"అంబా" అంటూ మరోసారి బెంబేలెత్తిందా చిన్నారి. వెంటనే ఎగిరి నడుంమీద బలంగా తన కోరలను నాటిందొక కుక్క. మెడను పట్టటానికి ప్రయత్నిస్తుంది రెండవది. దూరంగా మేత మేస్తున్న తల్లికి ఆ దీనారావాలు వినిపించాయి కాబోలు రంకెలు వేస్తూ, పొదలను విరగ దొక్కుకుంటూ ఆ ప్రదేశాన్ని చేరింది.

కళ్ళబడిన దృశ్యాన్ని చూసి మాతృ హృదయం కోపంతో మండిపోయింది. మొదటి కొమ్ము వేటుకే ఒక కుక్క ఎగిరి దూరంగా పడింది. ఆ పడిన కుక్క మీదికే లంఘించిందా పిచ్చితల్లి. క్రోధంవల్ల కలిగిన తొందర పాటుతో రెండవ శత్రువును గమనించలేదు. దొరికిన అవకాశాన్ని చేజారనివ్వకుండా పోయి ఆవు వెనకాల నుంచి దెబ్బ తియ్యటానికి ప్రయత్నించింది రెండవ కుక్క. ముందు పడిన శునకం లేచి, వళ్లు దులుపుకుంది. మెడమీద బొచ్చు కత్తుల్లాగా నిలబడింది దారుణంగా మొరుగుతూ ఆవు ముఖం మీదికి ఎగిరింది.

అక్కడికి పదిగజాల దూరంలో, ఒక పొదచాటున నిలబడి జరుగుతున్న పోరాటాన్ని తిలకిస్తున్నాడు షాడో. తన కన్నబిడ్డ రక్షణకోసం వెనకా ముందూ చూసుకోకుండా పోరాడుతున్న ఆ మూగ జంతువు మాతృ ప్రేమకు చలించి పోయింది అతని హృదయం. మరుక్షణం అతని చేతుల్లో ఒక రివాల్వరు ప్రత్యక్షమై భీకరంగా రెండుసార్లు గర్జించింది. కిక్కురుమనకుండా కిందపడ్డాయా అడవి కుక్కలు. రివాల్వరు మోతవిని, మరొక శత్రువని ఎంచి, తలవంచి కొమ్ములు బారుచేసి బిడ్డకు కాపలాగా నిలబడిందా గోమాత.

ఆ చర్యలను చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు షాడో. రివాల్వరును బెల్టువెనక్కు చేర్చి ముందడుగేశాడు. గిట్టలతో నేలను దువ్వుతూ రంకె వేసింది ఆవు. ఒక్కొక్క అడుగే వేస్తూ, ఆవును సమీపించాడు. తన కదలికల్లో తొందరపాటును కనబడనీయకుండ, కుడిచేతిని నెమ్మదిగా ఎత్తి ముఖంమీద రాశాడు మృదువుగా మాట్లాడుతూ. అతని కదలికలను మొదట సందేహంతో గమనించినా, ఆ కంఠ మృదుత్వం దాని భయాలను ఉపశమింప చేసింది. ముఖంమీది చేతిని వాసన చూసి శత్రువుకాదని తృప్తి పడింది.

నడుంమీది గాయం నుంచి రక్తం వెల్లువలా స్రవిస్తూ ఉండటంవల్ల శక్తిలేక నేలవాలిపోయింది ఆ లేగదూడ.

నీరసంగా మరొకసారి తల్లిని పిలిచింది. గిరుక్కున వెను తిరిగిందా మాతృమూర్తి. తన నోటితో రక్తాన్ని తుడిచి రక్తస్రావాన్ని ఆపుదామని విఫల ప్రయత్నం చేయసాగింది.

తన బాగ్ ఓపెన్ చేసి తెల్లటి గుడ్డను తీశాడు షాడో. ఫస్ట్ ఎయిడ్ కిట్ లోనుంచి వాజులైన్ తీశాడు. తత్తర పాటుతో నిలబడిన తల్లిని లక్ష్యపెట్టకుండా గాయాన్ని శుభ్రం చేసి, కట్టు కట్టాడు.

ఖంగారు పడుతున్న బిడ్డను చేరదీసుకొని స్తన్యం యిస్తూ, ధైర్యం చెప్పుకోసాగింది ఆవు. చేతులు తుడుచు కొని చుట్టూ చూశాడు షాడో. అంతా అడవి, చిన్న చిన్న పొదలమధ్య పచ్చిగడ్డి మోకాలెత్తున ఏపుగా పెరిగి ఉంది. గడ్డిలో ఒక కాలిబాట క్లియర్ గా కనిపిస్తుంది. బాగ్ భుజాన వేసుకొని ఆ దారిని అనుసరించి బయలుదేరాడు. అతని వెనకే బయలుదేరింది ఆవు. ఆవును అనుసరించ ప్రయత్నించి శక్తిలేక కూలబడింది లేగదూడ. విసుక్కుంటూ వెనుతిరిగాడు. తనకు ఎంత వద్దనుకున్నా యిటువంటి బంధాలు ప్రాప్తిస్తాయేమిటా అనుకుంటూ.

దూడ నడిచే పరిస్థితిలో లేదు. ఆవును తప్పించు కోవటం ఏమంత కష్టమైన పనికాదు. కాని మళ్ళీ దూడ నిస్సహాయతను ఆధారంగా చేసుకొని, అడవి జంతువులు ఎదుర్కోవని నమ్మకమేమిటి?

దూడను ఎత్తి భుజాలమీద వేసుకొని ప్రయాణం ప్రారంభించాడు. దూడనే చూస్తూ, తృప్తిగా అనుసరించ సాగింది తల్లి.

2

"అది రాజు, జరిగిన సంగతి!" సిగరెట్టు వెలిగించుకోటానికి ఆగారు హోమ్ మినిస్టర్ గారు. తనుకూడా ఒక పనామా వెలిగించి సర్దుకు కూర్చున్నాడు షాడో.

"దేవరాజు జైలునుండి తప్పించుకొని నికోబార్ ఐలాండ్స్ కు చేరుకున్నట్లు జాడలు తీయగలిగారు మన సి.ఐ.డీలు చక్రవర్తి అనే ఒక ఆఫీసరు నికోబార్ ఐలాండ్స్ లో జగత్ పురా అనే గ్రామ పరిసరాలలో దేవరాజు వున్నట్లు వార్తలు పంపాడు. ఆ తర్వాత అతని వద్దనుంచి ఏవిధమైన సమాచారం మనకు లభించలేదు. చక్రవర్తి ఏమైనాడో కూడా తెలియలేదు."

"మరి నాలుగు నెలలనుంచి పోలీస్ డిపార్టుమెంటు ఏం చేస్తున్నట్లు?" ప్రశ్నించాడు షాడో.

"వాళ్ళుమాత్రం ఏం చేయగలరు? నికోబార్ ఐలెండ్స్ మనలాగా అభివృద్ధి చెందిన ప్రాంతం కాదు. దట్టమైన అరణ్యాలతో నిండి, రాకపోకలు చాలా కష్టతరంగా ఉంటాయి. ఇంకా తొంభై శాతం ప్రజలు పశువులను పెంచుకొనే జీవనం కొనసాగిస్తూ ఉంటారు. క్రూరమైన అడవిజాతులు, భయంకరమైన అడవి జంతువులు అడుగడుగునా

అడ్డుపడుతూ వుంటాయి. చక్రవర్తి ఏమైనాడో తెలుసుకోటానికి యిద్దరు సి.ఐ.డీలు తమ చాక చక్యమంతా ప్రయోగించి ప్రయత్నించారు. ఒక్క ముక్కకూడా తెలుసుకోలేక పోయారని వేరే చెప్పాలా?" అంటూ నవ్వారాయన.

"ఇప్పుడు మనం వెతకవల్సింది దేవరాజు కోసం కాదు చక్రవర్తిని. ఇది పోలీస్ డిపార్ట్ మెంట్ కు తలవంపులు తెచ్చిపెట్టేలా వుంది. ఎవడో ఒక ఊరూ-పేరూ లేని దొంగ పారిపోవటం, అతన్ని బంధించటానికి పోయిన సి.ఐ.డి. మాయం కావటం, సి.ఐ.డి. డిపార్ట్ మెంట్ పేరు ప్రతిష్టలకే కళంకమాపాదిస్తున్నది. అందుకనే సమర్థుడైన వ్యక్తిని పంపమని కులకర్ణిగారిని రిక్వెస్ట్ చేశాను."

"మరీ నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు సార్" సిగ్గు పడ్డాడు షాడో.

"నో-నో అలాంటిదేమీ లేదు మిస్టర్ రాజు! ఉన్న ఫాక్ట్స్ చెపుతున్నాను. సి.ఐ.బి. లో వున్న ఏజంట్లందరి లోనూ నువ్వు మొనగాడివని చెప్పారు. మోడ్రన్ వెపన్స్ ఉపయోగించటంలోనూ, స్పైయింగ్ లోనూ ఉన్న నూతన పోకడలను అనుసరించటంలోనూ నీ ప్రతిభ అసమాన్యమని నాకూ తెలుసు.

"కానీ ప్రస్తుతం ఈ పనికి కావాల్సినవి ఆ క్వాలిఫికేషన్లు కావు. అక్కడ కండబలం, గుండెధైర్యం, వీటితో పాటు అరణ్యవాసులతో మెలిగే చాకచక్యం- ఇవి కావాలి. నిన్ను అడవుల్లో వదిలితే పట్టుకోవటం

కష్టమని కులకర్ణి గారు చెప్పటం వల్లనే నిన్ను ఈ పనికి నియోగించవలసి వచ్చింది."

టేబుల్ మీద పెట్టిన సిగరెట్టు పెట్టె జేబులో వేసుకుంటూ నిలబడ్డాడు షాడో. "ఓకే సర్! దెన్ ఐవిల్ బి ఆన్ మైవే."

అతనితోపాటు ముఖద్వారం దాకా వచ్చి వీడ్కోలు పలికారు హోమ్ మినిస్టర్.

"నీకు ఏ సహాయం కావలసి వచ్చినా అండమాన్స్ గవర్నరుగారు చేస్తారు. ఆ విధంగా ఆర్డర్లు పంపటంకూడా జరిగిపోయింది. అక్కడి పోలీస్ డిపార్ట్ మెంట్ నీకు అండదండలు సమకూరుస్తుంది. యు బెస్ట్ ఆఫ్ లక్ మై బాయ్!"

*　　*　　*

భుజంమీది దూడను సరిగ్గా అమర్చుకొని, చొక్కా భుజానికి చెమటను తుడుచుకుంటూ ముందుకు సాగాడు షాడో. హాయ్ గా కడుపులో చల్ల కదలకుండా, ఢిల్లీ పార్కుల్లో, బిందుతో షికార్లు కొట్టే తనకు ఈ అడవుల్లో, ఆవు దూడలను మోయాల్సిన ఖర్మ పట్టిందేమిరా అనుకొంటూ.

"ధన్" మంటూ ఒక రైఫిల్ బుల్లేట్ అతని పాదాల ముందు దుమ్ము లేపింది. ఉలిక్కిపడి వెనుకడుగు వేస్తూ పక్కకు చూశాడు.

మిస- మిసలాడుతున్న పడుచుదనపు పరువాల్ని ఒలకబోస్తూ, బాటను ఆనుకొని ఉన్న పొదపక్క నిలబడి ఉంది ఒక యువతి. ఆమె అందంతో ఆ చుట్టూ ఉన్న పరిసరాలన్నీ మరింత అందంగా శోభించినా, దిష్టికోసం ఉన్నట్లు చేతిలో రైఫిల్ భయంకరంగా పొగలు కక్కుతుంది. పైగా అది షాడోకేసి గురి పెట్టబడి ఉంది.

దూడను కిందికి దించి భుజాలు రుద్దుకుంటూ నిలబడ్డాడు షాడో. మౌనంగా అతనివంకే చూస్తూ నిలబడి ఉందామె. కించిత్తుకూడా చలించడంలేదు చేతిలోని రైఫిల్. ఆమె వెనకాల నిలబడిన మధ్య వయస్కుడు కూడా అదేమాదిరి చూడసాగాడు.

తనను అంటరానివాడిగా- దొంగగా చూస్తున్నట్లు అనిపించి, కోపం తెచ్చుకున్నాడు షాడో. ఐనా కొత్త స్థలం, తెలియని వ్యక్తులు! పోట్లాట ఎందుకని తగ్గి మాట్లాడాడు.

"ఈ దూడ మీదే అనుకుంటాను. పాపం అడవికుక్కల వాత బడితే, తీసుకొస్తున్నాను" మాటలు కలపటానికి ప్రయత్నించాడు మర్యాదగా.

ఆమె వద్దనుంచి గాని, ఆ వ్యక్తి వద్దనుంచిగాని సమాధానమేమి రాలేదు. అలాగే వింత జంతువును చూసినట్లు చూడసాగారు.

"మాటా మంతీ లేకుండా ఏమిటా చూపు?" విసుగ్గా అన్నాడు షాడో. "ఈ ఆవు, దూడా మీవేనా?" అని ప్రశ్నించాడు.

"ఎవరివని తీసుకుపోతున్నావ్ బే" ఖంగుమంది ఆ మధ్య వయస్కుడి కంఠం.

"ఏమిటి కథ? ఎకాయెకిన బే, గీ అంటున్నావ్? వళ్ళేలా ఉంది?" మండిపడ్డాడు షాడో.

"నావంటికేం బే, నీ వంటి సంగతి చూసుకో" అంటూ ముందుకు వచ్చి షాడో గూబ గుయ్ మనిపించాడు. పట్టపగలు నక్షత్రాలు కన్పించాయి షాడో కళ్ళకు. దెబ్బ పడగానే తోక తొక్కిన కాలనాగులా ఎగిరిపడ్డాడు. పిడికిలి బిగించి ముందుకు అడుగు వేశాడు.

వెంటనే వయ్యారి చేతుల్లోని రైఫిల్ మరోసారి గర్జించింది. బుల్లెట్ షాడో చెవ్వును ముద్దు పెట్టుకుంటూ ముందుకుపోయింది. చెవ్వు తడుముకుంటూ నిలబడి పోయాడు.

"పాపా! ఇంకా ఆలోచిస్తావెందుకు? వీడు ఆ నాగుర్ ముఠాకు చెందినవాడే! దూడను పట్టుకుంటే ఆవు రాక మానదని భుజాలమీద వేసుకొని పోతున్నాడు. ఆవును తోలుకొని నువ్వు యింటికి పో! వీడి సంగతి నేను చూసుకుంటాను" షాడో మీదినుంచి దృష్టి మరల్చకుండా, ఆ యువతితో అన్నాడా మధ్య వయస్కుడు.

"నికోబార్ ఐలెండ్స్ పశువులకు పెట్టింది పేరు... రాజు! ఆ ప్రజలు వాటిని ధన- ధాన్యాల కంటే మిన్నగా చూసుకుంటారు. అది మనసులో పెట్టుకొని సంచరించు"

హోమ్ మినిస్టర్ గారి మాటలు గుర్తుకు వచ్చి, ఎదురు దెబ్బ వేయకుండా ఆగిపోయాడు షాడో. అవమానం సహించి, పళ్ళు కొరుకుతూ నిలబడిపోయాడు. బెల్టు వెనుక ఉన్న రివాల్వర్ తీయటం క్షణంలో పని! కాని అసలు విషయమేమిటో తెలుసుకోకుండా తొందర పడటం మంచిది కాదని తలచాడు.

"మీరంటున్న నాగూర్ ముఠా ఏమిటో? ఆవుల్ని దొంగిలించట మేమిటో- నాకు అర్థం కావటం లేదు. అడవి కుక్కలు దూడని గాయ పరిచాయ్. వాటిమీదకు దూకిన ఆవును కూడా చంపబోయాయవి. సమయానికి నేను రావటం వల్ల వాటిని మట్టుబెట్టి, వీటిని రక్షించగలిగాను..." ఆవూ, దూడలను చూపిస్తూ అన్నాడు.

"ఇంకా చిలక పలుకులు వల్లిస్తున్నాడు చూశావా?" వెక్కిరిస్తూ అన్నాడు ఆమెతో మధ్యవయస్కుడు.

పళ్ళు బిగపట్టి, పిడికిళ్ళు మూసి నిలబడ్డాడు షాడో. అతని నోటివెంట మరొకమాట వచ్చి ఉంటే...

"అడవి కుక్కలు దూడను ఎదిరించినట్లు నమ్మమంటావా?" తియ్యగా పలికింది ఆ యువతి.

"లేకపోతే ఆ భుజంమీది గాయం నేను చేసి కట్టుకట్టానంటారా?"

"నిజమే దాదా! ఆ గాయాన్ని చూడు"

"అతని మాటలు నమ్మకు పాపా. అన్నిరకాల జిత్తులు నేర్చిన వాళ్ళు వారు. ఆ గాయం ఎందుకు చేశారో మనకు అంత తేలికగా తెలుస్తుందా?" నమ్మలేదు ఆ మధ్యవయస్కుడు.

"గాయం ఎందుకు చేశానో, పోయి ఆ అడవికుక్కల నడగరాదూ తెలుస్తుంది..." అతని కంఠాన్ని అనుకరిస్తూ వెక్కిరించాడు షాడో.

"అడుగుతాను బే! అడుగుతాను. ఆ కుక్కలక్కడ లేకపోవాలి... నీ బ్రతుకు కుక్కకంటే హీనంగా చేస్తాను" అంటూ షాడో వచ్చిన దిశగా వేగంగా అడుగులు వేస్తూ కదిలిపోయాడా మధ్యవయస్కుడు.

రైఫిల్ షాడోవంకే గురిపెట్టి ఉంచి, సమీపంలో ఉన్న చెట్టునానుకొని నిలబడింది ఆ సుందరి. వయస్సు ఇరవై సంవత్సరాలు ఉండవచ్చు. చామనఛాయ. చక్కటి వంపులతో ముగ్ధ మనోహరంగా ఉంది. మోకాళ్ళదాకా పరికిణీ కట్టి, దానిమీద ఒక చిన్న జాకెట్టు నడుందాకా వేసింది. నల్లటి వల్లె వక్షోజాన్ని కప్పుతూ భుజాల మీదినుంచి వెనుకకు పోయి వుంది.

ఇంతలో పోయిన శక్తిని పుంజుకొని లేచి నిలబడింది లేగదూడ. ఆవుకూడా ముందుకు వచ్చి షాడోతో కలిసి దూడను లాలించసాగింది.

అరగంట తర్వాత ఉరుకులు పరుగులమీద వచ్చాడు ఆ మధ్యవయస్కుడు. షాడోవంక పరీక్షగా చూస్తూ నిలబడ్డాడు.

"ఏం దాదా?" ప్రశ్నించింది ఆమె.

"అడవి కుక్కలు అక్కడే వున్నాయి పాపా! మనం విన్న కాల్పులు అవే అనుకుంటాను. ఇంతకుముందే చంపినట్లు గుర్తులుకూడా కనిపిస్తున్నాయి"

"ఇప్పటికైనా నామాటలమీద నమ్మకం కుదిరిందా?" అంటూ కిందపడిన బాగ్ భుజాన వేసుకొని బయల్దేరాడు షాడో. ఈసారి అతన్ని ఆపటానికి ఆమె ప్రయత్నం చేయలేదు. తననే అనుసరించ బోయిన ఆవును వెనక్కు తోలి కదిలాడు షాడో.

"ఎవరయ్యా నువ్వు? ఎక్కడినుండి వస్తున్నావ్?" ఈసారి కొంచెం మర్యాద మేళవించి అడిగాడు ఆ మధ్య వయస్కుడు.

"నేను ఎవరైతే నీకెందుకుటే. నీ పనేదో నువ్వు చూసుకోరాదూ?" భుజంమీది నుంచి సమాధానం విసరి ముందుకు పోయాడు షాడో.

ఒక ఫర్లాంగుదూరం నడిచాక తననెవరో అనుసరిస్తున్న అనుమానం తగిలి జాగ్రత్తగా వెనుతిరిగాడు. చెట్టుపక్కకు తప్పుకుంటున్న ఓ వ్యక్తిని చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు.

జగత్ పురా యింకో నాలుగు మైళ్ళుంటుంది. ఆ గ్రామం చుట్టూ ఎత్తయిన కొండలు పెట్టని కోటలా ఉండి అడవి జాతులనుండి రక్షణ కల్పిస్తున్నాయి. కొండలమధ్య దట్టమైన అరణ్యాలు పచ్చిక, పశువులకు మేతను సమృద్ధిగా అందజేస్తున్నాయి.

ఉన్న ఖర్మలో ఉపా ఖర్మ అన్నట్లు ఈ నాగూర్ ముతా ఏమిటి? షాడో ఆ విషయాన్ని గురించి ఆలోచించసాగాడు.

"దేవరాజు పచ్చిసెత్తురు తాగే హంతకుడు రాజు! లక్ష్మీ బాంక్ దోపిడీ సందర్భంలో ఇద్దరు కాషియర్లనూ, ఒక దర్వానును చంపిన నేరానికి ఉరిశిక్ష విధించింది హైకోర్టు. ఇంకో రెండు రోజులకు శిక్ష అమలు చేయబడుతుందనగా రాత్రికి రాత్రి మాయమయ్యాడు. అతని జైలుగది తెరిచి వుంది. అతనికి కాపలా ఉండే సెంట్రీ శవం లోపల పడి వుంది. ఎలా మాయమయ్యాడో, ఎవరికీ అంతు బట్టని మిస్టరీ అయింది...

హోమ్ మినిస్టర్ గారి మాటలు గుర్తుకు వచ్చాయి. చక్రవర్తి చేసిన రిపోర్టు ప్రకారం దేవరాజు జగత్ పురా చేరుకున్నాడు.

ఈ నాగుర్ ముతాతో చేతులు కలపలేదు కదా!

దట్టమైన చెట్ల తోపులో ప్రవేశించగానే, కుందేలులా షాడో పొదలలోకి దూరిపోయి లేచి కూర్చున్నాడు. పది నిముషాల తర్వాత ఆ వ్యక్తికూడా చెట్లతోపులోకి వచ్చి నిలిచాడు. కొద్దిసేపు అటూ-ఇటూ చూశాడు. ఆ తోపులోంచి ఒకే ఒక మార్గం ఉంది. అది సరాసరి జగత్ పురా పోతుంది. తనముందు పోతున్నవాడు జగత్ పురా పోతున్నట్లు నిశ్చయ పరచుకొని వెనుతిరిగాడతను.

ఆ వ్యక్తి కనుమరుగు కాగానే అతని చర్యలకు పజిల్ అవుతూ, పొదలలోనుండి బయటకు వచ్చాడు షాడో.

అతను తనసెందుకు వెంబడిస్తున్నాడు? మళ్ళీ కనబడిన పశువుల్ని తోలుకుపోకుండా జాగ్రత్తపడుతున్నాడా? అలా అయితే వెనక్కు వెళ్ళిపోయాడేం? ముందు అతని లాంటివాళ్ళే మరి కొంతమంది ఎదురు పడరుకదా!

దారి పొడుగునా యిదే ఆలోచనలతో, తనకు తెలియకుండానే గ్రామంలో అడుగు బెట్టాడు.

3

ఐదారువందల కంటే ఎక్కువ ఉండవు ఇళ్ళు ఆ గ్రామంలో. ఒకే ఒక పెద్దవీధి ఆ గ్రామాన్ని రెండుగా చీలుస్తున్నది. ఒక చివరగా గ్రామాన్ని ఆనుకొని ప్రవహిస్తున్నది చిన్న నది. దాని ఒడ్డున ఆగి ముఖం కడుక్కొని, చల్లటి నీళ్ళు కడుపునిండా తాగి వచ్చాడు. ఎవరి పనుల్లో వాళ్లు హడావుడిగా తిరుగుతున్నారు గ్రామ ప్రజలు. ఒక టీ స్టాల్ లాంటిది షాడో కనులపండుగ చేసింది. కాని అక్కడ దొరికేది టీ కాదు. భంగు అనే ఒక సారాయిలాంటి పానీయం!

ఆ కొట్టువైపు అడుగువేసి, వాసన తగలగానే తన ఆలోచనను మార్చుకొని ముందడుగు వేశాడు. మొదట వుండటానికి చిన్న గది చూసుకోవాలి. ఈ పల్లెటూరిలో అది అంత సులభమైన పనా?

వందగజాలు నడవగానే ఒక కిరాణా కొట్టులాంటిది ఎదురైంది. లోపలకు పోయి యజమానిని కలుసుకున్నాడు.

"ఈ గ్రామానికి కొత్తవాణ్ని. 'డోబ్రా' పోవటానికి బయలుదేరి దారితప్పి ఇటు వచ్చాను. మధ్యలో కొండ చెరియల్లో నీళ్ళు త్రాగటంవల్ల జలుబు చేసింది." ఎఫెక్టు రావటం కోసం జేబుగుడ్డలో గట్టిగా చీదాడు.

"ఓ రెండు రోజులు ఇక్కడ వుండి విశ్రాంతి తీసుకోవటానికి వీలుపడుతుందా?" కొత్తవాళ్ళకి ఆశ్రయ మివ్వరని తెలిసి, తను వుండటానికి ఒక చిన్న కథ అల్లాడు. వీలైనంత వరకూ తన ఐడెంటిటీని బయట పెట్టకుండా కార్యం సాధించాలి. పోలీసుల మనిషి అని తెలిస్తే తన ప్రశ్నలకు సమాధానాలు దొరకటం కష్టం.

షాడో మాటల్ని పూర్తిగా నమ్మలేదు ఆ వ్యక్తి. అయినా నోరు తెరిచి అడిగిన వాణ్ని లేదుపొమ్మని అనటం భావ్యం కాదు గనుక, వెంట బెట్టుకొని ఎదురుగా వున్న ఒక రెండంతస్థుల మేడకు తీసుకుపోయాడు. పూర్తిగా చెక్కలతో కట్టబడి వుంది ఆ యిల్లు. కిందా పైనా చెక్కల మయం. వరండాలో చుట్ట కాలుస్తూ కూర్చునివున్న అరవైఏళ్ళ వృద్ధుడు వారికి స్వాగతం పలికాడు.

"కాకా! ఈయన దారితప్పి మనగ్రామం వచ్చారట. రెండు రోజులు విశ్రాంతి తీసుకొని వెళతారట. పైగది ఖాళీగానే వుందిగా- అందులో వుంటారు" అంటూ చెప్పాడు ఆ పచారీకొట్టు యజమాని.

"నీ పేరేమిటి బాబూ" ప్రశ్నించాడు ఆ వృద్ధుడు.

"రాజు" అతని కళ్ళలోకే సూటిగా చూస్తూ బింకంగా సమాధానమిచ్చాడు షాడో.

"ఏవూరు?"

"అండమాన్స్ నించి వస్తున్నాను. డోబ్రాలో బంధువుల్ని చూడటానికి పోతున్నాను."

"మంచిది పదబాబూ, గది చూపిస్తాను" అంటూ దారి తీశాడు ఆ వృద్ధుడు. తర్వాత కలుస్తానని శెలవు పుచ్చుకున్నాడు పచారీకొట్టు యజమాని.

అది చాలా చిన్నగది. అయినా ఎంతో సింపిల్‌గా వుంది. షాడోకు నచ్చింది. "నాకొడుకు వుండేవాడు యిందులో" అన్నాడు కాకా. ఇంకా ఏమైనా చెపుతాడేమోనని ఎదురు చూసిన షాడోకు ఆశాభంగం కలిగింది. విశ్రాంతి తీసుకోమని చెప్పి వెళ్ళిపోయాడు కాకా.

కాకా వెళ్ళిన తరువాత బాగ్ మంచంమీద పడవేసి, కిటికీ తెరిచాడు షాడో. చల్లటిగాలి మనస్సు నాహ్లాదపరుస్తూ, తెరలు తెరలుగా

లోపలికి వచ్చింది. సూర్యుడు కొండల చాటుకు తప్పుకుంటున్నాడు. ఎత్తైన కొండల కింద అప్పుడే నల్లటి నీడలు దట్టంగా పరుచుకుంటున్నాయి.

తనకు దారిలో కలిసిన యువతి ఆమెతో వున్న మధ్య వయస్కుడు, గ్రామంలోకి అడుగుపెట్టటం చూసి కిటికీ రెక్కల చాటుకు తప్పుకున్నాడు షాడో. కొంపతీసి వాళ్ళు గూడా ఈ గ్రామం లోని వారు కాదు గదా! ఆ కిటికీలో నుంచి వీధి అంతా చక్కగా క్లియర్ గా కనిపిస్తున్నది. కిటికీ రెక్క చాటుచేసుకొని వారినే గమనించసాగాడు. వారి వెనకాలే ముప్పయ్ సంవత్సరాల వ్యక్తి ఒకడువచ్చి, ఆ యువతిని కలుసుకున్నాడు. ఎంతో చనువుగా దగ్గిరగా నిలబడి మాట్లాడుకుంటున్నారు వారిద్దరూ. ఆ దృశ్యాన్ని చూసి, కిటికీమూసి కిందికి దిగి వచ్చాడు.

ఉదయం నాలుగు గంటలకు నికోబార్ ఐలాండ్ లో దించిందొక ఆర్మీ స్టీమర్. ఆదరా బాదరాగా ఆ సమయంలో కాస్త టిఫిన్ చేశాడు. ఆ తర్వాత మంచినీళ్ళు తప్ప మరేమీ తీసుకోలేదు. గుమ్మం ముందు కూర్చున్న కాకాను ప్రశ్నించాడు.

"కాకా! ఇక్కడ భోజనానికేమైనా..."

"అదిగో బాబూ! అటుపక్క కనపడేదే పూటకూళ్ళ యిల్లు. డోబ్రాలో బంధువులు వున్నారంటున్నావ్ . మరి ఆచారాలు తెలియదా?" వింతగా చూస్తూ ప్రశ్నించాడు కాకా.

తన మతిమరుపు తనానికి నిందించుకుంటూ, నాలుక కొరుక్కుని తడబాటును కప్పి పుచ్చుకుంటూ, సమాధానంగా ఏదో గొణిగి బయటపడ్డాడు షాడో.

ఆ గ్రామాలలో పదిహేను సంవత్సరాలు దాటిన మగ పిల్లలు తల్లితండ్రులను వదిలి వేరుగా నివశించాలి. వివాహమయ్యే దాకా వారే వంట చేసుకొని బ్రతకాలి. డబ్బున్నవారు, బాగా సంపాదించుకోగలిగినవారు హోటల్స్ లాంటి పూటకూళ్ళ ఇళ్ళల్లో భోంచేస్తారు.

అప్పటికి చీకట్లు గ్రామంలోకి ప్రవేశించాయి. కిరోసిన్ లైట్లు అన్ని ఇళ్ళల్లోనూ ప్రత్యక్షమయ్యాయి. కిరాణాకొట్టు దగ్గిర నిలబడి షాడోవంక చూపించి ఏదో చెపుతుంది ఆ యువతి తన పక్కన నిలబడిన వ్యక్తితో. గమనించనట్లు తల వంచుకొని హోటల్లో జొరపడ్డాడు షాడో. పదిమంది వ్యక్తులు భోజనం చేస్తున్నారు. నేలమీద పరిచిన ఆకుల ముందు ఇంకో నలుగురు కూర్చొని వున్నారు. తను గూడా ఒక పీటమీద కూర్చున్నాడు.

లోపలనుంచి పెద్ద పళ్ళెంలో రొట్టెలు తీసుకువచ్చి ఆ నలుగురికీ వడ్డించిందొక పదహారేళ్ళ బాలిక షాడో కోసం ఇంకో విస్తరి అందుకోబోతూండగా బయటనుంచి ఎవరో పిలిచారు. పళ్ళెం కింద పెట్టి బయటికి పోయింది.

పది నిమిషాలు గడిచాయి... పదిహేను... తిరిగి వచ్చిన తరువాత షాడో అక్కడ ఎదురుగా వున్నాడనే సంగతే విస్మరించినట్లు మిగిలిన వారికి వడ్డించసాగింది. కడుపులో ఆకలికి తోడు, తిక్కరేగింది షాడోకు. తనకు వడ్డించరేమని గద్దించి అడిగాడు. బెదురు చూపులు చూస్తూ లోపలకు వెళ్ళిపోయిందా బాలిక.

ఒక లావుపాటి ఆడమనిషి వచ్చి ద్వారంలో నిలబడింది. "ఎందుకయ్యా అలా అరుస్తావ్? వడ్డించేదాకా కూర్చోలేవూ?" అన్నది.

తటాలున ఒక విషయం మదిలో మెదిలింది. చివాలున లేచి, గబగబా తన గదిని చేరుకున్నాడు. ఇందాక బయట నుంచి ఆ పిల్లను పిలిచిన కంఠం రైఫిల్ యువతిలాగా వున్నది అనుకుంటూ తడవకు రెండేసి మెట్లు ఎక్కుతూ తన గదిని సమీపించాడు. గదిలో వున్న లైటు వెలుగు తలుపు సందులనుండి బయటకు ప్రసరిస్తున్నది. తను లైటు వెలిగించలేదు. మరి యీ వెలుగు ఎక్కడిది?

ఒక్క తోపుతో తలుపులను బార్లా తెరిచి లోపలకు పోయాడు. కిరోసిన్ దీపపు వెలుగులో మంచంమీద ఉన్న సంచిని పరీక్షిస్తున్న 'ఆమె' వులిక్కిపడి చిన్న కేకతో వెనుతిరిగింది.

చిరునవ్వుతో ద్వారానికి అడ్డంగా నిలబడి ఉన్న షాడోను చూసి నిర్ఘాంతపోయింది.

"వెల్ వెల్ మైడియర్! మీ ఆవులు, దూడల నేమైనా సంచిలో దాచానని వెదుకుతున్నావా?" అని ప్రశ్నించాడు వ్యంగంగా.

అవమానంతో, సిగ్గుతో ఆమె ముఖం కిందికి వాలి పోయింది. ప్రత్యుత్తర మీయకుండా తల వంచుకుని బయటకు పోవటానికి ప్రయత్నించింది.

భుజాలు పట్టుకొని ఆమెను నిలబెట్టాడు షాడో. "నాకు సమాధాన మివ్వకుండా తప్పించుకు పోదామని ప్రయత్నించకు హనీ! నా గదిలో ఏం చేస్తున్నావ్?"

"నన్ను వదులు. పొరపాటున యిక్కడికి వచ్చాను" గింజుకుంటూ అన్నదా యువతి.

"అవునవును. పొరపాటున నా సంచి వెదుకుతున్నావు. దీపం వెలిగించటం కూడా పొరపాటే! నాకు భోజనం పెట్టటం ఆలస్యం చెయ్యమనటం కూడా పొరపాటే కదూ?"

సమాధానం చెప్పకుండా మరింతగా పెనుగులాడిందామె. ఉక్కు ముక్కల్లాంటి ఆ చేతులనుండి విడిపించుకోవటం సాధ్యపడలేదామెకు.

"ఏదో జాలితో మీ పశువుల్ని రక్షించినందుకు నన్ను దొంగకింద జమకట్టి, పురుగుకన్నా హీనంగా చూశావ్ మధ్యాహ్నం... ఇప్పుడు నా గదిలోకి దొంగలాగా ప్రవేశించి నా బాగ్ కెలకటంలో ఆంతర్యమేమిటి? ఏం కావాలి నీకు? కావాల్సింది దొరికిందా?"

"............"

"సమాధానం చెప్పవేం? చేతిలో తుపాకి ఉంటేగాని మాటలు రావా?"

ముందుకు వంగి అడుగుతున్న షాడో చెంప చెళ్ళుమంది. పెదవి తెగి రక్తం వచ్చింది. కోపంతో షాడో కళ్ళు ఎర్రబడ్డాయి.

"మర్యాద యిచ్చి పుచ్చుకోవడం మీకు తెలియదు. మంచిగా మాట్లాడితే మరీ- మరీ నెత్తికెక్కుతున్నారు. ఇక నేనడ్డం తిరిగితే ఏమౌతుందో తెలుసా?" అంటూ తనవంకే అదురుతూ చూస్తున్న ఆమె పెదవులను ముద్దుపెట్టుకున్నాడు. అర నిముషంపాటు వదిలించుకోవటానికి విఫల ప్రయత్నం చేసిందామె. తల ఎత్తి గల-గలా నవ్వాడు షాడో. "జాగ్రత్త! యికముందు ఎవరి గదన్నా వెదకదల్చుకుంటే ఆ గదిలోని వ్యక్తి ఎలాటివాడో తెలుసుకొని మరీ

ప్రయత్నించు" అంటూ కోమలంగా ఉన్న ఆ భుజాల్ని వదిలి వెనుకకు జరిగాడు.

"నిన్ను... నిన్ను... చంపి పారెయ్యాలి! నన్నే అవమానిస్తావా?" కోపంతో కంఠం జీరపడుతుండగా అరిచింది అ యువతి.

మౌనంగా బెల్టులోనుంచి రివాల్వరుతీసి ఆమె చేతిలో పెట్టాడు షాడో.

"ఊ! ఆలోచిస్తావేం? చంపు"

బిత్తరపోయి రివాల్వరు వంకా, అతని వంకా మార్చి- మార్చి చూసింది. ఆ మసక వెలుగులో విశాలమైన ఆ కళ్ళు నీటితో నిండటం చూశాడు. రివాల్వరును నేలకేసి కొట్టి బయటకు పరుగెత్తింది.

మెట్లు దిగిన శబ్దం వచ్చేదాకా ఆగి, తలుపు గడియపెట్టి సంచి చూసుకున్నాడు షాడో. అందులోని వస్తువులన్నీ అలాగే ఉన్నాయి. ఆమె దేనికోసం గాలిస్తున్నదో అంతుబట్టలేదతనికి.

సంచిని మంచంకింద పడేసి, దీపపు వత్తిని తగ్గించి కిందికి వచ్చాడు. ఏమీ తెలియనట్టు చుట్ట కాలుస్తూ ప్రశాంతంగా కూర్చొని ఉన్నాడు కాకా. ఆ యువతి ఎక్కడా కనుపించలేదు. సరాసరి హోటల్లోకి పోయి పీటమీద కూర్చున్నాడు.

ఈసారి వెంటనే విస్తరి వేసిందా పిల్ల. భోజనం కానిచ్చుకొని, డబ్బిచ్చి గదికి బయలుదేరాడు. వరండాలో కాకా పిలిచి కూర్చొమనటంతోనే, పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని ఏవేవో సంగతులు మాట్లాడాడు షాడో. అన్ని మాటలు మాట్లాడినా కాకా ఆ యువతి ప్రసక్తే ఎత్తకపోవటం అతన్ని ఆశ్చర్య పరచింది.

క్రమ- క్రమంగా వీధిలో జనం పలచబడసాగారు. ఒకరిద్దరు తప్ప మరెవ్వరూ వీధిలో తిరగడంలేదు. ఒకసారి భంగు కొట్టుదాకా పోయి వస్తానని చెప్పి బయలుదేరాడు. కొట్టు గుమ్మం వద్దే అతన్ని నిలబెట్టిందొక ఆకారం.

"భయ్యా! ఒక్కగ్లాసు పోయించు చాలు. ఇక మళ్ళీ అడగను" చిక్కి ఎముకలు బయటకు కనిపిస్తున్న ఆ ఆకారాన్ని చూసి జాలిపడ్డాడు షాడో.

రమ్మని సైగచేసి లోపలకు పోయాడు. ఒక చివర పెద్ద బల్లమీద కుండలతో భంగుపోసి ఉంచి, అందులోనుంచి లోటాలకు నింపుతున్నాడు పొట్టిగా- గున్న ఏనుగులాగా ఉన్న వ్యక్తి.

రూపాయి నాణేన్ని అతనిముందు పడేసి, తన వెనుక బెదురు చూపులు చూస్తూ నిలబడి ఉన్న ఎముకల గూడు వైపు చెయ్యి చూపించాడు. మొదటి లోటాను అందుకొని, గట- గటా తాగి ఖాళీ

చేశాడతను. రెండవది మరికొంత నెమ్మదిగా... మూడవది ఆర్చుకొని -ఆర్చుకొని పెదవులు చప్పరించుకొంటూ తాగాడు.

"సుక్రియా భయ్యా" అంటూ లోటా కిందబెట్టి బయటకు వెళ్ళిపోయాడు.

"నువ్వు ఈ ఊరికి కొత్తవాడిలా ఉన్నావే? ఒకసారి ఆ భంగుగాడికి భంగు పోయించావంటే ఇక నిన్ను వదలడు. రోజూ నీ వెనకే పడతాడు" హెచ్చరించాడు లావుపాటి వ్యక్తి.

మరీ మంచిదనుకున్నాడు షాడో. త్రాగుబోతుల నోటికి తాళం వుండదు. దుకాణపు యజమాని ఆఫర్ చేసిన భంగును మృదువుగా తిరస్కరించి బయటకు వచ్చాడు ఆ పరిసరాల్లో భంగు ఎక్కడా కనిపించలేదు.

గ్రామమంతా ప్రశాంతంగా వుంది. ఉన్నట్లుండి అక్కడక్కడా ఆరున్నొక్క రాగంలో మొరుగుతున్న కుక్కల అరుపులు తప్పించి మరే విధమైన శబ్దం వినరావటం లేదు. చల్లగాలి రివ్వుమంటూ వీస్తున్నది. భంగు దుకాణం పక్కనే ఉన్న బాడిత చెట్టు కిర్రుమంటూ విసుక్కుని తిరిగి నిద్రలోకి జారిపోయింది.

పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని ఈలవేస్తూ తన గదికి బయలుదేరాడు షాడో. తన ఎంక్వయిరీ రేపటినుండి మొదలుపెట్టాలి.

మొదట భంగును ప్రశ్నించి వీలైనంత సమాచారం రాబట్టాలి! అని నిశ్చయించుకొని హుషారుగా అడుగులు వేయసాగాడు.

చీకటి మాటున తనను చుట్టుకున్న ఆకారాలు దగ్గిర కొచ్చిన దాకా గమనించలేక పోయాడు. తీరా చూసేసరికి సమయం మించిపోయింది. జేబుల్లోని చేతులు బయటికి రాకముందే ఒక బలమైన చెయ్యి అతన్ని నేలకు కరిపించింది. షాడో కళ్ళముందు మెరుపులు మెరిశాయి. నెమ్మదిగా లేవటానికి ప్రయత్నించాడు. ఒక ఆకారం చొక్కా పట్టుకొని పైకిలాగి నిలబెట్టింది. మరొకటి పొట్టలో కుమ్మింది. ఊపిరి ఆగిపోయి, బాధతో నరాలు జివ్వుమన్నాయి. చేతులు పొట్ట కడ్డం పెట్టుకున్నాడు. ముఖంమీద బలంగా పడింది పిడికిలి పోటు. పళ్ళు జవ- జవలాడి ఊడి పోయినట్లు ఫీల్ అయ్యాడు. బూటు కాలాతో మోకాళ్ళమీద బలంగా తన్నింది మరొక ఆకృతి. చాప చుట్టలాగా నేల దొర్లాడు షాడో.

రివాల్వరు కోసం చేయి అప్రయత్నంగా వెనక్కు పోయి ఖాళీగా తిరిగి వచ్చింది. రివాల్వర్ లేదు! భోజనానికి పోయే సమయంలో టేబుల్ మీద పెట్టి వచ్చాడు. పళ్ళు బిగపట్టి బాధను సహిస్తూ స్పృహ తప్పించే ఆఖరి దెబ్బకోసం ఎదురు చూస్తూ, ప్రతిఘటించటానికి ప్రయత్నించాడు.

ఎగిరి, పొట్టమీద మోకాళ్ళతో కుమ్మాడొక వ్యక్తి. ఒక్క క్షణం- ఒక్క క్షణం ఆ నెప్పి మెదడును చేరుకొని, మెలి తిరుగుతూ కళ్ళు

మూసుకునే ముందు పొట్టమీది వ్యక్తిని చూశాడు. రైఫిల్ యువతితో చనువుగా మాట్లాడినది అతనే! అంటే - తన్ను అవమానించినందుకు ఆమె తీర్చుకుంటున్న ప్రతీకారమా ఇది?

"ఇక చాలు. అతన్ని వదిలిపెట్టండి..." ముద్దమాట లతో బింకంగా పలికిందొక కంఠం. వెంటనే భంగును గుర్తించాడు షాడో.

"అరే భంగురా. వీడి కింత ధైర్యం ఎలా వచ్చింది?" పలికిందొక స్వరం.

చేతిలో వున్న గ్రీనర్ గన్ ను అర్ధచంద్రాకారంగా గాలిలో తిప్పాడు భంగు. "నా ధైర్యం సంగతి పట్టించుకోక పోయినా దీని దెబ్బకు ఆగలేరు మీరు. వూ వదలండి."

"భంగూ! తాగిన మైకంలో ఎవరితో తలపడుతున్నావో తెలుసా? షంషేర్ తో కయ్యం నిప్పుతో చెలగాటమనే సంగతి మర్చిపోకు"

"పోబే లఫూట్! నువ్వేం చెయ్యగలవురా? నాకు భంగు దొరక్కుండా చేస్తావ్ అంతేగా! ట్రిగ్గర్ నొక్కానంటే దెబ్బకు పాతిపెట్టడానికి ఎముకలు కూడా కనపడవు. అతన్ని వదలండి." రెచ్చిపోయి గర్జించాడు భంగు.

"వీడి సంగతి తర్వాత చూసుకోవచ్చు. పదండిరా" అంటూ లేచాడు షంషేర్.

షాడో చొక్కా పట్టుకొని లేపి ముఖంలో ముఖంపెట్టి కర్కశంగా పలికాడు.

"రేపు సాయం సమయం లోపల జగత్‌పురా సరిహద్దులు దాటాలి. సాయంకాలం దాటిన తర్వాత నాకు కనిపించావో నరికి వుప్పు పాతర వేస్తాను జాగ్రత్త"

బిలబిల మంటూ ఎంత నిశ్శబ్దంగా వచ్చారో అంత నిశ్శబ్దంగానే మాయమయ్యారు వారందరూ. తూలుతూ లేచి నిలబడటానికి ప్రయత్నించాడు షాడో. గ్రీనర్ ఒక చెట్టు కానించివచ్చి సహాయం చేశాడు భంగు. నెమ్మదిగా నడిపించుకుంటూ అతని కుడివైపు దారి తీశాడు. పది అడుగులు వేసేసరికి కొంచెం శక్తి పుంజుకున్నాడు షాడో. థాంక్స్ చెపుతూ భంగు చేతులను వదిలించుకొని, తడబడతున్న పాదాలతో, తాగినవాడిలా తూలుతూ, కాకా యింటిని సమీపించి వరండా మెట్లెక్కాడు.

లోపల మెట్లదగ్గిర కూర్చుని కాకాతో మాట్లాడుతుంది ఆ యువతి. షాడో అవతారం చూసి అదిరిపోయి, చేతిని గుండెలమీద పెట్టుకొని నిలబడింది.

చొక్కా పూర్తిగా చిరిగి పేలిక లయింది. రక్తంతో ముఖమంతా తడిసివుంది. ఎడమకన్ను వాచి మూసుకుపోయింది. కంటి చుట్టూ కరుడుకట్టి నీలంగా తయారయింది. పెదవులు తెగి లావెక్కాయి.

ముక్కునుంచి రక్తం బొట్లుబొట్లుగా కారి గుండెలమీదికి జారుతుంది. బూటుకాళ్ళతో తొక్కటం వల్ల చేతి వెనుక భాగాలు చర్మం తొలగి ఎర్రగా మాంసం ముద్దల్లా కనుపిస్తున్నాయి.

ఎర్రపడిన కళ్ళతో ఆమెను చూశాడు షాడో. తను ఏం తప్పు చేశాడని యిలా చితక కొట్టిస్తుంది?

"చూడు బాగా చూడు. నీ తిండి తినే కుక్కలు పని బాగా చేశారో లేదో లైటు వెలుగులో జాగ్రత్తగా పరీక్షించి చూసుకో"

అతని మాటలు అర్ధంకాక బిత్తరపోయి చూడసాగిందామె.

"ఒకటి మాత్రం గుర్తుపెట్టుకో. నీ జన్మలో ఎప్పుడూ మగవాడిని రెచ్చగొట్టబోకు. పగ ఉంటే చూపించు. అంతే గాని, ఇలా కుక్కకంటే హీనంగా విరగ ద్రొక్కించ టానికి పాల్పడకు. నిన్ను ముద్దు పెట్టుకున్నాననేగా నీ కక్ష. నా గదిలో జొరపడి సామానులు వెతకటానికి అంతకంటే మంచి బహుమానం యింకేం కావాలి?" అని మెట్లమీద కాలుపెట్టి ఎక్కుతూ జారి కిందపడ్డాడు. కాకా ఒక్క గంతు లో వచ్చి సహాయం చెయ్యటానికి ప్రయత్నించాడు. అతని చేతులు విసిరికొట్టాడు షాడో. తను పగబడితే ఎలా వుంటుందో ముద్ద ముద్ద మాటలతో చెప్పటానికి ప్రయత్నిస్తూ అతి కష్టం మీద మెట్లెక్కి గది తలుపులు తోసుకొని లోపలకు వచ్చాడు. తలుపులు వేయటానికి కూడా శక్తిలేక మంచంమీద పడిపోయాడు. తనకేం తెలియదనీ, తనీ

పని చేయలేదని మెట్ల మధ్యకువచ్చి అరిచిందా యువతి. షాడో ఆ మాటలు వినిపించుకోలేదు.

నిశ్శబ్దంగా షాడోకు తెలియకుండా అతని వెనకాలే వచ్చి, తలుపులు మూసి, ఏదో ఆలోచనలతో తల పంకిస్తూ వెళ్ళిపోయాడు కాకా.

4

తెల్లవారు ఝామున తగిలిన చలిగాలికి మెలకువ వచ్చి లేచాడు షాడో. వళ్ళంతా బిగదీసుకు పోయి, కదిలిస్తే నక్షత్రాలు కనపడుతున్నాయి. అలాగే పెదవులు బిగపట్టి లేచి కిటికీ తలుపులు తెరిచాడు. లోపలికి వచ్చిన ఆ చలిగాలిని గుండెల నిండుగా పీల్చుకున్నాడు. దిమ్మెక్కిన తల నరాలు సళ్ళిచ్చినట్లనిపించింది. పక్కనే ఉన్న కూజాలో నీటిని వంచుకొని ముఖంమీద గడ్డకట్టిన రక్తాన్ని శుభ్రం చేసుకున్నాడు. వళ్ళు కూడా తడిగుడ్డతో తుడుచుకొని ఫస్ట్ ఎయిడ్ కిట్ లో నుంచి టించర్ అయోడిన్ తీసి గాయాలకు అంటించాడు. చుర్రుమని తాటాకు మంటలా క్షణంపాటు అతని కళ్ళల్లో నీరు తెప్పించింది ఆ మంట.

చిరిగిపోయిన పాంటు, షర్టు మూలకు విసిరి బాగ్ లోంచి ఇంకో జత తీసి ధరించాడు. రివాల్వరును, డాగర్ ను వాటి స్థానాలకు చేర్చి, గదిలో నిశ్శబ్దంగా అటూ ఇటూ పరుగెత్తాడు. అవయవాలను స్వాధీనపరచుకోవటానికి. రివాల్వరు పట్టుకుంటే చేతి కణుపులు

నెప్పి పుడుతున్నాయి. అయినా అవసరమైతే ఆ నొప్పిని భరించ గలనని నిశ్చయపరచుకొని సిగరెట్టు పాకెట్టుకోసం జేబులు తడుము కున్నాడు. కింద పడవేసిన పాంటు జేబుల్లో కూడా కనుపించలేదు. రాత్రి జరిగిన దొమ్మీలో ఎక్కడో జారిపోయి ఉంటుంది.

బాగ్ లో నుంచి మరొక పనామా ఫ్రష్ పాకెట్టు తీసి సిగరెట్టు వెల్గించాడు. మంచంమీద కూర్చున్నాడు. ఎర్రటి కాంతి కిరణాలు కొండల వెనుక నుంచి బయటకు వస్తున్నాయి. పశువుల అరుపులతో , పక్షుల కిలకిలా రావాలతో గ్రామం సందడిగా తయార యింది. తనూ భోజనం చేసిన యింటి ముందు అనేకమంది నిలబడి ఉండటం చూసి, టిఫిన్ లాంటిదేమైనా దొరుకుతుందేమో, తిని వద్దామని బయలుదేరాడు.

ఇక తన ఐడెంటిటీ దాచి లాభంలేదు. రాత్రి జరిగిన సంఘటన ఈ పాటికి ఊరంతా పాకిపోయి ఉంటుంది. పోలీస్ ఆఫీసర్ గా ప్రశ్నించినా, ఉట్టి 'రాజు'గా ప్రశ్నించినా లభించే సమాధానం ఒక్కటే.

బెల్టు వెనుక ఉన్న చిన్న అరలో నుంచి అండమాన్స్ పోలీస్ అధికారి బాడ్జీ తీసి, శుభ్రంగా తుడిచి మెరుగుపెట్టి గుండెలమీద తగిలించుకున్నాడు.

తలుపులు దగ్గిరగా వేసి కిందకి వచ్చాడు. యధాస్థానంలో కూర్చుని ఉన్నాడు కాకా. టక -టకా బూట్లు చప్పుడు చేస్తూ కత్తిలా

నడిచిపోతున్న షాడోను చూసి ఆశ్చర్యంతో కళ్ళెగరేశాడు. "మనిషా? ఉక్కుముక్కా? రాత్రి తిన్న దెబ్బలకు వేరొక మనిషి అయితే వారం రోజులు మంచం వదలడు' అనుకున్నాడు మనస్సులో.

తనేపీట వాల్చుకు కూర్చున్నాడు షాడో. గదిలో ఉన్న వ్యక్తులందరూ తలలు వంచుకొని పక్క చూపుల్తో షాడోనే గమనించ సాగారు. పిల్ల తెచ్చిన పుల్కాలు అరడజను పట్టించి, పెద్ద గ్లాసుతో యిచ్చిన ఆవుపాలు గట -గటా త్రాగి బ్రేవున త్రేన్చాడు షాడో. విస్మయంతో చూస్తున్న ఆ బాలిక వంక చూసి చిరునవ్వు నవ్వాడు.

"మీ స్నేహితురాలి ఘన కార్యమే యిది" ఎడమ చేత్తో వాచిపోయిన కంటిని అద్దుకుంటూ బాగా ఉన్న కుడి కన్ను గీటి అన్నాడు.

సిగ్గుతో ముఖం ఎర్రబడిందా బాలికకు. "ఈ పని ఆమె చేయించలేదు. ఏదో పొరపాటు జరిగిపోయింది. ఆమెను అవమానించకండి. అదీ గాక ఆమె నా స్నేహితురాలేం కాదు" చివరిమాట కొంచెం గట్టిగా, పట్టుగా అంది.

"ఈజీ, ఈజీ, బేబీ, నేను నిన్నేమీ అనటంలేదులే" అంటూ డబ్బిచ్చి బయటకు వచ్చాడు షాడో. కాకా ఇంకా అక్కడే కూర్చొని ఉన్నాడు. ఇక తన అథార్టీ ఎలా చెలాయించుదామని కాకాను సమీపించాడు.

"రా బాబూ! కూర్చో" అంటూ కుర్చీ చూపించాడు కాకా. " అప్పుడే అవయవాలు స్వాధీనపర్చుకొని వీధులలో తిరుగుతున్నావే?" చిరునవ్వుతో ప్రశ్నించాడు.

షాడో సిగరెట్టు కోసం జేబులో చేయి పెట్టటం చూసి పక్కనే ఉన్న పనామా పాకెట్టు అందించాడు. "రాత్రి వీధిలో పడిపోయినట్లుంది. మన పచారీ కొట్టు డేవిడ్ కు దొరికిందట. ఇందాకే తెచ్చి యిచ్చాడు."

ఆ పాకెట్టు నలిగి సిగరెట్లు చెత్తగా తయారయ్యాయి. వాటిని జేబులో పడవేసుకొని రెండో పాకెట్టులో నుంచి సిగరెట్టు తీసి వెల్గించాడు.

గట్టిగా రెండు దమ్ములు లాగి పొగవదులుతూ అంతకు ముందే నిర్ణయించుకున్న ప్రకారం ఎంక్వైరీ ప్రారంభించాడు.

"నిన్న నేను ఎక్కడినుండి వస్తున్నానని అడిగారు కదూ! ఇప్పుడు నిజం చెపుతాను" అంటూ బాడ్జ్ చూపించాడు.

"ఓహో!" అని తలూపి చుట్టకాల్చటంలో నిమగ్నుడై పోయాడు కాకా.

"కాకా! పోలీస్ అధికారిగా నిన్ను కొన్ని ప్రశ్నలడగదలిచాను. జవాబిస్తావా?"

"అడుగుబాబూ! తెలిస్తే చెపుతాను"

"దేవరాజు అని ఒక హంతకుడు మమ్మల్ని ఏమార్చి ఈ ప్రాంతాలకు వచ్చినట్లు తెలిసింది. అతని ఆచూకీ ఏమైనా యివ్వగలవా?"

"దేవరాజా? ఇదే మొదటిసారి ఆ పేరు వినటం"

"పోనీ - నాగూర్ ముతాను గురించి తెలుసా?"

"తెలియకేం బాబూ! మా పశువుల్ని దోచుకొని అష్టకష్టాలు పెడుతున్నాడు. ఈ కొండల్లోనే ఎక్కడో వుంది వాడి స్థావరం."

"దేవరాజు గురించి వాకబు చెయ్యటానికి చక్రవర్తి అనే సి.ఐ.డి. యిక్కడకు వచ్చాడు."

"ఏ చక్రవర్తి? అటువంటి పేరు గల వారెవ్వరూ ఈ ప్రాంతాలకే రాలేదే"

ఎందుకైనా మంచిదని చక్రవర్తిని వర్ణించి చెప్పాడు షాడో. అయినా ఫలితం కన్పించలేదు. తనకు తెలియదు పొమ్మన్నాడు కాకా.

చేసేది లేక బయటకు వచ్చాడు షాడో. ఒక యింటి గోడ కానుకొని ముణగ దీసుకొని కూర్చొని కనిపించాడు భంగు. రాత్రి ఎనలేని తెంపరితనంతో తన శత్రువుల్ని పారద్రోలిన భంగుకూ, ఇక్కడి చెత్తకుప్పల పక్కన కూర్చున్న భంగుకూ ఎక్కడా పోలికలు

కనిపించలేదు. షాడో సమీపించగానే వణుకుతున్న చేతులతో ముఖం రుద్దుకుంటూ లేచి నిలబడ్డాడు భంగు.

"భయ్యా...ఒక్క..."

"ఆల్ రైట్ భంగూ! ఒకటేమిటి? నీ కడుపు పట్టినంత పోయిస్తాను రా!" అంటూ భుజంమీద చెయ్యివేసి భంగు కొట్టుకు దారితీశాడు షాడో.

వారిద్దరూ అలా పోవటాన్ని గమనించి గ్రామవాసులందరూ వింతగా చూడసాగారు. వారిని గురించి పట్టించుకోకుండా కొట్టులోకి ప్రవేశించాడు షాడో.

అప్పుడే దుకాణం తెరచి బల్లలు తుడుచుకుంటున్నాడు ఓనర్. షాడోనూ, భంగునూ చూసి ముఖం మార్చుకున్నాడు.

"భంగు లేదయ్యా! ఇప్పుడు దొరకదు"

రూపాయి కాగితాన్ని అతని ముఖం మీదికి విసిరాడు షాడో. సిగరెట్టు పెదవుల అంచులకు చేర్చి గోడ కానుకొని నిలబడ్డాడు.

"నా స్నేహితుడు భంగూ, భంగు కావాలన్నాడు. నేను యిప్పిస్తానని తీసుకు వచ్చాను. మర్యాదగా ఆ కుండలో ఉన్నది లోటాలలో నింపి అతనికి అందిస్తావా? లేక పగిలి పోయిన కుండల్ని చూసుకొని ఏడుస్తూ కూర్చుంటావా?"

"నువ్వంటున్న దేమిటి? ఇది నా కొట్టు. నా ఇష్టం. నువ్వు బెదిరించినంత మాత్రాన భయపడతాననుకోబోకు"

"లైసెన్స్ లేకుండా మత్తుపానీయాలమ్మటం నేరం. నీకు అలాంటిదేమీ లేదని నాకు తెల్సు. ఈ కొట్టు మూయించటం క్షణంలో పని. చూస్తావా?" ఒక్కొక్కమాటే వత్తి పలికాడు షాడో.

బల్లను తుడుస్తున్నట్లు తుడిచి, డ్రాయర్ లోంచి చిన్న రివాల్వరును బయటకు తీశాడు దుకాణపు యజమాని.

"నీలాంటి వాళ్ళ నెందరినో-"

ఫట్ మంటూ ఆ రివాల్వర్ ఎగిరి ఒక చిన్న భంగు కూజాకు తగిలింది. కాలు నేలకు వాలగానే ముందుకు గెంతి అతని చొక్కా పట్టుకొని బల్లమీదికి పడలాగాడు షాడో. కూజా పగిలి భంగు నేలపాలయింది.

"మీ గ్రామవాసులకు పోలీసులంటే ఇంత నిర్లక్ష్యమా? మీ మాటలు మీవేగాని ఎదుటి వ్యక్తిని పట్టించుకోరా?"

"భంగూ... తాగు మొత్తం ఉన్న కుండలన్నీ ఖాళీచెయ్యి. నువ్వు తాగినంత తాగి మిగిలింది బయట పారబొయ్యి. ఎవడడ్డం వస్తాడో చూస్తాను." పళ్ళు పట పట కొరుకుతూ హెచ్చరించాడు.

భయంతో వణికిపోతూ చేతులు జోడించాడు దుకాణపు యజమాని.

"అయ్యా క్షమించండి. మీ సంగతి తెలియక అలా అన్నాను. రాత్రి షంషేర్ వచ్చి భంగు గాడికి పానీయం యిస్తే నా చర్మం వలిచి చెప్పులు కుట్టించుకుంటానని బెదిరించి పోయాడు. అతన్ని ఎదిరించి నిలబడే ధైర్యం నాకు లేదు. నన్నేం చేయమంటారు?" కంటివెంట నీరు తిరుగుతుండగా గద్గద స్వరంతో ప్రార్ధించాడు.

అతని చొక్కానువదిలి వెనుతిరిగాడు షాడో. "ఆల్ రైట్. ఈ సారి నిన్ను షంషేర్ ఏమయినా అంటే నాతో చెప్పు. వాడి అంతు చూస్తాను భంగు నా స్నేహితుడు. అతనినేమైనా అన్నావో నేనే నీ చర్మం ఒలిచి బయట ఆరవేస్తాను."

ఆత్రంగా లోటాల మీద లోటాలు ఖాళీ చేస్తున్న భంగును చూసి నవ్వుకుంటూ బైటికి వచ్చి, పచారీ కొట్టుకేసి బయలుదేరాడు.

లోపల జరిగిన గొడవ కిటికీ సందుల నుండి చూసి అందరికీ టాం-టాం చేశారు కొందరు కుతుహలపరులు. షాడోనుచూసి పక్కలకు తప్పుకుంటున్నారందరూ. పచారీ కొట్టును సమీపించి సిగరెట్టు వెలిగించుకుంటూ నిలబడ్డాడు షాడో. అతన్ని చూసి బయటకు వచ్చాడు షాపు యజమాని డేవిడ్.

"చాలా థేంక్సండి! నా సిగరెట్టు పాకెట్టు జాగ్రత్తపరిచి నందుకు"

చిరునవ్వుతో లోపలికి ఆహ్వానించాడు షాడోను. కొట్టులోపల మరొక మధ్య వయస్కుడు కూర్చొని ఉన్నాడు. "ఈయన లక్ష్మణ్ అని మా గ్రామపు వడ్రంగి, కమ్మరి అన్నీ..." అంటూ అతనికి పరిచయం చేశాడు డేవిడ్. నవ్వుతూ నమస్కరించాడు షాడో.

బాడ్జిని చూపించి తను వచ్చిన పని చెప్పాడు. వెను వెంటనే "చక్రవర్తి మీకు తెలుసా?" అడిగాడు షాడో.

"చక్రవర్తా? ఏ చక్రవర్తి? అలాంటి పేరుగల వారెవ్వరూ యిక్కడ లేరే!"

"దేవరాజు"

"ఏమో తెలియదు"

కూడబలుక్కున్నట్లు అందరూ ఒకే సమాధానం యివ్వటం చూసి షాడో వళ్ళు మండింది

"చూడండి. ఈ గ్రామంలో ఉన్నవారందరిలోనూ ధనవంతులు, మర్యాదస్తులు మీరు. అందరికీ నాయకులుగా ప్రజలను మంచి దోవను నడిపించవలసిన మీరే యిలా పోలీసులకు సమాధాన మివ్వకుండా పెడదోవలు పట్టించటం న్యాయమా?"

"మీరంటున్నదేమీ మాకర్థం కావటంలేదు. ఇందులో మిమ్మల్ని మోసగించటమనే ప్రసక్తే లేదు. మీరడిగిన వ్యక్తులు ఎవరో మాకు తెలియదు. అంతే"

వస్తున్న కోపాన్ని దిగమించుకొని యిక పోతానని లేచాడు షాడో. భుజం మీద చెయ్యివేసి నెమ్మదిగా అడిగాడు లక్ష్మణ్.

"నేరాలను రూపు మాపవలసిన మీలాంటి పోలీసు ఆఫీసర్లే గ్రామస్థులను బెదిరిస్తే ఎలా?"

"ఎవరిని బెదిరించాను?" ఆశ్చర్యంతో అడిగాడు షాడో.

"మోటూభాయిని. వాడి భంగు కుండలు పగలకొడతానన్నారటగా ఒక త్రాగుబోతు వెధవకోసం మర్యాదస్తులను హింసిస్తారా?"

షాడో కోపం తారాపథాన్ని చేరింది.

"ఓహో! మీరు, మీ మోటుభాయి మర్యాదస్తులా? భంగు త్రాగుబోతు వెధవా? రాత్రి నిష్కారణంగా ఒక మనిషిని పదిమంది చితకబాదుతుంటే మీరు, మీ మర్యాదస్తులు ఏమైపోయారు? "మనకెందుకులే" అని ముసుగులు తన్ని గురకలు పెడుతున్నారా? మీరంటున్న త్రాగుబోతు భంగూ నిజమైన మనిషి. రక్తమాంసాలున్న మానవుడు. ధైర్యంతో అంతమందిని ఎదురించి సాటి మానవుడికి తోడు నిలిచాడు. అధర్మాన్ని ఎదురించాడు. మీ మర్యాదస్తులు ఏం చేస్తున్నారు? రెండు ప్రశ్నలకు సమాధానాలు చెప్పటానికి

నిరాకరిస్తూ, ముఖా ముఖాలు చూసుకుంటున్నారు. యిక ముందు భంగును గురించి నా ఎదుట హీనంగా మాట్లాడకండి. అతనిలో ఉన్న స్థయిర్యం పదోవంతు మీకు ఉంటే మా పోలీస్ డిపార్టుమెంటు యిలా హీనంగా ఉండేదికాదు" పట్టరాని కోపంతో నిప్పులు కక్కాడు.

సిగ్గుతో తలలు వాల్చుకున్నారు వారిద్దరూ. ఏమని చెప్పగలరు? ఎలా అతనివంక చూడగలరు?

గబగబా అడుగులు వేస్తూ తన గదిని చేరుకున్నాడు షాడో. కూజాతో నీటిని అతని గదిలోపెట్టి మెట్లు దిగుతూ ఎదురయింది ఆ పిల్ల. షాడోను చూసి, తల వంచుకొని వేగంగా పక్కకు తప్పుకొని దిగిపోయింది. ఒక్కక్షణం ఆమె కళ్ళల్లో మెరిసిన తనమీది గౌరవ భావం షాడో నిశిత దృష్టిని తప్పించుకోలేక పోయింది. తనమీద అంత గౌరవం కలుగజేసిన సంఘటన ఏమి జరిగిందో అతనికి అంతు బట్టలేదు.

గది తలుపులు వేసుకొని బాగ్ లోనుంచి ఒక పొడుగాటి ఆయిల్ గుడ్డల మూటను తీశాడు. అందులో నుండి రైఫిల్ పార్ట్ లను తీసి బిగించసాగాడు. పది నిముషాలలో రైఫిల్ తయారయింది. ఒక అట్టలో ఉన్న బుల్లెట్స్ మాగజైనులోకి ఫీడ్ చేసి శుభ్రంగా గుడ్డపెట్టి తుడుస్తున్నాడు.

ఛళ్ళుమన్న కొరడాదెబ్బ పిస్టల్ మోతలా ఆ పరిసరాలలో ప్రతిధ్వనించింది. "అమ్మో" అన్న ఆర్తనాదం ఆ ధ్వనిని అనుసరించింది.

రైఫిల్ మంచంమీద పడవేసి కిటికీలోనుండి బయటకు చూశాడు షాడో. నడివీధిలో భంగును పశువును కొట్టి నట్లు కొరడాతో కొడుతున్నాడొక వ్యక్తి. కొరడా కొసను మెడచుట్టూ తిప్పి నేలమీద పడేసి ఈడుస్తున్నాడు. కిటికీ మూసి రైఫిల్ అందుకొని పరుగు పరుగున వరండాలోకి వచ్చాడు షాడో. చూస్తుండగానే మరో రెండు దెబ్బలు భంగుమీద పడ్డాయి.

వీధిలో జనం గుంపులు -గుంపులుగా నిలబడి చోద్యం చూస్తున్నారు. చుట్ట కాలుస్తూ ప్రశాంతంగా కుర్చీలో కూర్చుని వున్నాడు కాకా. "ఆ నాగూర్ ముఠాకు చెందిన వ్యక్తి బాబూ! దారికి అడ్డం వచ్చాడని చెప్పి భంగును చితకబాదుతున్నాడు."

"మీ పెద్దలందరూ ఏం చెయ్యకుండా నోళ్ళు తెరుచుకు చూస్తున్నారు అంతేకదూ!" అంటూ అసహ్యంగా చూసి మెట్లు దిగాడు షాడో. రైఫిల్ భుజాని కానించుకొని ట్రిగ్గర్ నొక్కాడు. ఆ మనిషి చేతిలోని కొరడా రెండుగా తెగి, హేండిల్ మాత్రం అతని చేతిలో మిగిలిపోయింది.

"బక్కచిక్కిన బలహీనుల మీద కాదురా నీ బలప్రదర్శనం, నామీద చూపించు" అంటూ సమీపించి రైఫిల్ తిరగవేసి చెంపమీద కొట్టాడు రెండు గజాలు ఎగిరిపోయి పడ్డాడు ఆ వ్యక్తి.

బెల్టుకున్న కత్తిని తీయటానికి ప్రయత్నించాడు. మళ్ళీ రైఫిల్ ఎత్తి గొడ్డలిలా మణికట్టుమీద కొట్టాడు షాడో. మణికట్టు ఫట్ మంటూ విరిగిపోయింది. బాధతో అతను గిలగిల్లాడాడు. రైఫిల్ వదలి చొక్కా పుచ్చుకొని గుంజిలేపి నిలబెట్టాడు షాడో. ఎడాపెడా దెబ్బల వర్షం కురిపించాడు. చేతులు అడ్డం పెట్టటానికి కూడా శక్తిలేక నీరసంగా వ్రేలాడిపోయాడతను.

అందరూ నోళ్ళు తెరుచుకుని చూస్తున్నారు. పచారీ కొట్టు డేవిడ్, వడ్రంగి లక్ష్మణ్, కాకా, భోజన హోటల్ లావుపాటి ఆడమనిషి, అక్కడ పనిచేసే బాలిక, అందరూ బయటికి వచ్చి నిలబడ్డారు.

ఒక్క తోపులో ఆ వ్యక్తిని వెనక్కుతోసి చేతులు దులుపుకొని రైఫిల్ అందుకున్నాడు షాడో. "నేను పోలీస్ అధికారిని. ఈ గ్రామంలో నేనున్నంతవరకూ ఇటువంటి కిరాతకాలు జరగటం సహించను. ఇటువంటి పనులు ఎవరు చేసినా, తగినశాస్తి చేస్తాను - జాగ్రత్త " అని, రైఫిల్ గాలిలోకి పేల్చి, అందర్నీ హెచ్చరించాడు. కుంటుకుంటూ లేచి వెళ్ళిపోయాడు నాగూర్ ముఠా అనుచరుడు.

భంగూను సాయంపట్టి లేపి కూర్చోబెట్టాడు షాడో. "భంగూ! దెబ్బలు బాగా తగిలాయా?" ఆప్యాయంగా పలకరించాడు.

"లేదు భయ్యా. ఏదో కొంచెం..."

"నా గదికి రా భంగూ! కొంచెం విశ్రాంతి తీసుకుపోదుగాని"

"లేదులే భయ్యా! మై ఠీక్ హోగయా" అంటూ లేచి వెళ్ళిపోయాడు భంగు. అతని వంకే రెండు నిముషాలు చూస్తూ నిలబడ్డాడు షాడో. ఊరిపక్కన ఉన్న నదికేసి పోయి చెట్ల తోపులో ప్రవేశించి కనుమరుగయ్యాడు భంగు.

"అతనికి తగినశాస్తి చేశావ్ బాబూ! యింతకాలం నాగూర్ ముఠాను ఎదురించగల ధైర్యం ఎవ్వరికీ లేకపోయింది" కాకా వచ్చి షాడో భుజం తడుముతూ ప్రశంసించాడు. డేవిడ్ , లక్ష్మణ్ మొదలైన వారందరూ వచ్చి అతన్ని అభినందించారు

"ఇక కొంచెం వెనకా ముందూ చూసుకొని సంచరించటం మంచిది రాజు! నాగూర్ పాములాంటి వ్యక్తి. తన అనుచరుణ్ణి కొట్టావని తెలిసి పగ బట్టాడంటే, నీ అంతు చూసిగాని నిద్రపోడు" అని హెచ్చరించాడు కూడా.

"నాగూర్ ను గురించి కాదు కాకా నా ఆలోచన - భంగును గురించి. ఆ తాగుబోతు మనిషిలో జాలిగుండె నిండుగా వుంది. అతనిని మంచి

మార్గంలో పెట్టే దారికోసం అన్వేషిస్తున్నాను." సాలోచనగా అన్నాడు షాడో.

"ఎవరూ? భంగా? మంచిగా మారటమా? కలలు కనబోకు బాబూ! మేమందరం శక్తివంచన లేకుండా ప్రయత్నించాం. పనికూడా కల్పించి సహాయం చేశాం. కూలీ డబ్బులు చేతిలో పడగానే సరాసరి భంగుకొట్టుకు పోయేవాడు. అంతే..." కాకా మాటలు నిరుత్సాహ పరిచినా ఆలోచనలను మానలేదు షాడో.

5

తలుపులు తోసుకొని ట్రేలో భోజనం పెట్టుకువచ్చింది ఆ పిల్ల. ఉన్నట్లుండి తనకు రాయల్ ట్రీట్ మెంట్ రావటంతో కొంచెం విస్తుబోయాడు షాడో. ట్రేను బల్లమీద పెట్టి తల వంచుకొని బొటనవేలితో నేలమీద గీతలు గీస్తూ నిలబడింది. తనతో ఏదో చెప్పటానికి సంకోచిస్తున్నదని గ్రహించి మృదువుగా అడిగాడు.

"నాకు యింతవరకూ నీ పేరు చెప్పలేదు"

"చిలక"

ఎవరు పెట్టారోగాని ఆలోచించి అతికినట్లు పెట్టారనిపించింది షాడోకు. "ఏమిటి చిలకా? నాతో ఏం చెపుదామనుకుంటున్నావ్?"

"ఏంలేదు... ఏమీలేదు... పొద్దుట మీరు వాడిని కొట్టి మంచిపని చేశారు. ఆ పెధవకు తగిన శాస్తి జరిగింది. మా నా - కాదు... అదే భంగును - పాపం. అనవసరంగా హింసించాడు."

"భంగు ఎవరో నీకు తెలుసా చిలకా? అతని పేరు చెప్పటానికి తడబాటెందుకు?"

"అబ్బే నాకు తడబాటెందుకు? భంగు నాకు ఏమీ కాడు." తడబడుతూ అని బయటకు పరుగెత్తింది.

ఆలోచనలతో భ్రుకుటిని ముడివేసి భోజనం కానిచ్చాడు షాడో. ట్రేను తీసుకు పోవటానికి తిరిగి వచ్చింది చిలక. తల వంచుకొని బయటకు పోతుండగా ఆపాడు.

"పోనీ. నన్ను కొట్టించిన అమ్మాయిని గురించి నీకు తెలుసా? వాళ్ళు ఎక్కడ ఉంటారు?"

"ఎవరు? రోజీ సంగతా? ఆమె నిన్ను కొట్టించలేదని కాకాతో చెప్తుంటే నేను స్వయంగా విన్నాను. వాళ్ళు యిక్కడికి నాలుగుమైళ్ళ దూరంలో బోయరా లోయలో ఉంటారు. వారి పశువుల శాలలు, ఇళ్ళు అన్నీ అక్కడే ఉన్నాయి."

"చిలకా! యింక ఒక్కటే ప్రశ్న అడుగుతాను. దాచకుండా నిజం చెప్పు. చక్రవర్తిని..."

"నాకేమీ తెలియదు.  నన్నేమీ అడగకండి!" అంటూ మెట్లు దిగి పారిపోయింది చిలక.

పనామా వెళ్గించి దీర్ఘాలోచనలో పడ్డాడు షాడో.  తన ముందు వచ్చిన సి.ఐ.డి. లు  ఎందుకని ఫెయిలయ్యారో యిప్పుడర్థమయింది. ఒక హోటల్లో పనిచేసే పిల్లకూడా సమాధానం చెప్పటానికి నిరాకరిస్తుంటే... యిక చేప్పేదేముంది?

సిగరెట్టు ఆర్పి ఒక మూలకు విసిరికొట్టి మంచంమీద మేను వాల్చాడు.  అండమాన్స్ గవర్నరుగారి కొక లెటర్ వ్రాయాలి.  అది వెళ్ళి, జవాబు వచ్చేసరికి ఎన్ని రోజులు పడుతుందో, షంషేర్ కొట్టిన దెబ్బలింకా చిమ చిమలాడ్తూనే ఉన్నాయి. బిందును ఊహించుకుంటూ నిద్రపోవటానికి ప్రయత్నించాడు.

నిద్ర లేచేసరికి మూడుగంటలయింది... కూజా వంచి ముఖం కడుగుకొని క్రిందికి దిగి వచ్చాడు. కాకా మామూలు గానే కూర్చొని చుట్ట కాల్చుకుంటున్నాడు.

"బోయరా లోయకు దారెటు కాకా?"

ఉలిక్కిపడ్డాడు కాకా.  అది గమనించి తనలో తాను నవ్వుకున్నాడు షాడో.  మాట మార్చాలని ప్రయత్నించాడు కాకా. అది గ్రహించి మరికొంచెం వత్తిడి చేశాడు షాడో. బోయరాకు పోయే దారిని గూర్చి పూర్తిగా తెలుసుకొని మరీ మెట్లు దిగాడు.

నది దాటుతుండగా ఫర్లాంగు దూరంలో భంగు కనిపించాడు. ఒక చెట్టుకింద చెక్కలతో కట్టబడిన చిన్న గుడిశె లాంటి యింటి ముందు కూర్చొని ఉన్నాడతను. తిరిగి వచ్చేటప్పుడు భంగును కలిసి మాట్లాడాలని నిశ్చయించుకొని ముందుకు సాగాడు.

ప్రకృతి అందాలు తిలకిస్తూ, మైమరిచి, ముందుకు సాగుతున్న షాడో హఠాత్తుగా ఆగిపోయాడు. రానున్న ప్రమాదాలను గూర్చి హెచ్చరించటానికి అలవాటు పడిన అతని సిక్స్ త్ సెన్స్ వార్నింగ్ యిచ్చింది. ఒక్కక్షణం చుట్టూ చూసి ఎగిరి పక్కనున్న పొదచాటుకి దూకాడు. పెద్ద శబ్దంతో రైఫిల్ పేలి, అంతవరకూ అతను నిలబడి వున్న స్థలంలో దుమ్ము లేపింది. బుల్లెట్ పడిన తీరును గమనించాడు షాడో. ముందుకు రావద్దని హెచ్చరికగా కాళ్ళముందు పేలినట్లు ఉందిగాని, తనకు హాని కలిగించే ఉద్దేశ్యంతో పేల్చినట్లు కనిపించలేదు. ధైర్యంచేసి మళ్ళీ దారిలోకి వచ్చి నిలబడ్డాడు. తిరిగి అదే మాదిరి దుమ్ములేపింది రైఫిల్. ఎవరు యీ పని చేస్తున్నారో తెలుసుకోవాలని పొదలలోకి ప్రవేశించి, నెమ్మదిగా చుట్టూ తిరిగి వచ్చాడు. రైఫిల్ ఉండాల్సిన చోటును ఉజ్జాయింపుగా లెక్కకట్టి ఆ ప్రదేశానికి చేరుకునే సరికి, మరొకసారి దూరంనుంచి రైఫిల్ మ్రోత చేసింది. షాడోకి విసుగెత్తింది. తనను ముందుకు రానీయకూడదని ఎవరో తీర్మానించుకొని యిలా ఆటను ఆడుతున్నారు. తెగించి ముందుకుపోతే ఏమౌతుందో తెలియదు.

చీకట్లు ముసురుకుంటూ ఉండటం గమనించి ఆలోచనలతో సతమతమౌతూ వెనుతిరిగాడు.

* * *

చిరునవ్వుతో ద్వారంవద్ద నిలబడి ఉన్న షాడోని చూసి ఆదరా బాదరాగా లేచి నిలబడ్డాడు భంగు. "రా భయ్యా. రా" అంటూ ఆహ్వానించాడు.

మొదటిసారి అతను భంగు మైకంలో లేకపోవటం చూశాడు షాడో. ముఖం పీక్కుపోయి ఉంది. మనిషి నీరసంగా కన్పిస్తున్నాడు. "భంగూ! భోజనం చెయ్యలేదా?" ఆదరంగా ప్రశ్నించాడు.

"చేస్తున్నానే! ఆ అనుమానం ఎందుకు వచ్చింది?"

అతని మాటలు నమ్మలేదు షాడో. "పద అన్నం పెట్టిస్తాను." అన్నాడు.

"వద్దుభయ్యా. ఆమె నన్ను చూస్తేనే అసహ్యించుకుంటుంది. లేదు అంటే మీకు కోపం వస్తుంది. లేనిపోని రగడ! నేను ఒకరోజు భోజనం చెయ్యకపోతే, కొంపలేం మునగవు."

ఆ మాటలను లక్ష్యపెట్టకుండా హోటల్‌కు లాక్కుపోయాడు షాడో.

భంగును చూసి లోపలకు తప్పుకుంది చిలక. లావుపాటి మనిషి వచ్చి ద్వారం వద్ద నిలబడింది.

"భంగూ భోజనం చేస్తాడండి. ఏమయినా మిగిలివుంటే చూస్తారా?" మర్యాదగా అడిగేసరికి ఆమె మనస్సు కరిగి పోయింది.

"అతనికి దయతలచి తిండి పెట్టటం యిది మొదటిసారి కాదు బాబూ! బయట కూర్చోమను" అంటూ లోనికి పోయింది.

భంగు తిన్నదాకా అతనితోపాటే కూర్చున్నాడు షాడో. మర్నాడు కలుస్తానని చెప్పి తనగదికి చేరుకున్నాడు. వరండాలో డేవిడ్, కాకా యిద్దరూ కూర్చొని ఉన్నారు.

"బోయరా వెళ్ళివచ్చావా రాజు!" ప్రశ్నించాడు డేవిడ్.

"ఆహ్! పోయాను. శరవేగంతో తిరిగి వచ్చాను కూడా"

"అదేమిటి? ఏం జరిగింది?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు కాకా.

"నన్ను ముందుకు రానీయకుండా కాల్పులు జరిపారు" వారి ముఖాలలో భావాలు చదవటానికి ప్రయత్నిస్తూ అన్నాడు షాడో.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని మిన్నకున్నారు వారిద్దరూ.

"మీతో ఒక విషయం మాట్లాడాలి" అన్నాడు డేవిడ్ తో షాడో.

"భంగుకు ఏదన్నా పని చూపించరాదూ! భోజనం కూడా చేయలేని స్థితిలో ఉన్నాడు" తాను ఇదివరకు చేసిన సహాయాలను వాళ్ళు ఏకరువు పెట్టబోయేసరికి మధ్యలోనే ఆపాడు.

"అప్పటి భంగుకూ, ఈ భంగుకూ పోలికలు లేవు కాకా! ఈ రోజు ఒక్క చుక్క కూడా ముట్టలేదు."

"నువ్వు అంతగా చెప్తున్నావు కాబట్టి అలాగే చేస్తాను రాజూ! లక్ష్మణ్ కి సహాయం చెయ్యటానికి ఒక మనిషి కావాలని అన్నాడు. అతని దగ్గిర పెడదాం. కానీ, ఉపయోగముండదు. రెండవరోజునే భంగు దుకాణం దగ్గిరకు పోతాడు."

"అదీ చూద్దాం." అంటూ జేబులో నుంచి పదిరూపాయల కాగితం తీసి డేవిడ్ చేతిలో పెట్టబోయాడు. "రేపు ఉదయం భంగు మీ దగ్గరకు వస్తాడు. అతనికి ఎడ్వాన్స్ గా యిది ఇవ్వండి. ప్రస్తుతానికి కావలసిన సామానులు కొనుక్కుంటాడు."

ఆ నోటు తీసుకోవటానికి నిరాకరించాడు డేవిడ్. "యిచ్చేదేదో లక్ష్మణే యిస్తాడు. కానీ మొదటే డబ్బు చేతికిస్తే నిముషంలో భంగుకోసం ఖర్చుపెడతాడే" అని తన అనుమానం వెల్లడించాడు.

అలా జరగదని అడ్డంగా తల తిప్పాడు షాడో.

"పది రూపాయల పందెం. భంగు డబ్బు ఇస్తే త్రాగి నాశనం చేస్తాడు" అన్నాడు డేవిడ్ పట్టుదలగా.

పందెం ఒప్పుకున్నాడు షాడో. ఇద్దరూ తమ డబ్బును కాకా దగ్గిర పెట్టారు.

6

"అండమాన్స్‌లో ఒక కంపెనీ వాచ్‌మన్‌గా పనిచేసే వాడ్ని భయ్యా! ఎంతో నమ్మకంగా ఇరవై సంవత్సరాలు వారి దగ్గరే వున్నాను. అప్పటికి అండమాన్స్ యిప్పటికంటే హీనంగా ఉండేది. బందిపోటు దొంగలు, అడవిజాతులు విచ్చలవిడిగా సంచరించి, ప్రజల ధన, మాన, ప్రాణాలకు హాని కల్గించేవారు. మా కంపెనీ వస్తువులను సాహసం చూపి అనేకమార్లు రక్షించినందుకు బహుమతిగా, అదిగో... ఆ గ్రీనర్ గన్ బహుమతిగా ఇచ్చారు."

షాడో వెళ్ళి గ్రీనర్‌ని చేతిలోకి తీసుకొని చూశాడు. రెండు బారెల్స్ ఉన్నాయి దానికి. ఒక్కొక్క బారెల్‌లో ఒక్కొక్క తూటా వుంటుంది. తూటాకు తొమ్మిది బుల్లెట్సు ఉంటాయి. అది పేలిస్తే ముప్పై అడుగుల దూరంలో ఏ వస్తువు అడ్డం వచ్చినా నామరూపాలు లేకుండా నాశనమైపోతుంది. ఆ రోజు "పాతి పెట్టడానికి ఎముకలు కూడా దొరకవని" బెదిరించాడు భంగు. అతనేమీ కోపంలో కోతలు కోయటంలేదు. ఆ మాట యదార్థమే!

"మరి ఈ పరిస్థితికి ఎందుకొచ్చావ్ భంగూ?" అని అడిగాడు మృదువుగా.

"ఖర్మ భయ్యా ఖర్మ! దానిని తప్పించుకోవటం ఎవరి తరం? ఈ కంపెనీలో పని చేస్తున్నపుడే నాకు వివాహమయింది. రెండేళ్ళు మా దాంపత్య జీవితం ఎంతో హాయిగా గడిచిపోయింది. ఆ సమయంలో ఎక్కువ భాగం కంపెనీ పనులకే ఖర్చు పెట్టేవాడిని. అందువలన

క్రమంగా మా మధ్య కలతలు రేగనారంభించాయి. వాటి మూలంగా మనసు చెడి తాగుడుకు దాసుడనైనాను. ఫలితం - ఒకరోజు డ్యూటీలో ఉండగా గోడౌను లూటీ చేశారు బందిపోటు దొంగలు. నేను చిత్తుగా తాగి ఒక చెట్టు కింద నిద్రపోతున్నాను."

బాధగా ముఖం మోకాళ్ళలో దాచుకున్నాడు భంగు. ముందురోజు నుంచి భంగు త్రాగటం మానినందువల్ల, శక్తిలేక గోగుపుల్లలా వూగిపోతున్నాడు. ముసలితనం ఒక్క రోజులో అతన్ని పూర్తిగా క్రుంగదీసింది. "అంత వరకూ ఎంతో పేరు సంపాదించుకున్న నాకు, వెంటనే చెడ్డపేరు వచ్చింది. అయినా నా మీది విశ్వాసంతో మా కంపెనీవాళ్ళు నన్ను పనిలోనుంచి తీసెయ్యలేదు. నా భార్య మాత్రం ఇక నాతో కాపరం చెయ్యనని వెళ్ళిపోయింది. అది అలా పోయినందుకు నేనంత బాధపడలేదు గాని, లేక -లేక కలిగిన నా ముద్దులపట్టి చిలకను కూడా వెంట తీసుకుపోయింది."

"అదా సంగతి?" అనుకొని తల వూపాడు షాడో.

"కొంతకాలం తర్వాత యిక ఉద్యోగం చెయ్యలేక మానివేశాను. సంపాదించిన డబ్బు అంతా భంగు కోసం ఖర్చుపెట్టాను. ఆఖరికి నా గ్రీనర్ తోడుగా నా కూతురు కోసం బయలుదేరాను. వాకబు చేయగా తన అక్కగారింటికి పోయిందని తెలిసి అక్కడకు చేరుకున్నాను."

"మరి నీ భార్య ఏదీ. కనిపించదేం?" అడిగాడు షాడో.

"అదెక్కడ ఉంది? నేను పోయేసరికి చనిపోయి సంవత్సరం దాటింది. నా చిట్టితల్లిని ఆమె అక్కే పెంచుతున్నది. ఆమె ఎవరనుకున్నావ్ ?" అని ప్రశ్నించాడు.

తెలియదని తల అడ్డం తిప్పాడు షాడో.

"హోటల్ యజమాని భయ్యా! నా భార్య ఇక్కడికే వచ్చింది. ఆమెను అనుసరించి నేను కూడా యిక్కడకు చేరుకున్నాను. నా త్రాగుబోతు జీవితంమీద అసహ్యంతో చిలకను నా దగ్గిరకు చేరనియ్యలేదు.  అయినా నా ప్రేమను చంపుకోలేక దూరంలో నుండైనా చూసుకుందామని నేను కూడా యిక్కడే స్థిరపడిపోయాను నన్ను చూసి నా చిట్టితల్లి గర్వపడాలని నాకుమాత్రం లేదా? ఎన్నిసార్లో మామూలు మనిషిగా బ్రతుకుదామని ప్రయత్నం చేశాను. ప్రయోజనం లేకపోయింది."

"అలా నిరుత్సాహపడకు భంగూ! మానవుడికి సాధ్యం కానిదేదీ లేదు. గతించిన దాన్ని మర్చిపో. ఇకముందు నవ్య జీవితాన్ని కొనసాగించు. నా అండ దండలు నీ కెప్పుడూ ఉంటాయి. పద..." అంటూ చేయి పుచ్చుకు లేవదీశాడు షాడో.

"ఎక్కడికి భయ్యా?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు భంగు.

"లక్ష్మణ్ దగ్గిరకు. అతనికి సహాయం చేసేందుకు ఒక మనిషి కావాలట" అంటూ అతన్ని గ్రామంలోకి తీసుకువచ్చాడు షాడో.

ఆరోజు ఉదయం చిలక తెచ్చిన పుల్కాలు తిని ఆమెను కాస్సేపు టీజ్ చేసి భంగు దగ్గిరకు వచ్చాడు. చక్రవర్తిని గురించిన ప్రశ్నలు అతన్ని అడగ దల్చుకోలేదు. సమాధానం వచ్చినా రాకపోయినా పెద్ద తేడాలేదు. రాత్రి తను వేసుకున్న పథకం ప్రకారం కార్యక్రమం కొనసాగిస్తే ఇంకొక వారం లోపల అన్ని విషయాలు పైకి రాక మానవు. తన సహాయపు మొహమాటంతో భంగును బాధపెట్టటం యిష్టంలేక పోయింది.

*     *     *

"సమయానికి వచ్చావ్ రాజూ! ఇక్కడి నుండి వారానికి ఒక్కసారే పోస్ట్ డోబ్రా పోతుంది. తిరిగి అక్కడ నుండి యిదే రోజు ఏమైనా ఉంటే వెళ్ళినతను తెస్తాడు. ఆ రాసేదేదో తొందరగా వ్రాసివ్వు. మనిషి బయలుదేరే సమయమయింది" తొందర చేశాడు డేవిడ్.

అతనే పోస్టుమాస్టరు. అతనే ప్యూను. అన్ని పనులు అతనే చూసుకుంటాడు. కాగితాలు, కవర్లు తీసుకొని ఒక మూల బల్లమీద కూర్చొని రెండు లెటర్లు వ్రాశాడు షాడో. ఒకసారి చదువుకొని కవర్లలో పెట్టి సీలు చేశాడు. పైన తమ సీక్రెట్ బ్రాంచి కోడ్ నెంబర్ వేశాడు.

"మీ భంగు ఏమంటున్నాడు? నువ్వు పిచ్చివాడివి రాజూ. అనవసరంగా పది రూపాయలు పోగొట్టుకుంటున్నావ్" కవర్లు తీసుకుంటూ చిరునవ్వుతో అన్నాడు డేవిడ్.

"అదీ చూద్దాంగా! లక్ష్మణ్ రాలేదా?" ప్రశ్నించాడు షాడో.

మాటల్లోనే వచ్చాడు లక్ష్మణ్. ఏం జరిగిందని ప్రశ్నించాడు డేవిడ్.

"రాజు! నువ్వు వచ్చిన దగ్గిర నుంచీ అన్నీ వింతలు విడ్డూరాలు జరుగుతున్నాయనుకో! భంగు నా దగ్గిరకు వచ్చాడు. నువ్వు చెప్పినట్లు పది రూపాయల ఎడ్వాన్సు యిచ్చాను. ఏం చేశాడనుకున్నావ్?"

"భంగు త్రాగటానికి పోయి ఉంటాడు." నిర్లిప్తంగా అన్నాడు డేవిడ్.

"నువ్వు ఆగు డేవిడ్! నన్ను పూర్తిగా చెప్పనీ!" అంటూ అతన్ని మధ్యలోనే అడ్డుకున్నాడు లక్ష్మణ్. "భంగు కొట్టుకు దారి తీసేసరికి నేనూ అలాగే అనుకున్నాను. కానీ ఐదు నిముషాలలో బయటికి తిరిగి వచ్చాడు. త్రాగిన లక్షణాలేం లేవు. సరాసరి హోటల్ కు పోయాడు. నేను మోటుభాయి దగ్గిరికి పోయి అసలు విషయమేమిటో తెలుసుకున్నాను. ఇదివరకెప్పుడో భంగు త్రాగినందుకు రెండు రూపాయలు బాకీ వున్నాడట. అది యివ్వటానికి వచ్చాడని చెప్పాడతను.

"ఆ రాస్కెల్ కి భంగూ బాకీయా? 'భంగులో' నీళ్ళు కలిపి అమ్మి మోసం చేస్తూ, పైగా పాతబాకీలు వసూళ్ళు చేస్తాడా? నాలుగు తన్ని ఆ డబ్బు భంగుకు యిప్పిస్తాను" కోపంతో బయటకు దూకబోయిన షాడోను బలవంతాన ఆపాడు లక్ష్మణ్.

"మొదట నేనూ అదే ఆలోచన చేశాను రాజూ! కాని ఆ బాకీని గురించి మోటూభాయి అడగనే లేదుట. భంగే స్వయంగా వెళ్ళి, గుర్తుచేసి ఇచ్చాట్ట. అతను న్యాయంగా వుందామనుకున్నప్పుడు మనం అడ్డుపడితే బాధపడతాడు" అన్నాడు.

డేవిడ్ వైపు చెయ్యి చాచాడు షాడో. "కొట్టు స్వామీ, కొట్టు. పది రూపాయలు ఇటు పంపు." అంటూ, భంగు హోటల్లో కూడా రెండు రూపాయల బాకీ చెల్లవేసి పనిలో ప్రవేశించాడని విని షాడోతో పాటు అందరూ సంతోషించారు.

కాకా దగ్గిర పెట్టిన డబ్బు తీసుకొని, బలవంతంగా షాడో చేతిలో పెట్టాడు డేవిడ్. నవ్వుతూ వేసుకున్న పందెం, నవ్వుతూనే తీర్చుకుందామంటూ, ఆ డబ్బు డేవిడ్ దగ్గరే వుంచమన్నాడు షాడో. భంగుకు ఏమైనా కావాల్సి వస్తే వస్తురూపంలో ఇవ్వమని రిక్వెస్ట్ చేశాడు.

"భంగు బాగుపడటం మా కందరకు సంతోషమే రాజూ! అయినా ప్రయత్నించి ప్రయత్నించి మేమందరం విసిగి పోయాం! అతన్ని మార్చటం నీ ఒక్కడివల్ల అయింది. నువ్వు సామాన్యుడివి కావు."

ఇంత పొగిడినా, తనకు చక్రవర్తిని గురించి చెప్పటానికి వారు నిరాకరించటంలోని పరమార్థం షాడోకి అంతుబట్టలేదు.

7

"కిటికీకి కాళ్ళు తన్నిపెట్టి, కుర్చీలో వెనక్కు వాలి పడుకుని పనామా కాలుస్తూ, వీధిలో వచ్చేపోయే జనాన్ని చూడసాగాడు షాడో. కిరోసిన్ లైట్లు అన్ని ఇళ్ళల్లోనుంచి గుడ్డి వెలుగును బజారులోకి పంపుతున్నాయి.

ఎద్దు బండిమీద గ్రామంలోకి అడుగుపెట్టిన రోజీయొక్క దాదాను చూసి ముందుకు వంగాడు షాడో. ఆరోజు వచ్చే సమయంలో కలవటం తప్పించి, ఇంతవరకూ ఇద్దరూ ముఖాముఖిన ఎదురుపడలేదు. తనను బోయరా లోయలోకి రానీయకుండా ఆపిన రైఫిల్ వ్యక్తిని గురించి కొన్ని అనుమానాలున్నాయి. షాడోకు ఆరోజు అక్కడవున్న అడుగుజాడలను చూసిన దగ్గిరనుంచీ ఒక అనుమానం అతని మనస్సును తొలుస్తూ రోజు రోజుకూ పెద్దదవుతున్నది.

బండిని డేవిడ్ కొట్టు దగ్గిర ఆపి, ఎడ్లను చక్రాలకు కట్టాడు దాదా. రెండు నిముషాలు డేవిడ్ తో మాట్లాడి, భంగు దుకాణానికి పోయాడు. మొదట తనుకూడా పోయి అతనిని పలుకరిద్దామని అనుకున్నాడు షాడో. కాని అందువల్ల కలిగే ప్రయోజన మేముంటుంది? అడుగుజాడల సాక్ష్యపు ఆధారంతో మనిషిని నేరస్తుడిగా నిర్ణయించటం అవివేకం.

రాత్రి ఎనిమిది గంటలు దాటింది. చిలక భోజనం తెచ్చింది. షాడో భోజనం చేస్తున్నంతసేపూ అక్కడే కూర్చుంది. రొట్టె విరిచి నోట్లో పెట్టుకుంటూ 'ధన్' మన్న రైఫిల్ శబ్దం విని వులిక్కిపడ్డాడు షాడో.

"బాబూ! నాగూర్ ముఠా వ్యక్తులు వూళ్ళోకి వచ్చి పడ్డారు. మోటూభాయి దుకాణంలో గొడవ చేస్తున్నారు" అన్నాడు వగరుస్తూ వచ్చిన కాకా.

తింటున్న రొట్టెను అలాగే వదలి, రైఫిల్ తీసుకొని బయటకు పరుగెత్తాడు షాడో.

షాడోను చూడగానే వికటంగా నవ్వాడు నాగూర్. ఆరడుగుల పైన రెండంగుళాల ఎత్తు, దున్నపోతులాగా వున్నాడు. బుర్రమీసాలూ, తలపాగాతో మనిషి భయంకరంగా కన్పిస్తున్నాడు.

"మా వాడ్ని కొట్టిన పోలీస్ అధికారివి నువ్వేనా?" ఇనుప గొలుసులు కొట్టుకుంటున్నట్లు గరగరమంది ఆ కంఠం.

"మీ వాడ్నే కాదు. దేముడే స్వయంగావచ్చి, నడివీధిలో గొడవచేస్తే వాడినిగూడా చితకకొడ్తాను. ఏమనుకుంటున్నావో!" బింకంగా సమాధాన మిచ్చాడు షాడో. కాని ముందు కడుగువెయ్యటానికి సందేహించాడు. నాగూర్ మీద అభియోగాలేమీ లేవు. అతను దొంగ అని అనుమానమే తప్ప సాక్ష్యాలేమీ కనుపించలేదు.

"ఓహో! అయితే అంత తెంపుగల పోలీసువన్నమాట! ఎవ్వరినీ లెక్కచేయవు గదూ. నీలాంటి పోలీసులను నంచుకు తినేవాణ్ని నేను" అంటూ ముందుకు వచ్చి షాడో ముఖంమీద అరచేతితో చరిచాడు నాగూర్ . అనుకోకుండా వచ్చిన ఆ దెబ్బనుంచి షాడో

తప్పించుకోవటానికి వ్యవధి లేక పోయింది. ఇంతలో చేతిలోని రైఫిల్ ను లాక్కున్నాడొక వ్యక్తి. మరొకడు బెల్టులోని రివాల్వరును పీకాడు. బూటులో వున్న డాగర్ ను చేజిక్కించుకున్నాడు వేరొకడు.

అదే గ్రామంలో రెండోసారి దెబ్బలు తిన్నాడు షాడో. అతని గుండెలమీద వున్న బాడ్జీని పీకి ఒక మూలకు విసిరి కొట్టాడు నాగూర్ . వెనక నుంచి ఇద్దరు షాడో చేతులను విరిచి పట్టుకున్నారు ఎడాపెడా షాడో ముఖంమీద పిడికిలి తో పొడిచాడు నాగూర్. షంషేర్ కొట్టిన దెబ్బలు అప్పుడే మానుతున్నాయి. వాటిమీదే తిరిగి దెబ్బ పడేసరికి బాధతో మతిపోయింది షాడోకు.

గట్టిగా హుంకరించి, తన చేతులను పట్టుకున్న ఇద్దర్నీ ఎత్తి నేలకేసి కొట్టాడు. నాగూర్ పొట్టమీద బూటుకాలితో తన్నాడు. మెలకువగా వెనకడుగువేసి ఆ దెబ్బనుంచి తప్పుకున్నాడు నాగూర్. పక్కనుంచి మరొక చెయ్యి షాడో డొక్కల్లో గుద్దింది. తూలి పక్కకు పడ్డాడు. బూటుకాళ్ళు అతని గుండెలమీద నృత్యం చేశాయి. నోటిలో నుంచి, ముక్కులో నుంచి రక్తం వెల్లువగా కారసాగింది.

చెయ్యెత్తి ఆగమని సైగ చేశాడు నాగూర్. "పో. పోయి మీ పోలీసులకు చెప్పుకో. ఈ నాగూర్ ఇలాకాలో ఎవరైనా ప్రవేశిస్తే సజీవంగా పాతి పెడతాను" అంటూ షాడో భుజాలు పుచ్చుకొని పిడికిలితో బలమంతా వుపయోగించి గుద్దాడు. ఆ దెబ్బకు ద్వారం దాటి వీధిలో పడ్డాడు షాడో.

నెమ్మదిగా లేచి తూలుతూ నిలబడ్డాడు. దూరదూరంగా నిలబడి గ్రామస్తులంతా వింతగా చూస్తున్నారు. మెరుపులా భంగు ఇంట్లో గ్రీనర్ షాడో మనస్సులో మెదిలింది.

వెంటనే అటు పరుగెత్తాడు తూలుకుంటూ. రెండుసార్లు రాళ్ళు తగిలి నేల కరుచుకున్నాడు. అయినా, అలాగేపోయి భంగు గుడెసెను సమీపించాడు. భంగు ఇంట్లో లేడు. ఇంకా లక్ష్మణ్ దుకాణంలోనే వున్నాడు. తలుపు తెరుచుకోకుండా కట్టిన తాడు వూడతీసి, గోడకు మేకులమీద తగిలించివున్న గ్రీనర్ ని తీసుకున్నాడు. ఎదురుగా గూట్లో వున్న డబ్బాలో నుంచి చేతికి వచ్చినన్ని తూటాలు జేబులో పోసుకున్నాడు. రెండు గ్రీనర్ మాగజైనులోకి తోసి "కట్' మని గన్ క్లోజ్ చేసి బయటకు వచ్చాడు. తలుపుకూడా వేయకుండా గ్రామంలోకి వచ్చి దుకాణం ముందు ఒక్క నిముషం నిలబడ్డాడు.

అతన్ని కొట్టినందుకు పండుగ జరుపుకుంటున్నట్లు పెద్దగా నవ్వుతూ గోల గోలగా అరుస్తున్నారు లోపల నాగూర్ అనుచరులు. గుండెలనిండా గాలి పీల్చుకొని గ్రీనర్ బారెల్స్ తో తలుపుల్ని తోసి, లోపలకు అడుగు బెట్టాడు. నవ్వులు ఆగిపోయాయి. ద్వారంలో నిలబడిన ఆకారాన్ని చూసి అందరూ ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు.

చొక్కా చిరిగి భుజాలమీద నుంచి పేలికలు వ్రేలాడుతున్నాయి. ముఖమంతా రక్తంతో తడిసివుంది. కింద పడ్డప్పుడు మట్టి అంటుకొని మనిషి అవతారమే మారి పోయింది. బలంగా వూపిరి పీల్చుతూ

వుండటంవల్ల గుండెలు ఎగసి పడుతున్నాయి. కళ్ళు చింత నిప్పుల్లాగా ఎర్రబడి నిప్పులు కక్కుతున్నాయి.

మృత్యుదేవతలా మెరిసిపోతుంది అతని చేతిలోని గ్రీనర్ గన్. జంట బారెల్స్ నోళ్ళలా తెరుచుకొని భయంకరంగా చూస్తోంది.

తమ దగ్గిరున్న రివాల్వర్లను ఉపయోగించటానికి వెనుకాడారు నాగూర్ ముఠా. షాడో చేతిలో రివాల్వర్ గాని, రైఫిల్ గాని వున్నట్లయితే ప్రయత్నించేవారేమో. వారికి గ్రీనర్ గన్ లను గురించి బాగా తెలుసు. అంత దగ్గిరలో నుండి పేలిస్తే తూటాకు నలుగురు చొప్పున లేచిపోతారని ఇంకా బాగా తెలుసు. మృత్యుదేవతకు ఎదురుపోయే సాహసం ఎవరికుంటుంది?

ఒక్కడుమాత్రం మొండి ధైర్యంతో తన స్నేహితుణ్ని చాటు చేసుకొని రివాల్వరెత్తాడు. కను చివరలనుంచి ఆ కదలికను పసికట్టిన షాడో వెనకా ముందు చూడకుండా గన్ అటువైపు తిప్పి ట్రిగ్గర్ నొక్కాడు. "బొయ్" మన్న గ్రీనర్ ధ్వని ఆ గ్రామమంతా వినిపించింది. బారెల్ లో నుంచి నిప్పులు వెదజల్లుతూ వెలువడిన తూటా ఆ యిద్దర్నీ ఎత్తి ఏడడుగుల దూరం విసరి కొట్టింది, తూటాలోని తొమ్మిది బుల్లెట్లు ఆ యిద్దరి శరీరాలలో నుంచి దూసుకుపోయి నేలలో దిగబడ్డాయి. గుర్తు పట్టటానికి కూడా అవకాశం లేనట్లు నజ్జునజ్జయి పోయాయి వారి ముఖాలు.

పొగలు కక్కుతున్న బారెల్స్ ను వారిముందు అర్థ చంద్రాకారంలో తిప్పాడు షాడో. "అందరూ మీ ఆయుధాలను కింద పడెయ్యండి. వూ త్వరగా! పిచ్చివేషాలు వేస్తే యీ రెండో బారెల్ గూడా మీ మీదికి పంపుతాను" ముద్ద మాటలతో గద్దించాడు.

మారు మాటాడకుండా నాగూర్ తో సహా అందరూ తమ రివాల్వర్ లూ, కత్తులు నేలకు వదిలారు. మోటూభాయి బల్లవెనుక కొంచెం కదిలాడు. మెరుపులా గన్ అటువైపు తిప్పాడు షాడో.

"జాగ్రత్త! నిన్ను వదలు తాననుకుంటున్నావేమో! కదిలితే నరికి పారేస్తాను."

గుటకలు మింగుతూ చేతులు గాలిలోకి ఎత్తాడు మోటూభాయి.

అందరినీ చేతులు ఎత్తమని, గోడకు ముఖాలు తిప్పించి నిలబెట్టాడు షాడో. దాదా ఇంకా అక్కడే కూర్చుని వున్నాడు. షాడో చూపు తనమీద పడగానే వులిక్కిపడి తడబడ్డాడు.

"నాకేం తెలియదు. నేనూ మీలాగే భంగుకోసం ఇక్కడకు వచ్చి చిక్కుపడ్డాను. ఈ నాగూ మీకూ, మాకూ బద్ధ విరోధం! వాడికి తెలియకుండా బయట పడటమెలా అని ఆలోచిస్తుండగా మీరు వచ్చారు." ఫ్రాంక్ గా చెప్పాడు.

మంచీ - చెడును గురించి విత్కరించే పరిస్థితిలో లేడు షాడో. తనను కొట్టినందుకు అతను బాధ పడటంలేదు. తన పోలీస్ బాడ్జిని పీకి

మూలకు విసరటంతో పోలీస్ డిపార్ట్ మెంట్ ప్రిస్టేజి దెబ్బతిన్నది. ఒక కోన్ కిస్కా గాడు చేశాడులే అని వదిలితే- ఇక అందరూ అదే పని చేయటం మొదలు పెట్టారు.

"ఆల్ రైట్ ! ఇందులో నీకు సంబంధంలేదని నన్ను నమ్మమంటావ్ కదూ! సరే. వారి దగ్గర ఇంకేమైనా ఆయుధాలు ఉన్నాయేమో వెతుకు. అప్పుడు నువ్వు వీరి మనిషివి కాదని అనుకుంటాను."

వరసపెట్టి అందరినీ పరిశోధించాడు దాదా. నాగూర్ జేబుల్లోంచి రెండు పిస్టల్స్ తీసి బయటపడవేశాడు.

"అరేయ్ దాదా! నువ్వు చేసే పనికి విచారించవలసిన రోజు వస్తుందిరా! నీ కండలుకోసి అడవి పిల్లులకు వేస్తాను" పళ్ళు కొరుకుతూ బెదిరించాడు నాగూర్.

ఆ బెదిరింపు షాడో చెవిన పడింది. ఒక్క గంతులో నాగూర్ ని సమీపించి వెనుదిరగమని ఆజ్ఞాపించాడు. "చింత చచ్చినా పులుపు చావలేదు కదూ! పోలీస్ ఆఫీసర్లను నంచుకు తినే మొనగాడివి. ఇది రుచి చూడు" అంటూ గ్రీనర్ తిప్పి, స్టాకుతో ముఖం మీద ఫెళ్ళుమంటూ కొట్టాడు. కణతల దగ్గిర నుంచి మెడదాకా అరంగుళం లోతున ముఖం చీరుకుపోయింది.

'జాగ్రత్త! పోలీసులంటే పిచ్చివాళ్ళనుకుంటున్నారేమో! నా దారికి అడ్డువచ్చిన వాణ్ని నిలువునా నరికి పారేస్తాను. ఖబడ్దార్" అంటూ హెచ్చరించాడు నాగూర్ అనుచరులను.

కిందపడిన రివాల్వర్లనూ, కత్తులనూ ఒక చోట కుప్ప వెయ్యమని ఆజ్ఞాపించాడు. దెబ్బ బలంగా తగలటం వల్ల నాగూర్ స్పృహ తప్పి పడిపోయాడు. దేవరాజు కోసం అందరి ముఖాలు జాగ్రత్తగా పరిశీలించాడు. కాని కనీసం అతని పోలికలున్న వ్యక్తి గూడా వారిలో షాడోకు కనుపించలేదు.

"ఓకే. ఇక బయలుదేరండి. మళ్ళీ ఈగ్రామ పరిసరాలలో కనిపించారా. ముందు వళ్ళు తూట్లు కొట్టి తర్వాత మాట్లాడుతాను. కమాన్ హర్రీ అప్."

ముఖాలు ముడుచుకొని, బిత్తర చూపులు చూస్తూ, ఒకరి తర్వాత మరొకరు వరుసగా బయటకు నడిచారు. ఇద్దరు నాగూర్ని కాళ్ళూ చేతులూ పట్టుకొని మోసుకు పోయారు. ఆఖరి ఇద్దర్నీ పిలిచి రెండు శవాల్ని కూడా వారి భుజాల కెత్తించి పంపించాడు షాడో.

"ఒంటరిగా వస్తున్న పరదేశీయులను బెదరకొట్టటం కాదు. నువ్వు కూడా నాగూర్ ముఠా వాడివేనని శిక్షిస్తే నన్ను అడ్డుకునే వాడు లేడు. మళ్ళీ వీరి ముఠాలో కన్పించావో!" తర్జనితో బెదరించాడు

దాదాను. షాడో బ్రతికుండగా తనని అటువంటి కంపెనీలో చూడబోడని చెపుతూ బయటకు పరుగెత్తాడు దాదా.

లైట్ వెలుగులో మూలగా విసరబడిన బాడ్జీ తళతళ మెరుస్తున్నది. వంగి దాన్ని తీసుకొని, చొక్కాకు రుద్ది గుండెలకు జాగ్రత్తగా పిన్ చేసుకున్నాడు షాడో.

"మోటూభాయ్! నేను అడిగేదాకా వీటిని నీ దగ్గరే జాగ్రత్తపరుచు" అని ఆయుధాల గుట్టవైపు చెయ్యి చూపించాడు.

గ్రీనర్ గర్జనవిని ఒక కుర్చీకి మెరుగు పెడుతున్న భంగూ పనివదిలి పరుగెత్తుకు వచ్చాడు. "అది నా గ్రీనర్ మోటూ! సందేహం లేదు" అనుకుంటూ. కాకా, డేవిడ్, లక్ష్మణ్, అందరూ భంగూతోపాటు దుకాణానికి చేరుకునే సరికి వరుసగా గ్రామం వదిలి పోతున్న నాగూర్ అనుచరులు వారికి ఎదురైనారు. మూడు ఆకారాలను మోసుకుపోతూ.

వారితోపాటు దుకాణం వద్ద పెద్ద గుంపు తయారై వుంది. షాడో బైటికి వచ్చి నిలబడ్డాడు. కోపపు ఛాయలు అతని ముఖాన్నింకా అంటిపెట్టుకొనే ఉన్నాయి. భంగును చూడగానే చిరునవ్వు నవ్వి, మామూలు 'రాజు' గా మారాడు. "థేంక్స్ భంగూ! నీ గ్రీనర్ అమోఘంగా పని చేసింది."

భంగూ ముఖం ఆనందంతో చింపి చేటంత అయింది. గ్రీనర్ ని అందుకొని ఆప్యాయంగా బారెల్స్ నిమిరాడు. "మరెందుకు పని చెయ్యదు? రోజూ శుభ్రంగా తుడిచి ఆయిల్ వేసి మిగతా పనులు చూసుకుంటాను" అన్నాడు చిన్న పిల్లాడిలా సంబరపడుతూ.

తన జేబులో వున్న తూటాలను గూడా అతనికిచ్చి, తన వంకే నోరు తెరుచుకొని చూస్తున్న కాకా మొదలైన వారి వంక ఓరగా చూస్తూ కదలి తన గది చేరుకున్నాడు షాడో.

ఒక్కసారిగా అందరూ దుకాణంలోకి జొరబడ్డారు. నేలమీది రక్తపు మరకల్ని నీటితో కడుగుతున్నాడు మోటూభాయి.

"అతన్ని చూసేసరికి నా గుండె ఆగిపోయింది. గ్రీనర్ గురిపెట్టి బ్రహ్మ రాక్షసుడిలా అగుపించాడు. ఎంతో ఎత్తుగా ఎదిగిపోయినట్లు అనిపించింది. ఆ వెధవ పాపం, రివాల్వరు మీద చెయ్యి వేశాడు. నాగూర్ దాదాను బెదిరిస్తే గన్ స్టాకు పెట్టి ముఖాన్ని పచ్చడి చేశాడు"

"ఇతను మనిషి కాదు. డెవిల్... దయ్యం... మానవుడికి ఉండాల్సిన జాలి, దయ అనేవి ఏ కోశాన అతనిలో కన్పించవు. అతని శత్రువుగా మాత్రం పుట్టకూడదని వెయ్యి దేముళ్ళకు మొక్కు కుంటాను."

పెదవులు తడిచేసుకుంటూ, చెమటలు పట్టిన భుజాన్ని తుడుచుకుంటూ వారితో చెప్పాడు మోటూభాయి.

అతనితో పూర్తిగా ఏకీభవించారందరూ. ఒక్క విషయంలో మాత్రం వ్యతిరేకించారు ముగ్గురు మిత్రులు. షాడో మనిషి కాదు - భూతమే! కాని, సామాన్య మానవుడికి ఉండాల్సిన జాలి గుండెకన్నా వందరెట్లు పెద్దగుండె ఉంది అతనిలో. సాక్ష్యంగా ఎదుట భంగూ నిలబడే వున్నాడు. డేవిడ్ కు యింకో విషయం కూడా తెలుసు. వరుసగా రెండు రోజులనుంచి కాకా పెరడును విరగదొక్కుకొని లోపలికి వస్తున్న ఆవు, దూడలను తిరిగి పొదలలోకి తోలలేక సతమతమౌతున్నాడు. ఆ దూడ నడుంమీద కట్టుకట్టి ఉంది!

8

"బిజ్జూ...బిజ్జూ..." అంటూ వరండా మెట్లు దిగింది చిలక. బుగ్గలు కెంపులయ్యాయి. ఆనందంతో ముఖం చంద్రబింబంలా వెలిగిపోతుంది.

కాకా డ్రాయర్ లో ఉన్న సంవత్సరం నాటి పేపరులో ఉన్న విశేషాలన్నీ బుద్ధిమంతుడిలా చదువుకుంటున్న షాడో తలెత్తి బయటకు చూశాడు. పద్దెనిమిదేళ్ళ యువకుడు హోటలు ముందు నిలబడి వున్నాడు. చిలకను చూసి అతను కూడా సంబరపడుతున్నాడు. చూడగానే వారిద్దరూ చిలకా గోరింకల్లా ఉన్నారనుకున్నాడు షాడో.

బిజ్జూ చేతులు పట్టుకొని వూపుతూ ఏమేమో చెపుతుంది చిలక. పనామా వెల్గించుకొని తిరిగి పేపరులో తల దూర్చాడు షాడో.

బిజ్జూ వెళ్ళిపోగానే తిరిగి వరండా మెట్లెక్కి లోపలకు వచ్చింది చిలక. కింద పడవేసిన చీపురు తీసుకొని పైకిపోవడానికి మెట్లు ఎక్కసాగింది.

"బిజ్జూ బాగున్నాడు చిలకా"

ఆశ్చర్యంతో వెనుతిరిగింది. "మీకెలా తెలుసు?" అంటూ.

"నువ్వే చెప్పావుగా! ఏమంటాడు? ముహూర్తమెప్పుడు?" చిలిపిగా ప్రశ్నించాడు షాడో.

"బిజ్జూకు రెండెకరాల పొలం ఉంది. సజ్జలు వేశాడు. అవి కోతకు రాగానే వివాహం చేసుకుందామన్నాడు. పెళ్ళి అంటే మాటలు కాదుగదా! డబ్బు కావాలి."

అవునని ఒప్పుకున్నాడు షాడో. నిండా పదిహేడేళ్ళు లేవు. అప్పుడే తను నిర్వర్తించబోయే బాధ్యతలను గురించి ఆరిందాలాగా మాట్లాడుతున్నది చిలక.

"మరి ఈ సంతోష వార్తను నీ తండ్రికి చెప్పావా?"

చిలక మొహం వాలిపోయింది. ఒక విధమైన ఉదాసీనత ఆవరించిందామెను.

"ఎందుకు చెప్పాలి? నేను అతని కూతురునని గర్వపడే పని ఏం చేశాడు. నా సంతోషంలో పాలు పంచుకోవటానికి?"

"చిలకా! నువ్వు కాదు అనుకున్నంత మాత్రాన మీ తండ్రీకూతుళ్ళ అనుభందాలు తెగిపోవమ్మా. ఆ పిచ్చివాడు నిన్ను చూసుకొని జీవిస్తున్నాడు. నీకోసం యిక్కడ స్థిరపడ్డాడు. ఎందరు ఎన్ని విధాలుగా అవమానించిన సహించి తిరుగుతున్నాడు."

"తాగుబోతును అవమానించక గౌరవిస్తారా? నా తల్లిని కూడా బాధ పెట్టాడు. ఆయన ఆలోచనలతోనే మరణించింది మా అమ్మ" కళ్ళ నీరెట్టుకుంది చిలక.

"ఒకసారి తప్పు చేస్తే దానికి క్షమ లభించగూడదా చిలకా! నిన్నూ, నీ తల్లినీ పోగొట్టుకొన్న రోజునే, చేసిన పాపానికి రెండింతలు శిక్ష అతనికి పడింది. ఒక్కసారి తీరిగ్గా ప్రశాంతంగా ఆలోచించు. నీ సుఖం అతనికి సంతోషప్రదంకాదా? ఇప్పుడు పూర్తిగా మారిపోయాడమ్మా! కావాలంటే లక్ష్మణ్ ను అడుగు. స్వయంగా పోయి చూడు. నీకే తెలుస్తుంది." నచ్చ చెప్పాడు షాడో.

తలఎత్తి షాడో కళ్ళలోకి సూటిగా చూసింది చిలక. "మనుష్యుల్ని మంచినీళ్ళు త్రాగినట్లు అవలీలగా చంపే మీరు యిటువంటి మాటలు చెప్పటం వింతగా ఉంది" అన్నది అస్పష్టంగా.

బరువుగా నవ్వాడు షాడో. నిజమే! తను చంపినట్లు మృత్యువు కూడా చంపలేదు. ఒకవేళ చంపకుండా వెనుతిరుగుతాడేమో అని

లైసెన్స్ కూడా యిచ్చి, "కిల్లింగ్ మాస్టర్" బిరుదు మెడకు తగిల్చింది సి.ఐ.బి.

"నా వృత్తిలో అలా చంపకపోతే వీలులేదు చిలకా! ఏమాత్రం దయచూపించి వెనుకాడినా ఆ రాక్షసులు నన్నే మట్టు పెడతారు. చావంటే నాకు భయంలేదు. నేను చచ్చిపోతే దేశానికి వచ్చే లోటూ లేదు. కాని, ఎందుకు చచ్చిపోతాను? ఒక అపరాధిని బంధించ వీలులేక చంపటానికి సంకోచిస్తే, ఛస్తాను. నా తర్వాత నాలాంటివారు అనేకమంది వున్నారు. వారుకూడా అదేమాదిరి అయితే? ఇక హంతకులు పెచ్చురేగి విచ్చలవిడిగా సంచరించటానికి ఆస్కారం కలిగించినట్లు అవుతుంది గదా! వీలైనంత వరకు ప్రాణాలతో బంధించటానికే ప్రయత్నిస్తాను. వీలుకాని పరిస్థితిలో చంపక తప్పదు."

సిగరెట్టు వెలిగించి పొగ వదులుతూ చిలక వంక చిరునవ్వుతో చూశాడు.

"మీ తండ్రిది జాలిగుండె. అతనిలో మానవత్వం నిండుగా వుంది. అందుకనే అందరూ నోళ్ళు తెరుచుకు చూస్తున్న సమయంలో నాకు అండగా నిలిచాడు. సహాయం చేసిన స్నేహితుడికి బాకీ తీర్చకపోవటం నా నిఘంటువు లోనే లేదు. అతన్ని మంచిదారిలో పెడదామని ప్రయత్నించాను. బాగుపడ్డాడు. ఇక అతను గౌరవంగా అలాగే జీవితాన్ని కొనసాగించటం నీ చేతుల్లో ఉంది."

చిలక మనస్సు వెన్నలా కరిగిపోయింది ఆ మాటలకు. నలుగురూ అనుకున్నవి విని తండ్రిమీద ఒక విధమైన అసహ్యాన్ని సృష్టించుకుందామె. షాడో మాటలు ఆమె కనులు తెరిపించాయి. "ఈరోజే పోయి కలుసుకుంటాను. నా సంతోషం అతనితో పంచుకుంటాను." అని కళ్ళు తుడుచుకుంటూ పరుగు తీసింది.

దీర్ఘంగా నిట్టూర్చి కుర్చీలో చేరగిలబడి కూర్చున్నాడు షాడో. చిలకతో మాట్లాడటం వల్ల అతనిలో మాయని గాయాలు తిరిగి రేగాయి. క్రూరమైన పేదరికపు ఇనుప పాదాల క్రింద నలిగిపోయిన తల్లీతండ్రీ గుర్తుకు వచ్చారు. గజదొంగగా గడపిన జీవితం గుర్తుకువచ్చి మనస్సు మరింత బరువెక్కింది. మహేంద్రగారు కలుసుకొని తనని మార్చకపోతే ఈ పాటికి తను ఎక్కడుండేవాడో? చిరునవ్వులు చిందిస్తూ బిందు ప్రత్యక్షమయింది. అతని కళ్ళముందు. ఆమెతో కలిసిన తరువాత తన జీవితం మరొక మలుపు తిరిగింది.

భోజనం చేద్దామని వచ్చిన భంగు తన గుడిశెలోనుంచి పొగ వస్తూ వుండటం చూసి ఆశ్చర్యపోయాడు. పోయి వంట చేసుకోవాలి. కనీసం ప్రొద్దున పొయ్యికూడా వెలిగించలేదే! మరి యీ పొగ ఎక్కడిది?" అనుకుంటూ పోయి లోపలికి తొంగి చూశాడు.

గుమ్మంలో అడుగుల చప్పుడు విని పొయ్యి దగ్గిర నుంచి లేచింది చిలక. చెమటతో తడిసివుంది ముఖం. ముచ్చటగా ముందుకు పడుతున్నాయి ముంగురులు. వాకిట్లో నిలబడిపోయిన తండ్రిని

చూసి చిరునవ్వు నవ్వింది. "వంట అయిపోయింది. కాళ్ళు కడుక్కురా నాన్నా."

భంగుకు మాటలు పెగలలేదు. తను చూస్తున్నది కలో నిజమో తెలియలేని సందిగ్దంలో పడ్డాడు. "చిలకా! నువ్వు" అంటూ చేతులు చేచాడు. ఒక్క పరుగులో పోయి ఆ చేతుల్లో వాలిపోయింది చిలక. కన్నీరు ధారలుగా కారుతుండగా ముఖాన్ని అతని వక్షంలో దాచుకొంది. ఆమెను గుండెల కదుముకొని, తన కన్నీళ్ళు భుజానికి తుడుచుకున్నాడు భంగు.

"తల్లీ! నేను మారిపోయానమ్మా! పూర్తిగా మారిపోయాను. ఇకనుంచి నేను నీ తండ్రినని చెప్పుకోవటానికి నువ్వు సిగ్గు పడవలసిన అవసరం రానీయనమ్మా."

ప్రకృతి కూడా ఆ తండ్రీ కూతుళ్ళ కలయికకు ఆనందించినట్లు నది మీదనుంచి చిరుగాలి చెట్లను వూపి ఆకులు నేలకు రాల్చింది. చిన్న చిన్న అలలు మృదుమధుర శబ్దాలతో జగతిని పులకింప చేయసాగాయి.

* * *

కిటికీ దగ్గిర నిలబడి బయటికి చూస్తున్నాడు షాడో. టపా రావాల్సిన రోజది. వారం రోజులనుంచి చేసే పనేమీ లేక భోజనంచేసి, ముసుగుతన్ని నిద్రపోతున్నాడు. ఇవాళైనా కాస్త యాక్షన్ వుంటే...

రోజీ, దాదాలతో కలిసి గ్రామంలోకి రావటంచూసి గబగబా దిగివచ్చి వరండాలో కూర్చున్నాడు. సరాసరి డేవిడ్ కొట్టు దగ్గిరకు వచ్చింది రోజీ. ఆమెతో ఏదో చెప్పి వెనక్కు తిరిగిపోయాడు దాదా. దుకాణంలోకి పోయింది రోజీ. ఒక చిన్న పోస్టల్ బాగ్ పుచ్చుకొని అలసిపోయినట్లు నడుస్తూ వచ్చిన మనిషిని చూసి నెమ్మదిగా తనుగూడా దుకాణం చేరుకున్నాడు షాడో. అప్పుడే బాగ్ ను విప్పుతున్నాడు డేవిడ్.

"ఇదిగో రాజూ! ఈ వారంలో పెద్ద కాతా నువ్వొక్కడివే" అంటూ ఒక బరువైన పార్శెలును అందించాడు డేవిడ్. అది తీసుకుంటూ రోజీవంక చూశాడు. ఓరగా అతనినే గమనించ సాగిందామె. నవ్వుకుంటూ గదికి తిరిగి వచ్చి పార్సెలు విప్పాడు. కొన్ని ప్రింటెడ్ వాల్ పోస్టర్లు, వాటిని పిన్ చేసి ఒక వుత్తరమూ వున్నాయా పార్సెల్ లో.

"డియర్ మిస్టర్ షాడో!

నువ్వు వేర్వేరుగా వ్రాసిన రెండు లెటర్లు అందాయి. నువ్వు కోరిన ప్రకారం అన్ని పనులు పూర్తిచేసి పంపుతున్నాము. వాల్ పోస్టర్లు జతచేసి పంపుతున్నాము. బహుమతి చాలదనుకుంటే నీ యిష్టం వచ్చినంత ప్రకటించు. ఎంతైనా యివ్వమని గవర్నమెంటు వద్దనుంచి స్పెషల్ ఆర్డర్లు వచ్చాయి.

"ఇక నువ్వు కావాలన్న స్పెషల్ పవర్సు ఇదివరకే నీకు సంక్రమించి ఉన్నాయి. నీకున్న 'కిల్ మాస్టర్ ' లైసెన్స్ తో నేరస్థులను

వీలుగాని పరిస్థితిలో చంపటానికి పూర్తి అధికారాలు వచ్చి వున్నాయి. నా స్టేట్ లో కూడా నీ లైసెన్స్ ను రికగ్నైజ్ చేసి, పోలీస్ డిపార్టుమెంటుకు ఆర్డర్లను పంపాను.

"విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!

గవర్నర్

అండమాన్స్ అండ్ నికోబార్ ఐలెండ్స్ .

ఉత్తరాన్ని అగ్గిపుల్ల వెలిగించి తగలబెట్టాడు. పోస్టర్లను విప్పి చూశాడు. ఒక దానిమీద చక్రవర్తి ఫోటోవేసి ఉంది. రెండవ దానిమీద దేవరాజు బొమ్మ ఉంది. వారి ఆచూకీ తెలిపిన వారికి ఐదువేల రూపాయలు బహుమతిగా యివ్వబడుతుందని వ్రాయబడి వుంది.

ఇద్దరూ ఆరడుగుల వ్యక్తులే. గడ్డాలు, మీసాలు ఉంటే గుర్తుపట్టటం కష్టం. ఆ కట్టలలో నుంచి రెండు పోస్టర్లను మాత్రం తీసుకొని, మిగిలినవి డ్రాయర్ లో పడవేసి కిందికి వచ్చాడు.

దుకాణంలో రోజీ డేవిడ్ తో ఏదో చెపుతుంది. షాడో రాగానే చటుక్కున ఆపింది. డేవిడ్ కొంచెం చిరాకుగా షాడోవైపు తిరిగాడు. తనకు కొన్ని మేకులు, ఒక సుత్తి కావాలన్నాడు షాడో. వాటిని యివ్వటానికి లేస్తూ "ఎందు"కన్నాడు డేవిడ్. అతనికి తన చేతిలోని పోస్టర్లను చూపించాడు షాడో.

వాటిని చదివి నిర్ఘాంతపోయాడు డేవిడ్. "ఇది ఎక్కడ పెడ్తావు రాజు" అని ప్రశ్నించాడు.

"ఇంకా ఎక్కడ పెడ్తాను? అందరూ మీ కొట్టు దగ్గిరకు వస్తారు గదా! అందుకని మీ గోడలకే కొడ్తాను."

"అలా వీల్లేదు. ఆ చెత్త కాగితాలు నా కొట్టుముందు పెట్టటానికి నేనంగీకరించను" నిరాకరించాడు డేవిడ్.

షాడో కళ్ళల్లో ఎరుపు జీరలు తొంగిచూశాయి.

"మిస్టర్ డేవిడ్! ఇంత జరిగినా యింకా చిన్న పిల్లల్లాగా మాట్లాడటం వింతగా వుంది. నేనడిగిన ప్రశ్నలకు మీరు సమాధాన మివ్వనంత మాత్రాన చేతులు ముడుచుకొని తిరిగి పోతానని కలలో కూడా అనుకోకండి. నేను పోలీస్ ఆఫీసర్ని. నాకు ప్రత్యేక అధికారాలు ఇవ్వబడ్డాయి. తలుచుకుంటే మీ కొట్టునిండా ఇలా పోస్టర్లు అతికించినా అడ్డుకోగల అధికారం మీకు లేదు. పబ్లిక్ ప్లే సెస్ లో గవర్నమెంటుకు పూర్తి హక్కు ఉన్నది."

క్షణంసేపు తటపటాయించి నిస్సహాయంగా భుజాలెగురవేస్తూ షాడో అడిగినవి తెచ్చిచ్చాడు డేవిడ్ . అవి తీసుకొని బయట వాకిలి పక్కనే రెండు పోస్టర్లను గోడకు కొట్టాడు షాడో. రెండడుగులు వెనుకకు వేసి తన పనితనాన్ని చూసుకొని తల వూపుకున్నాడు. ఇట్ విల్ డూ!

ఇంకో నలభై ఎనిమిది గంటల్లో తన ప్రశ్నలకు సమాధానాలు వాటంతట అవే పరుగెత్తుకుంటూ వస్తాయి.

సుత్తిని లోపల యిచ్చి, బయటకు వచ్చేసరికి గ్రామస్తులంతా దుకాణం ముందు గుమిగూడారు. ఆ పోస్టర్లను ఆసక్తితో చదువుతున్నారందరూ.

మెట్లుదిగి తన గదికి బయలుదేరాడు షాడో. ఇక వేచి యుండటమే మిగిలింది. ఒక చిన్న ఆధారం దొరికినా దాన్ని పట్టుకొని కేసు సాల్వు చేయటానికి వీలౌతుంది.

షంషేర్ రావటంచూసి ఒక గోడకానుకుని నిలబడి సిగరెట్టు వెలిగించుకున్నాడు. తనని ఆ రోజు సాయంత్రం లోపల గ్రామం వదలి వెళ్ళకపోతే చంపేస్తానని బెదిరించిన మొనగాడు తిరిగి గ్రామంలోకి అడుగుబెట్టటం యిదే ప్రధమం!

షంషేర్ దుకాణం దగ్గరకు వచ్చి పోస్టర్లను చూసి నిలబడిపోయాడు. రెండూ చదివి, చక్రవర్తి బొమ్మ వున్న పోస్టర్ని చించి ఉండచుట్టి నేలకేసి కొట్టాడు. పళ్ళు పట - పట కొరికాడు షాడో. షంషేర్ కు మాటల్తో చెపితే అర్థంకాదు. చేతల్లో చూపించాలి. సిగరెట్టు నేలకేసి కొట్టి జనాన్ని తోసుకుంటూ షంషేర్ ను సమీపించాడు. "ఆ పోస్టర్ని ప్రభుత్వం ప్రకటించి పంపింది. అమలు పర్చటానికి ఆఫీసరుగా నన్ను నియమించింది. దాన్ని చించి పారెయ్యటం నేరం! మర్యాదగా తీసి

ఎక్కడున్నదో అక్కడ పెట్టు" మొదట నెమ్మదిగా నచ్చ చెప్పటం తనవిధి కాబట్టి చెప్పాడు.

జవాబియ్యలేదు షంషేర్. షాడోవంక చూశాడు క్షణం పాటు. ఖాండ్రించి షాడో ముఖంమీద ఉమ్మి వేసి దుకాణం లోనికి పోబోయాడు. అదిరిపోయి చూస్తున్నారందరూ. అప్పటికి షాడో కోపం సంగతి అందరికీ తెలిసిపోయింది. ఐనా 'మొదట్లో షంషేర్ చేతుల్లో తన్నులు తిన్నాడు ఇప్పుడు మాత్రం ఎదురించి నిలువగలడా?' అని అనుకుంటున్నారు.

దుకాణంలో నుంచి బయటకు వచ్చారు రోజీ, డేవిడ్ లిద్దరూ. పక్కకు తిరిగిన షంషేర్ భుజం పట్టుకొని బలంగా తనవైపు తిప్పి, ఒక్కొక్క మాటే వత్తి - వత్తి పలుకుతూ గద్దించాడు షాడో. "మర్యాదగా పోస్టర్ని గోడకతికిస్తావా? నేనే నీ చేత అతికించనా?"

సమాధానం పిడికిలితో ఇచ్చాడు షంషేర్. ఆ దెబ్బకు నాలుగడుగులు వెనక్కుపోయి గోడకు తట్టుకొని నిలబడ్డాడు షాడో.

ముందుకి దూకి మరొక దెబ్బ వేద్దామని చెయ్యి ఎత్తాడు షంషేర్. తలవంచి అతని పొట్టలో కుమ్మాడు షాడో. ఆ వేగానికి ఇద్దరూ వరండా దాటిపోయి వీధిలోపడ్డారు. షాడో బాలెన్స్ నిలుపుకొని లేచి నిలబడ్డాడు. ముందు షంషేర్ లేచేదాకా ఆగి, రెండు చేతులు కలిపి తలమీద కొట్టాడు. చతికిల పడ్డాడతను.

"అతన్ని ఆపండి - ఆపండి" అంటూ ముందుకు రాబోయిన రోజీని పట్టుకొని నిలబెట్టాడు డేవిడ్. "మనం కల్పించుకొని లాభంలేదు పాపా!... ఇద్దరూ ఇద్దరే! మన మాట వినరు."

కింద కూర్చున్న షంషేర్ లేచినట్లే లేచి తలతో షాడో మోకాళ్ళమీద కుమ్మాడు. కాళ్ళు విరిగినంత బాధతో, వెనక్కు పడ్డాడు షాడో. లేచి నిలబడి కాలితో షాడో ముఖాన్ని తన్నాడు షంషేర్. అందరూ హాహాకారాలు చేశారు. ఆ దెబ్బ తగిలితే ముఖం పచ్చడయిపోతుంది. మెలకువగా తలను పక్కకు తిప్పుకున్నాడు షాడో. మీదగా పోతున్న కాలును పట్టుకొని గట్టిగా మెలితిప్పాడు. పెద్దగా అరుస్తూ కిందపడ్డాడు షంషేర్. లేచి నిలబడి గుండెలమీద మోకాలితో పొడిచాడు షాడో. చారెడురక్తం కక్కుకున్నాడు అతను.

రోజీ చూడలేక రెండు చేతుల్తోనూ కళ్ళు మూసుకుంది ఏడుస్తూ. ఏం చెయ్యటానికి పాలుపోక చేతులు నలుపుకుంటున్నాడు డేవిడ్.

అప్పుడే పరుగెత్తుకు వచ్చిన లక్ష్మణ్ ఏదో అంటూ షాడో చెయ్యి పట్టుకున్నాడు. అతన్ని విదిలించి కొట్టాడు షాడో. "ఎవరైనా కల్పించుకుంటే మర్యాద దక్కదు" అంటూ.

లేచి నిలబడిన షంషేర్ చెయ్యి బొడ్లో పెట్టిన కత్తి వైపు పోయింది. అది గమనించి ఎగిరి కాలితో భుజంమీద తన్నాడు షాడో. రెండుసార్లు

అడ్డంగా గింగిరాలు తిరిగాడు షంషేర్ . షాడో కిందపడిన కత్తిని అవతలకు విసిరాడు.

మళ్ళీ లేచి బలమంతా ఉపయోగించి గుద్దాడు. వరండా మెట్లెక్కి పోస్టర్లున్న చోట గోడకు గుద్దుకున్నాడు షంషేర్. తల పట్టుకొని గోడ కేసి కొట్టాడు షాడో. "అతికించు పోస్టర్ని అతికించు" అన్నాడు ఆయాసంతో రొప్పుతూ.

వెక్కి వెక్కి ఏడ్వసాగింది రోజీ. అప్పుడే వచ్చిన దాదాను చూసి గొల్లుమంది. షాడో వైపు రెండడుగులు వేశాడు దాదా. మెరుపులా ప్రత్యక్షమయ్యింది షాడో చేతిలో రివాల్వర్. దాన్ని వూపుతూ మళ్ళీ హెచ్చరించాడు . నోరు మూసుకొని వెనక్కొచ్చాడు దాదా.

షాడో స్పృహ తప్పుతున్న షంషేర్ ని నిలబెట్టి ఆ చెంపా ఈ చెంపా వాయించాడు గట్టిగా. బలవంతంగా కళ్ళు విప్పాడు షంషేర్. "పోస్టర్ని అతికించు" పిడికిలితో ముక్కు మీద పొడిచాడు. ముక్కు పగిలి రక్తం వరదలా కారసాగింది. మనిషి తోటకూర కాడలా వాలిపోతున్నాడు.

కిందికి వంగి పోస్టర్ని తీసుకొని సరిచేశాడు షాడో. షంషేర్ ముందుపెట్టి పట్టుకున్నాడు. "అతికిస్తావా లేదా?" మరొక దెబ్బ... ఆ విధంగా చితక్కొట్టి వదిలాడు షాడో. తూలుతూ కళ్ళు మూసుకునే పోస్టర్ని తీసుకున్నాడు షంషేర్. గోడమీద పెట్టి పిడికిలితో రెండుసార్లు తట్టాడు. గట్టిగా మూలుగుతూ నేలకు జారిపోయాడు.

"రాజా! ప్రయత్నించాడు. అతనున్న ఆ పరిస్థితిలో అంతకన్నా ఇంకేం చెయ్యగలడు?" షాడోని పక్కకు లాగుతూ సర్దాడు లక్ష్మణ్.

తల విదిలించి కమ్ముకొస్తున్న మైకాన్ని దూరం చేసుకున్నాడు షాడో. డేవిడ్ ని కాసిని మేకులు తెమ్మని అడిగాడు. వాటిని తీసుకొని, తమ రక్తంతో మలినమైన పోస్టర్ని మళ్ళీ యధాస్థానంలో కొట్టాడు.

"ఈ పోస్టర్ని కదిలిస్తే ఎవరికైనా ఈ గతే పడుతుంది" పళ్ళు బిగపట్టి మరొకసారి హెచ్చరించి, తన గదికి బయలుదేరాడు షాడో.

"రాక్షసుడివి నువ్వు - దయాధర్మం అనేది లేని కసాయి వాడివి. ఛీ-ఛీ" అని నిందించింది రోజీ.

"అవును. నేను రాక్షసుణ్నే. ఏదో ఒక చిలిపి పని చేశానన్న కక్షతో ఎముకలు విరక్కొట్టించిన మీరెవ్వరో? దేవతలా ? ఆ రోజు నీ ఆజ్ఞలను పాటించిన షంషేర్ దేవదూతా?"

"నలుగుర్లోనూ అలా కొడితే అతని పరువేం కావాలి?" విలపిస్తూ అన్నది రోజీ.

షాడో నాసికాపుటాలు విస్తరించాయి. పిడికిళ్ళు మూసి నిలబడ్డాడు. "రోజీ! ఏం మాట్లాడుతున్నావో తెలుస్తున్నదా? పరువా? అది మీకొక్కరికే ఉందనుకున్నావా? పోలీస్ ఆఫీసర్ గా నేను నా కర్తవ్యాన్ని నిర్వహించటంలో మీలాంటి పరువుగలవాళ్ళు అడ్డం వస్తే,

మరి నా పరువేం కావాలి? నేను కాకపోయినా..." గుండెలమీది బాడ్జీని తట్టి చూపించాడు. "ఈ బాడ్జీ పరువేం కావాలి?" అని ప్రశ్నించాడు.

మౌనంగా రోదిస్తూ కళ్ళు తుడుచుకోసాగింది రోజీ. అమెవైపు అసహ్యంగా చూసి తూలుకుంటూ బయలుదేరాడు. మధ్యలోనే పరిగెత్తుకుంటూ వచ్చి, అతనికి సాయం చేసింది చిలక.

"రాజూ...మేడమీద నుంచి నేను అంతా చూశాను. అబ్బ...ఏం పోట్లాట... నేను చూస్తూనే ఉన్నాను... భయం కరంగా ఉంది" ఎక్సైట్ అయి ఏవేవో మాట్లాడుతున్నది. చిరునవ్వుతో ఆమె భుజంమీద చెయ్యి వేసి ముందుకు అడుగులు వేశాడు షాడో.

9

గట్టిగా మూల్గుతూ లేచి కూర్చున్నాడు షంషేర్. చేయి అందించి సాయం చేయటానికి వచ్చిన వారందరినీ విసిరికొట్టి, తనే గోడ నాధారం చేసుకొని నిలబడ్డాడు. షాడో అన్నట్లుగానే అతని వళ్ళంతా గుల్ల అయింది. అలాగే అతి ప్రయత్నం మీద వరండా మెట్లు దిగి జనాన్ని తోసుకొని వెళ్ళిపోయాడు. అతని వంకే విస్ఫారిత నేత్రాలతో చూడసాగింది రోజీ.

"రోజీ! లోపలకు రామ్మా! నీతో మాట్లాడాలి" డేవిడ్ అన్నాడు మెల్లిగా.

అతని వెనకే దుకాణం లోపలికి పోయింది రోజీ. లక్ష్మణ్ కాకా కూడా లోనికి వచ్చాడు.

"చూడు తల్లీ! ఈ రాజు సామాన్యుడుగాదు. మేం సమాధానాలు చెప్పకుండా నిరాకరిస్తే ఇది వరకు వచ్చిన వారిలా తిరిగి వెళ్ళిపోతాడనుకున్న మా ఊహలన్నీ తారుమారయ్యాయి. విధిని తప్పించుకోవచ్చేమోగాని ఇతన్ని తప్పించుకోలేం! అతని పద్ధతి చూశావా? ఎవరికి ఏ విధంగా నచ్చచెప్పాలో తెలుసు. మంచిగా ఉంటేనే మనిషి. అడ్డం తిరిగితే కాలభైరవుడే. ఇక యితన్ని ఆపటం కష్టమమ్మా. మనం చెప్పకపోతే, ఆ బహుమానానికాశపడి ఎవరో ఒకరు చెప్పకపోరు. అప్పుడు మరింత చిక్కుల్లో పడతాం పాపా" భుజంమీద చెయ్యివేసి మృదువుగా అన్నాడు కాకా. అతనితో ఏకీభవిస్తూ తలలు వూపారు మిగిలిన యిద్దరూ.

"ఆడదాన్ని నేనేం చెయ్యగలను కాకా? మా నాన్నే ఆరోగ్యంగా వుంటే ఈ బాధ్యతలన్నీ ఆయన నెత్తిమీద వేసుకునేవాడు. ఏం చేస్తే ఏం పుట్టి మునుగుతుందో అని భయంగా ఉంది" గద్గద స్వరంతో అన్నది రోజీ.

"ఇంక ఎంతోకాలం ఆగటం ప్రమాదం తల్లీ! అతనితో అన్ని విషయాలు చెప్పటమే మంచిదని మా అభిప్రాయం. స్వతహాగా అతనిది సున్నితమైన మనస్సు. నువ్వే పోయి చెపితే వినకపోడు" వత్తిడి చేశాడు డేవిడ్.

"వారం క్రితం నాగూర్ ముఠా గోల జరిగినప్పుడు దాదా యిక్కడే ఉన్నాట్టగదా! తిరిగి వచ్చిన తర్వాత అతను కూడా యిదే మాట చెప్పాడు. నేను తీసుకున్న నిర్ణయం తప్పయితే..." కనుల నీరు నిండి, తటపటాయిస్తున్న రోజీకి ధైర్యం చెప్పాడు లక్ష్మణ్.

"ఇక ఆలోచించడం అనవసరం పాపా! బయల్దేరు. వెంటనే కలుసుకొని మాట్లాడు. ఇప్పటికే అతనికి స్నేహితుల సంఖ్య ఎక్కువ అవుతుంది. ఇక ఏ మాత్రం ఆలస్యం చేసినా నీ మీద, నీ తండ్రి మీద ఒక దురభిప్రాయాన్ని ఏర్పరచుకొనే అవకాశం ఉంది. ఆ అభిప్రాయం మదిలో నాటుకుపోతే పెకలించటం కష్టం."

కన్నీళ్ళు తుడుచుకుంటూ షాడో గదికి బయల్దేరింది రోజీ. మెట్లమీద నుంచి కూజా పట్టుకు వస్తూ ఎదురు పడింది చిలక.

"విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇప్పుడు ఎవర్నీ చూడడు" అన్నది.

అంత విషాదంలోనూ నవ్వు వచ్చింది రోజీకి. "నన్ను చూస్తాడులే" అంటూ చిలకను తప్పించుకొని పైకి పోయింది.

"హల్లో బేబీ! అప్పుడే వచ్చావే" తడి తుండుగుడ్డ మండుతున్న ముఖంమీద పెట్టుకొని పడుకున్నాడు షాడో. చొక్కా, బనీను తీసేసి, ఒక్క పాంటు మాత్రమే ఉంచాడు. మెలితిరిగిన కండలు, విశాలమైన వక్షం చూస్తే అతను అందర్నీ శిక్షించగలుగుతున్న కారణం అర్థమైంది రోజీకి. తన మాటలకు సమాధానం రాకపోవటంతో టవల్ తీశాడు

షాడో. "మీరా! ఇక్కడి కెందుకువచ్చారు?" లేచి మంచం మీద పడవేసిన చొక్కా తొడుక్కుంటూ అన్నాడు.

"మీ.... మీతో కొంచెం మాట్లాడాలి." నసిగింది రోజీ. షాడో నిలబడగానే మొదటిరోజు అనుభవం గుర్తుకు వచ్చి ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

అది గమనించనట్లూ నటిస్తూ తలుపులు దగ్గిరగా వేసి కూర్చోమని కుర్చీ చూపించాడు. డ్రాయర్ లో ఉన్న పనామా పాకెట్టు తీసి సిగరెట్టు వెలిగించుకున్నాడు. "చక్రవర్తి చనిపోయాడు గదూ"

ఊహించని ఆ ప్రశ్నకు దిమ్మెరపోయింది రోజీ. "ఎలా... తె... తెలుసుకున్నారు?"

"ఇందులో తెలుసుకోవటానికి పెద్ద విషయమేముంది? రెండు - రెండూ కలిపితే నాలుగవుతాయి. ఇందాక మీ వాడి దెబ్బలకు నా బుర్ర కొంచెం పని చేసింది. ఏమీ తెలియని ఒక పరదేశి మీద మీ కెందుకంత కక్ష? షంషేర్ రెండు పోస్టర్లలోనూ చక్రవర్తి పోస్టరే ఎందుకు చించాడు?"

"అవును. చక్రవర్తి చనిపోయాడు. చంపింది కూడా మా తండ్రిగారే"

చిన్నగా విజిల్ వేశాడు షాడో. చంపారనుకున్నాడు గాని చంపింది ఎవరో ఊహించలేదు.

"ఎందుకని చంపాల్సివచ్చింది?" మృదువుగా అడిగాడు

ఎగిరి చిందులు తొక్కుతాడనుకున్న వ్యక్తి అంత ఆదరంగా అడుగుతుంటే నమ్మలేక ఆశ్చర్యపోయింది రోజీ. సానుభూతి లభించేసరికి స్త్రీ హృదయం మళ్ళీ రోదించసాగింది.

"మీ చక్రవర్తి ఇక్కడకు వచ్చి నెల రోజులున్నాడు. ఎవరికోసమో వచ్చానని చెప్పాడు. కాని వివరాలు మాకు అందియ్యలేదు. ఎప్పుడూ మా లోయలో తిరుగుతూ ఉండేవాడు. ఒక రోజు -" అని ఆగిపోయింది.

"ఆ ఒక రోజు - ఏమైంది రోజీ"

"మా పశువులు క్రమంగా తగ్గ నారంభించాయి. అప్పుడప్పుడూ ఒకటీ అరా అడవి జంతువుల వాతపడటం తప్పించి పెద్దగా పోయేవి కావు. కాని మీ చక్రవర్తి వచ్చాన దగ్గర నుంచి వందల్లో మాయమవసాగాయి. ఆ సంగతి స్వయంగా చూద్దామని బోయరా కొండ చెరియల్లోకి పోయారు మా తండ్రి. అక్కడ - అక్కడ నాగూర్ తో కలిసి మా పశువుల్ని కొండదారుల్లో బోయరా దాటిస్తున్నాడు మీ చక్రవర్తి."

"మైగాడ్. ఒక సి.ఐ.డి. ఆఫీసరు దొంగతనానికి పాల్పడ్డాడా?"

"మా తండ్రి వారిని నిలవేశాడు. పెద్ద గొడవ జరిగి కాల్పుల దాకా వెళ్ళింది వ్యవహారం. తనని పట్టుకున్నాడన్న కోపంతో రివాల్వరుతో మా తండ్రిని కాల్చాడు మీ ఆఫీసరు. ఎదురు కాల్పులు జరిపి అతన్నే

నేల కూల్చాడు నాన్న. నాగూర్ ఆ సందడిలో తప్పించుకు పోయాడు."

దమ్ము మీద దమ్ము లాగుతూ పచార్లు చెయ్యసాగాడు షాడో. అనుకోని విధంగా, మారిపోయింది కేసు. మాయమయిన సి.ఐ.డి. ని వెతకటం ఒక ఎత్తూ, అతను దొంగగా మారటం వల్ల చంపబడ్డాడని నమ్మటం ఒక ఎత్తూ.

"మీ తండ్రి ఎక్కడున్నాడు?"

"ఇంటి వద్దే. చక్రవర్తి పేల్చిన గుండు వెన్నెముకలో దిగబడింది. మూడు నెలల నుంచీ స్పృహలేదు. బ్రతకటం అనుమానమేనన్నాడు డోబ్రా నుంచి వచ్చిన డాక్టరు. బ్రతికినా యిక నడవలేడు."

"ఈ సంగతి మీరే పోలీసుల కెందుకు తెలియజేయలేదు?"

ఎలా చెప్పమంటారు? పోలీసాఫీసర్ని చంపితే వాళ్ళు వూరుకుంటారా. మేం చెప్పేది విని, మాకు న్యాయం చేకూరుస్తారా? అందుకనే ఈ వార్తని తొక్కి పట్టి ఉంచాం"

సిగరెట్టు మూలకు విసిరి మరొకటి వెల్గించాడు షాడో. "మీ గ్రామంలో వాళ్ళందరికీ పోలీసులంటే వింత - వింత అభిప్రాయాలున్నాయే? కొంతమంది - వాళ్ళు మనుషులు కాదు రాక్షసులంటారు. మరికొందరు- హృదయం లేని రాతి బొమ్మలంటారు" అన్నాడు

మాటలు సూటిగావచ్చి రోజీ గుండెల్లో నాటుకున్నాయి. లజ్జతో తల వంచుకుంది.

"నేరస్తుడు ఎవరయినా సరే, పేదవాడైనా ,ధనికుడైనా, ఆఫీసరైనా, జవానైనా నేరస్తుడే! అందరికీ శిక్ష ఒక్కటే విధంగా ఉంటుంది. మీ ఆస్తిని కాపాడుకునే హక్కు మీకు ఎప్పుడూ ఉంటుంది. ఆ ప్రయత్నం నేరం కాదు. చక్రవర్తి దొంగతనం చేస్తున్నప్పుడు మీరు అడ్డుకున్నారు జరిగిన కాల్పుల్లో అతను మరణించాడు. ఆ విషయాన్ని కోర్టులో చెపితే ఏ జడ్జీ కాదంటాడు? పోలీసాఫీసరైనంత మాత్రానా కొమ్ములు మొలిచాయా?"

"అయితే మీరు - మీరంటున్నది మా తండ్రిని బంధించరనా" ఆనందం, ఆశ్చర్యం, అయోమయం అన్నీ ఒక్కసారి కలవరపర్చాయి రోజీని.

"ఏ ఆధారాల మీద బంధించను? ఆస్తిని కాపాడుకోవటానికి ప్రయత్నించాడనా?"

కుర్చీలోనుంచి లేచి, చేతులు జోడించింది రోజీ. కన్నీళ్ళు ఆనంద భాష్పాలుగా మారి బుగ్గలు తడుస్తున్నాయి.

"మీ మాటలు నాకెంత ధైర్యాన్నిచ్చాయో చెప్పలేను. అటు స్పృహలేకుండా చావు బ్రతుకుల మధ్య ప్రేలాడుతున్న తండ్రి, ఇటు

పోలీసుల యెంక్వైరీ, నా మనస్సును పిండి చేశాయి. ఒక్కక్షణంలో నా బాధను ఉపశమింప చేశారు" అన్నది.

హాయిగా, తెల్లగా, మల్లెలాగా నవ్వుతున్న ఆమె ముఖాన్ని చూసి సంతోషించాడు షాడో. పిచ్చి పిల్ల ఎంత బాధ పడిందో అనుకుంటూ. "అయినా, నా తృప్తికోసం పోరాటం జరిగిన స్థలాన్ని ఒకసారి నేను చూడాలి. తగాదా ఏ విధంగా జరిగిందో నాకు వివరంగా చెప్పాలి" అన్నాడు.

"తప్పకుండా! రేపు మా లోయకు రాగలరా? దాదా ఇంటికి పోయాడు. అతను ఉంటే మీకు అన్నీ వివరంగా చెప్తాడు. అతను జరిగిన గొడవ కొంతవరకూ చూశాడు."

"ఐతే, ఐవిట్‌నెస్ కూడా ఉందన్నమాట. ఇకనేం"

రోజీని బయటికి పంపి తలుపువేసి మంచంమీద వాలాడు షాడో. జరిగినదంతా సరిగానే వుంది. కాని చక్రవర్తి దొంగగా మారటానికి అవకాశాలు లేవే!

డ్రాయర్లో ఉన్న పోస్టర్లను ముందు వేసుకొని పెన్నుతో వాటిమీద ఏవేవో గీతలు గీస్తూ కూర్చున్నాడు.

## 10

అద్దం ముందు కూర్చుని తన అందాలు చూసుకుంటున్న రోజీ, వెనుక షంషేర్ కనపడడంతో చివాల్న వెనుతిరిగింది. ఎంత చనువుగా

ఉన్నా ఆమె గదిలోకి అతనెప్పుడూ అడుగు పెట్టలేదు. అదే మొదటిసారి. కోపంతో ఏమిటన్నట్లు చూసింది.

షాడో కొట్టిన దెబ్బలు అతని వంటినిండా క్లియర్ గా కనిపిస్తున్నాయి. బల్లమీద కూర్చుని బీడీ వెల్గించాడు. "పశువుల్ని బోయరాలో వదలమని చెప్తే కొట్టాలలోకి తోలించావట?"

రోజీకి అరికాలిమంట నెత్తికెక్కింది. "ఈ ఆస్తికి యజమానిని నేను. నువ్వు సామాన్యమైన తలారివే. నా ఆవుల్ని నా యిష్టం వచ్చిన చోటుకి తోల్తాను. అడగటానికి నీకు అధికారం లేదు"

"నేనే లేకపోయినట్లయితే యీపాటికి నాగూర్ దూడను కూడా మిగల్చకుండా అన్నిటినీ దొంగిలించి ఉండేవాడు"

"నీకు జీతం యిచ్చి మేపుతున్నది మరెందుకనుకున్నావ్?"

"ఐతే నేనుకూడా జీతగాడినేనా? మరేమీ కాదా?" కోపంతో ప్రశ్నించాడు షంషేర్.

రోజీ జవాబివ్వలేదు. మూడు నెలలుగా తను పూర్తిగా షంషేర్ మీద ఆధార పడటంలోని పొరపాటు ఇప్పుడర్థమైందామెకు. తనకు తెలియకుండానే అతనికి సందిచ్చింది.

"ఈ ముసుగులో గుద్దులాటలు నాకు ఇష్టంలేదు రోజీ! మన పెళ్ళెప్పుడు?"

"పెళ్ళా? నీకూ - నాకా? కలకంటున్నావా?"

అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డాడు షంషేర్. "ఐతే నన్ను ఒక పిచ్చివాడి కింద జమకట్టి ఉపయోగించుకున్నావన్న మాట. ఇదిగో రోజీ, ఒకటేమాట చెప్తాను విను" భుజం పట్టుకుని దగ్గిరకు లాక్కున్నాడు. విడిపించుకోవటానికి ప్రయత్నించింది రోజీ. ఫలితం లేకపోయింది. "నాలుగు రోజుల లోగా మనపెళ్ళి జరిగిందో సరేసరి. లేకపోతే ఆ నాగూర్ ముఠాలో చేరిపోతాను. ఫలితం - నీకు తెల్సుగా"

"దుర్మార్గుడా! తిన్న యింటి వాసాలు" ముఖాన్ని రెండు చేతులతోను పట్టుకొని ముద్దు పెట్టుకోవటానికి ముందుకు వంగాడు. చేతులడ్డం పెట్టి అతని పెదవులను తన మీదికి రానీయకుండా ఆపుతోంది. అయినా ఆ పశువు ముందు ఆమె ఏపాటిది? చేతుల్లో శక్తి తగ్గిపోతుంది. షంషేర్ వికటంగా నవ్వుతూ ఆమె పెదవులను అందుకున్నాడు.

పిడుగులాంటి దెబ్బ నెత్తిమీద పడటంతో చివ్వున వెనుతిరిగాడు.

రోషకషాయిత నేత్రాలనుంచి నిప్పులు కురిపిస్తూ నిలబడివున్నాడు దాదా. "దిక్కూ మొక్కూ లేనివాడిని తెచ్చి, పని యిచ్చి బ్రతికించినందుకు విశ్వాసం ఇలా చూపిస్తున్నావ్ గదూ" రెండవ దెబ్బకు ఎగిరి మంచానికి కొట్టుకున్నాడు షంషేర్.

"దాదా" అంటూ అతన్ని పట్టుకొని ఆపింది రోజీ.

వళ్ళు దులుపుకుంటూ లేచి నిలబడ్డాడు షంషేర్. "నన్నే అవమానిస్తారుగా! చూపిస్తాను నా తడాఖా" అంటూ రంకెలు వేస్తూ బయటికి వెళ్ళిపోయాడు.

"దాదా" నిస్సహాయంగా అంది రోజీ. "వీడు పోయి నాగూర్ తో కలుస్తాడేమో"

"పోనీ పాపా! తుమ్మితే వూడిపోయే ముక్కు ఎంతకాలం నిలుస్తుంది? నిన్ను చేసుకొని ఆస్తికే ఎసరు పెట్టాలని చూస్తున్నాడు. ఆ చీడపురుగును నమ్మి చేరనీయటం మనదే పొరపాటు" అంటూ ఓదార్చాడు దాదా.

* * *

పళ్ళు బిగపట్టి బలంగా బారలువేస్తూ నదికి ఎదురీదసాగాడు షాడో. ఇంకా తెల్లవారలేదు. బయట చలి ఎముకలను కొరుకుతుంది. కొండల మీదినుంచి రావటం వల్ల రక్తాన్ని గడ్డ కట్టించేటంత చల్లగా వున్నాయి నీళ్ళు. వళ్ళు నెప్పులు పెడుతున్నా అలాగే ఈది ఈది బయటకు వచ్చాడు షాడో. టవల్ పెట్టి బరబరా వళ్ళు తుడుచుకొని దుస్తులు వేసుకున్నాడు. బిగపట్టిన కండరాలు ఆ చల్లదనానికి సళ్ళిచ్చాయి. పనామా వెల్గించి తీరికగా గ్రామంలోకి అడుగు పెట్టాడు.

కాకా ఇంటిముందు కూర్చున్నారు ముగ్గురు మిత్రులూ. "ఎక్కడికి పోయి వస్తున్నావ్ బాబూ" ప్రశ్నించాడు కాకా.

"నదికిపోయి కాస్త వళ్ళు గట్టిపరుచుకు వస్తున్నాను"

"ఏమిటీ? ఈ చలిలో ఆ మంచునీళ్ళల్లో దిగావా? నువ్వు మనిషివా? ఇనుపముక్కవా?" నోరు తెరిచాడు లక్ష్మణ్.

నవ్వుతూ తన గదిలోకి పోయాడు షాడో. రివాల్వర్ క్లీన్ చేసి ఫ్రష్ బుల్లెట్సు ఎక్కించాడు. డాగర్ ని తుడుస్తుండగా చిలక పుల్కాలు తెచ్చింది. ఆమెతో వేళాకోళాలాడుతూ ఫలహారం చేశాడు. తనకోసం ప్రత్యేకంగా డేవిడ్ దాచుకున్న కాఫీపొడి తెచ్చింది. చిలక తయారు చేసిన కాఫీ త్రాగాడు బలవంతంగా.

"ఎట్లావుంది?" ఆత్రంగా అడిగింది చిలక.

"కాఫీయా? కాఫీకేం అమృతం. ఇటువంటి కాఫీ ఇంత వరకూ తాగి ఎరగను" బయటకు రాబోతున్న కాఫీని బలవంతంగా కిందికి తొక్కుతూ గబగబా పనామా వెల్గించాడు.

హుషారుగా అడుగులు వేస్తూ అరణ్యంలో ప్రవేశించాడు. మధ్యలోనే షాడోకు చుట్ట కాలుస్తూ ఎదురుపడ్డాడు దాదా. చూడగానే నమస్కరించాడు.

"బాబూ, బోయరాకు పోదామా! బాబుగారిని చూసి వద్దామా?"

"మొదట కొండ చెరియకే పోదాం దాదా. దారిలో రైఫిల్స్ ఏమీ లేవు గదా"

"క్షమించాలి బాబూ! నేను ఎందుకు అలా చేశానో మీకు అర్థమైవుంటుంది. బాబుగారు నాకు దేముడు. ఆయన్ని రక్షించటం కోసం ఏమైనా చేస్తాను" సిగ్గు పడుతూనే తను చేసిన పనిని సగర్వంగా సమర్థించుకున్నాడు దాదా. ఆ నిష్కాపట్య హృదయానికి ముగ్ధుడయ్యాడు షాడో.

పదిగంటల సమయానికి బోయరా కొండ చెరియలోకి చేరుకున్నారిద్దరూ. తగాద జరిగిన చోటును చూపించాడు దాదా.

"బాబుగారు ముందు వెళ్ళిన తరువాత పొదలలో చిక్కుకున్న లేగదూడను బయటికి తీసి పావుగంట ఆలస్యంగా అక్కడికి చేరుకున్నాను బాబూ. దారి మధ్యలోనే కాల్పులు వినిపించాయి. వచ్చి చూసేసరికి నాగూర్ పారిపోతూ కన్పించాడు. చక్రవర్తి మోకాళ్ళమీద కడుపు పట్టుకొని కూర్చొని వున్నాడు. పక్కన రైఫిల్ పొగలు చిమ్ముతూ పడివుంది. స్పృహలేకుండా రక్తపు మడుగులో పడి వున్నారు మా బాబుగారు"

"నువ్వేం చేశావ్?"

"నేను చూస్తుండగానే కిందపడిపోయాడు చక్రవర్తి. అదిగో, ఆ కన్పించే గుంటలో నీళ్ళు తీసుకువచ్చి బాబుగారి ముఖం తుడిచాను. మెల్లిగా కళ్ళు విప్పారు. 'దాదా. చక్రవర్తి దొంగరా. పోలీసు ఆఫీసరు

కాదు' అన్నారు. అప్పటికీ ఇప్పటికీ ఆయన ఆఖరు మాట బాబూ! ఇంత వరకూ స్ఫురాలేదు"

"మరి చక్రవర్తిని చూడలేదా నువ్వు"

తల వంచుకున్నాడు దాదా. "నాకు ఆ ఆలోచనపోలేదు బాబూ! మా దొర పడిపోయేసరికి నాకు పిచ్చెక్కినట్లయింది. ఆయన నడుముకు తగిలిన గాయానికి కట్టుకట్టి, తలకింద వత్తువేసిన తరువాత గాని గుర్తురాలేదు. నేను అతని దగ్గిరకు పోయేసరికి మరణించి వున్నాడు"

"ఆ తర్వాత ఏం జరిగింది?"

"కొమ్మలతో, తెప్పలాగా కట్టి, దానిమీద బాబుగారిని పడుకోబెట్టి గతుకులు తగలకుండా ఇంటికి లాక్కుపోయాను. తర్వాత సాయంకాలం ఇంకా ఇద్దరు జీతగాళ్ళతో వచ్చి చక్రవర్తి శవాన్ని పాతిపెట్టాము" ఎత్తుగా వున్న మట్టిదిబ్బను చూపించాడు. దానిమీద పచ్చిక కూడా మొలిచింది. ఇంకో నెలపోతే అక్కడ శవాన్ని పాతినట్లు గుర్తుకూడా వుండదు.

"అయితే పారిపోయిన నాగూర్- ఇతని కోసం తిరిగి రాలేదన్న మాట" పైకి అనుకున్నాడు షాడో.

"వచ్చిన జాడలేం కన్పించలేదు బాబూ! యాభై గిబ్బా జాతి ఎడ్లను తోలుకుపోతుండగా అడ్డుకున్నారు బాబుగారు. వాటిని ఈ

పచ్చికల్లోంచి మళ్ళించటం మాకు ఒక పట్టాన సాధ్యంకాలేదు. అందుకని రెండురోజులు ఇక్కడే కాపలా వున్నాము. వాటికోసమైనా వస్తాడేమో అని రైఫిల్స్ పుచ్చుకొని కూర్చున్నాము. రాలేదు బాబూ"

పనామా వెల్గించి ఆలోచనలో పడ్డాడు షాడో. ఏదో ఒక నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత తనది. చక్రవర్తి దొంగగా మారాడు. అందువలన చంపబడ్డాడు అని రిపోర్టు వ్రాస్తే అడిగేవాడు లేడు. గవర్నమెంటు కూడా తన మాట వేదవాక్కులా నమ్ముతుంది. కాని అది ఎలా సాధ్యం? సి.ఐ.డి. శాఖ మనుష్యులు నిప్పులోకాల్చిన వ్యక్తులు. అంత తొందరగా నేరాలు చెయ్యటానికి పాల్పడతారా? ఇందులో ఏదో మిస్టరీ వుంది.

"దాదా ఏదైనా బలమైన కొమ్మనరికి ఆ దిబ్బను తవ్వు. అతని అస్థిపంజరాన్ని చూడాలి" బూటులోంచి డాగర్ తీసి ఒక వైపునుంచి మట్టిని పెకలించసాగాడు.

ఒక ఎండుకొమ్మ విరిచి దాదాకూడా తవ్వ నారంభించాడు. మరో అరగంటలో దుర్వాసన వెలువరుస్తూ ప్రత్యక్షమయింది అస్థిపంజరం.

జేబులోనుంచి టేపుతీసి పొడుగు కొలిచాడు. ఐదడుగుల పదకొండు అంగుళాలు వుంది. వంకరటింకరలు తీసి, చర్మం పోయిన దానికి కొంత కలిపితే ఆరడుగుల పైన వుండవచ్చు.

నిజమే. చక్రవర్తి ఆరడుగుల మనిషే. కాని దేవరాజు కూడా ఆరడుగుల ఒకంగుళం వుంటాడు. డాగర్ తో చివికి పోయిన గుడ్డల్ని చీల్చాడు. కుడికాలు తొడదగ్గిర నుంచి జాగ్రత్తగా పరీక్షించాడు. ఎముకలు చాలా క్లీన్ గా వున్నాయి. చీలమండదాకా ఎక్కడా విరిగినట్లు కనిపించలేదు. చక్రవర్తి కుడికాలు ఒకసారి ఫ్రాక్చర్ అయింది. మరి ఈ అస్థిపంజరంలో అటువంటి గుర్తులు కనిపించటం లేదు. మరొక్కసారి పరీక్షించి ఒక దృఢనిశ్చయానికి వచ్చాడు షాడో.

"చక్రవర్తి మీ బాబుగారి యింటికి ఎప్పుడైనా వచ్చాడా దాదా?"

"వచ్చిన కొత్తలో రెండుసార్లు వచ్చాడు బాబూ"

"నువ్వు అతన్ని దగ్గరగా చూశావా?"

చూశానని తలవూపాడు దాదా.

"ఇప్పుడు చూస్తే గుర్తుపడతావా" అంటూ జేబులో నుంచి రెండు పోస్టర్లను బైటికి తీశాడు. వాటిని చూసి పెదవి విరిచాడు దాదా.

"ఆయనకు గడ్డం బాగా పెరిగివుంది బాబూ. నెత్తిమీద ఎప్పుడూ ఫెల్టుహేటు వుండేది"

"మనిషి తెల్లగా పాలిపోయినట్లు వుంటాడు కదూ"

"అవును. ఏమిటో ఎండముఖం చూడని వాడిలాగా"

మరో రెండు పోస్టర్లను తీసి చూపించాడు చక్రవర్తి బొమ్మకు గడ్డాలు మీసాలు పెట్టి వున్నాయందులో. రెండవది దేవరాజుది. దానికి కూడా గడ్డంగీశాడు షాడో.

"ఇదే బాబూ. ఇతనే. గడ్డం కొంచెం పొడుగు అంతే! నెత్తిమీద టోపీలేదే" అంటూ కింద పేరుచదివి భ్రాన్పడిపోయాడు దాదా.

చిరునవ్వుతో పోస్టర్లను మడిచి జేబులో పెట్టుకున్నాడు షాడో.

"చూశావా. తెలిసీ తెలియక మీరంతా కుమ్మక్కై ఎటువంటి ఘోరాన్ని కప్పిపుచ్చారో! ఈ సంగతి ముందే మాకు తెలిసివుంటే మా పరిశోధన వేరుగా వుండేదికదా"

"అంటే... అంటే..."

"అంటే లేదు, గింటేలేదు. ఇంకా అర్థంకాలేదా? మీ బాబుగారు చంపింది చక్రవర్తిని కాదు. దేవరాజును. మధ్యలోనే చక్రవర్తిని మాయం చేసి దేవరాజు పోలీసాఫీసరుగా ఇక్కడికి వచ్చాడు. మీ వివరాలన్నీ తెలుసుకొని నాగూర్ కు సాయం చేయనారంభించాడు. ఆ తర్వాత నాగూర్ ఎందుకు రాలేదనుకున్నావ్? ప్రభుత్వం మిమ్ములను నేరస్తులుగా ఎంచి గొడవచేస్తే, ఆ గడబిడలో మీ పశువుల్ని దొంగిలించవచ్చని బిగుసుకు కూర్చున్నాడు."

షాడో మాటలు దాదా హృదయంలో ఆనంద తరంగాలు సృష్టించాయి. నాగూర్ కు దేవరాజు చనిపోయినట్లు తెలిసి కూడా వీరి

మీద కక్ష సాధించటానికి తన దగ్గిరకు రాని కారణాన్ని గురించి వూహాగానం చెయ్యసాగాడు షాడో.

చక్రవర్తిని మాయం చెయ్యగలిగారు?

నికోబార్స్ ప్రవేశించిన తరువాతా? అంతకుముందా? నాగూర్ స్థావరానికి పోయి చూడాలి. లక్ వుంటే ఏమైనా ఆధారాలు లభించవచ్చు. తన ఆలోచనలను దాదాకు తెలుపకుండా, అతనితో చెప్పి మళ్ళీ అస్థిపంజరాన్ని గోతిలోకి తోసి పూడ్చాడు షాడో.

గుంటలో కాళ్ళూ చేతులు కడుక్కొని రోజీ యింటికి బయలుదేరారు. సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చాడు. కడుపులో కరకరలాడుతూ వుండటంవల్ల వేగంగా అడుగులు వేయసాగాడు షాడో. తమ భయాలన్నీ నిరాధారమైనవని తెలిసి, తేలికపడిన మనస్సుతో, ఎప్పుడు ఈ వార్త రోజీకి చెపుదామా అన్న ఆతృతతో షాడోకంటే వేగంగా నడవసాగాడు దాదా.

## 11

పొదచాటున చేరి నిశ్శబ్దంగా లోయలోకి చూడసాగారు షాడో, భంగులు. తూర్పుదిక్కు వెలుగు పులుముకుంటున్నది. ఆ వెలుగులో లోయలో మధ్యగా వున్న ఒక చెక్క యిల్లు వారికి నేత్రపర్వం చేసింది. ఇంటి చుట్టూ పొదలన్నీ నరికి శుభ్రంగా చదును చేయబడి వుంది నేల తాము కూర్చున్న దగ్గిరనుంచి ఏమాత్రం

ముందుకు జరిగినా ఇంటిలోవున్న వారికి కనపడటం తథ్యం. సమయం కోసం వేచివున్నాడు షాడో. అంతకుముందు రోజీ యింటి దగ్గిర జరిగిన సంఘటనలు అతని మదిలో మెదిలాయి.

ఇంటకి చేరుతూనే దాదా గబగబా అన్ని విషయాలు చెప్పాడు రోజీకి. ఆనందంతో షాడోను కౌగిలించుకున్నంత పనిచేసిందామె. ఆ కృతజ్ఞతాభివందనాలు భరించలేక పోయాడు షాడో.

"రండి. మా తండ్రిగారిని చూద్దురుగాని" అంటూ ఒక గదిలోకి తీసుకుపోయింది రోజీ. వెలుగు చొరకుండా కిటికీలన్నీ మూసివున్నాయి. ఆ గుడ్డి వెలుగులో ఒక టక్క చిక్కిన మానావాకారాన్ని చూశాడు షాడో. ఎముకలన్నీ బయటికి పొడుచుకువచ్చి మాంసం వుందా - లేదా అనే సందేహాన్ని కలిగిస్తున్నాయి. దవడలు గుంటలు పడ్డాయి. కళ్ళు మూసుకొనిపోయి వున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మెల్లగా జరుగుతున్నాయి.

అడుగుల చప్పుడు అతనికి బాధ కలిగిస్తుందేమో అని ఎత్తి ఎత్తి అడుగువేస్తూ బయటికి వచ్చారిద్దరూ.

"నిన్ననే డాక్టరు వచ్చి మరొకసారి పరీక్షించి పోయారు. ఇంకో వారం లోపల కోలుకొని కళ్ళు తెరవటానికి అవకాశాలున్నాయట" చెప్పింది రోజీ.

బలవంతాన షాడోను వంట గదిలోకి లాక్కుపోయి భోజనం చెయ్యమని నిర్బంధించింది. అంతవరకూ ఆకలితో నకనకలాడిన షాడో తనకు ఆకలి లేదన్నాడు. తను చెయ్యవలసిన పనులు అతని మనస్సులో సుడులు తిరుగసాగాయి.

కాఫీ తయారు చేస్తానని కూర్చోబెట్టింది రోజీ. చిలక తెచ్చిన కాఫీ గుర్తుకువచ్చి ఖంగారుపడ్డాడు. కానీ ఆమె చేతి కాఫీ అద్భుతంగా వుంది. అదేమాట ఇంకా కొంచెం అందంగా చెప్పి, ఆమె బుగ్గలు కెంపులు చూసుకొని బయలుదేరాడు.

* * *

ఇంటి వరండాలో కూర్చున్న గార్డు లేచి నిలబడి రైఫిల్ భుజాన వేసుకొని పచార్లు చేయసాగాడు. వెనక వైపు నుంచి ఇంకొకడువచ్చి అతనితో కలిసి మాట్లాడ సాగాడు.

"భయ్యా! ఇలా ఎంతసేపు కూర్చుంటాం? ఇలా అయితే చీకటిపడే దాకా లోపలికి పోలేం" విసుగ్గా అన్నాడు భంగూ. అవసరమైతే ఒక రోజు కాదు. వారం రోజులైనా వున్నచోటునుండి కదలకుండా కూర్చోగల సామర్థ్యం షాడో కుంది. "తప్పదు భంగూ! పొరపాటు చేస్తే ప్రాణాలకే మోసం వస్తుంది" అన్నాడు.

* * *

"మరి... మరి నిన్ను ఆ ఆస్తికి అధికారిగా చేస్తే నా వాటా ఎంత?" భంగు త్రాగుతూ ప్రశ్నించాడు నాగూర్.

"నీకు సగం, నాకు సగం. రోజీ నా వంతు" అన్నాడు షంషేర్.

"రోజీ సంగతి తర్వాత చూసుకోవచ్చులే, ముందు."

"అబ్బే. అదేం కుదరదు. షరతులన్నీ ఇప్పుడే తేలిపోవాలి. రోజీని నేను పెళ్ళాడాలి. అలా అయితేనే నీ ముఠాలో చేరతాను." రోజీని బెదిరించినట్లుగానే వచ్చి నాగూర్ ని కలుసుకున్నాడు షంషేర్.

ఇనుప గొలుసులు రాసుకున్నట్లు నవ్వాడు నాగూర్.

"పిచ్చివాడా! నా స్థావరం చూసిన వాణ్ని ప్రాణాలతో పోనిస్తాననుకున్నావా?"

షంషేర్ కళ్ళు ఎర్రబడ్డాయి. రివాల్వరుమీద చెయ్యివేశాడు.

* * *

"...లోపల షంషేర్ ఏం చేస్తూ ఉంటాడంటావ్ భయ్యా" ప్రశ్నించాడు భంగు. కదలకుండా కూర్చోవటం అతనికి కష్టమైపోతుంది.

బోయరానుంచి వచ్చి సరాసరి భంగు దగ్గరకు పోయాడు షాడో. నాగూర్ స్థావరాన్ని గురించి తెల్సుకుందామని, అతనికి తృప్తికరమైన సమాధానం రాలేదు. వెంటనే కాకా వాళ్ళను కలిశాడు. జరిగినదంతా విని ఆనందంతో మైమరిచారందరూ. రోజీ తండ్రి వారి ప్రాణ

స్నేహితుడు, గ్రామస్తులందరూ నోటికి తాళాలు వేసుకున్నారు. వారిచేత మాట్లాడించటం షాడోకు కూడా అసాధ్యమైన విషయం అయింది. నాగూర్ ముఠా స్థావరం ఎక్కడుందో చూచాయగా చెప్పగలిగారేగాని ఖచ్చితమైన సమాచారాన్ని అందించలేక పోయారెవరూ.

కాకాతో మాట్లాడుతూ ఆరాత్రి వరండాలో కూర్చున్నాడు షాడో. డేవిడ్ దుకాణం మూసివచ్చి కొద్దిసేపు వారితో బాతాఖానీ వేసి వెళ్ళాపోయాడు. పదిగంటల వేళకు కాకా కూడా వెళ్ళి పడుకున్నాడు. అలాగే చీకట్లో కూర్చుని ఆలోచనలో పడ్డాడు షాడో. నాగూర్ స్థావరాన్ని కనిపెట్టాలి ఎలా?

డేవిడ్ షాపు వద్ద అగ్గిపుల్ల వెలిగింది. ఎవరో ఆ వెలుగులో పోస్టర్ని చూస్తున్నాడు. కుతుహాలంతో చీకట్లలోకి జారిపోయాడు షాడో. అంతకుముందే చక్రవర్తిమీద ఉన్న పోస్టర్ని తొలగించాడు. ఎందుకైనా మంచిదని. దేవరాజు పోస్టర్ని చదువుకొని పరుగులాంటి నడకతో గ్రామాన్ని దాటింది ఆ ఆకారం... పాపం, నీడలాగా షాడో అనుసరిస్తున్నాడని దానికి తెలియదు. తన వెనుకే భంగు బయలు దేరాడని కొంతదూరం పోయిన తరువాత తెలుసుకున్నాడు షాడో. అతన్ని వదిలించుకోవటం కంటే గోడ కతుక్కున్న ఉడుమును వదిలించటం తేలికనిపించింది. అంత గట్టాగా పట్టుపట్టాడు భంగు.

ఆ ఆకారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒక లోయలోకి ప్రవేశించింది. లోయచుట్టూ ఉన్న కొండల్లో ఒక దానిమీద ఎక్కి వెలుగుకోసం ఎదురు చూశారు మిత్రులిద్దరూ.

* * *

"నాతోపాటు నా వాళ్ళు యిద్దరొచ్చారు. మమ్మల్ని చంపటం అంత తేలికనుకున్నావా?" రివాల్వరు పట్టుకొని ప్రశ్నించాడు షంషేర్.

నాగూర్ చేతుల్లో కూడా ఒక రివాల్వర్ వుంది. ఒకరి గుండెలకేసి ఒకరు గురిపెట్టి నిలబడ్డారు. ప్రేల్చటానికి ఇద్దరికీ ధైర్యం చాలటం లేదు. ఎవరు ప్రేల్చిన రెండో వాడు ట్రిగ్గర్ నొక్కకమానడు. దానికి యిద్దరూ చావక తప్పదు.

బయట కాపలావున్న నాగూర్ అనుచరులు లోపలకు పరుగెత్తుకు వచ్చారు. వారిని ఎదురించారు షంషేర్ స్నేహితులు.

"భంగూ! పద, యిదే ఛాన్సు" బయటి వ్యక్తులు హడావుడిగా లోపలకు పోగానే కొండ దిగి ఇంటివైపు పరుగెత్తాడు షాడో. అతన్ని నీడలా అనుసరించాడు భంగు. వేగంగా ఇంటిని సమీపించి వెనుక వైపు ఉన్న పాకలోకి పోయి నిలబడ్డాడు షాడో. కొంచెం ముందున్న కిటికీలో నుంచి మాటలు వినవస్తున్నాయి. తమ నెవరూ గమనించ లేరని రూఢి చేసుకొని ఆ మాటలు వినసాగాడు.

"శహాభాష్ షంషేర్! నీ గుండె దిటువుకు మెచ్చాను. నా ముఠాలో ఉండదగ్గ వాడివి. నీ ఇష్టం వచ్చినట్లే చేద్దాం." అంటూ రివాల్వర్ దించి బల్లమీద పెట్టాడు నాగూర్. అనుమానంగా చూస్తూ తనుకూడా రివాల్వర్ ని పాంటులో దోపుకున్నాడు షంషేర్.

"నాగూర్" అంటూ లోపలి గదులలో నుంచి వచ్చాడొక వ్యక్తి. "ఆ వెధవ గొడవ చేస్తున్నాడు. ఇందాక పోయి చూసే సరికి చేతికి కట్టిన తాళ్ళు ఊడదీసి వున్నాయి. బలవంతంగా మళ్ళీ బంధించివచ్చాను." రిపోర్టు చేశాడు.

"అతనెవరూ? ఎందుకు బంధించారు?" అడిగాడు షంషేర్.

"ఆ విషయం తర్వాత మాట్లాడుకుందాంలే, మొదట మన సంగతి తేల్చు" మాట మార్చాడు నాగూర్.

"మొదట్లో నేను చెప్పిందే. పశువులన్నీ చెరిసగం, ఇల్లు, పొలాలు,రోజీ నా వంతు."

"మరీ నీ వాటా ఎక్కువయింది. పొలాలు, ఇల్లూ నువ్వు తీసుకో. రోజీ గూడా నాకక్కరలేదు. పశువులు మూడొంతులు కావాలి."

నిముషంపాటు ఆలోచించాడు షంషేర్. ఇక పట్టు బట్టటం బాగోదు - వప్పుకున్నాడు.

"మొదట మనం ఆ పోలీసుగాడ్ని ముక్కలు చెయ్యాలి. తర్వాత ఈ విషయం చూద్దాం" ముఖంమీద పడిన గాటున తడుపుకుంటూ అన్నాడు నాగూర్.

ఇకముందు వినదల్చుకోలేదు షాడో. లోపల ఎవరో బంధితులైనట్లు తెలిసింది. ఎవరో పోయి చూడాలి... ఐదు నిముషాల తర్వాత వెనుక తలుపు తెరుచుకొని ఒక వ్యక్తి బయటకు వచ్చాడు. పాక పక్కనుంచి పోతుండగా వెనుక నుంచి పడ్డాడు షాడో. అరచేతిని కత్తిలా పెట్టి మెడమీద గుద్దాడు. కిక్కురు మనకుండా కింద పడ్డాడతను.

అతన్ని పాకలోకి లాగే పని భంగుకు అప్పగించి లోనికి దూరాడు షాడో. వరుసగా గదులున్నాయి. ఒక గదిలో నుంచి మాటలు వినపడుతున్నాయి. గోడ కానుకొని నడుస్తూ ముందుకు సాగాడు. ఒక గది తలుపు దగ్గిరగా వేసి వుంది. దాన్ని తెరిచి లోపల చూద్దామని అనుకొంటుండగా అడుగుల చప్పుడు వినవచ్చింది.

మెరుపులా బూటులో నుంచి డాగర్ ను బైటికి తీశాడు. సాధ్యమైనంత వరకూ వారితో ముఖాముఖిన ఎదురు పడగూడదనే ఉద్దేశ్యంతో తలుపులు తోసుకొని లోపలకు పోయాడు.

అడుగులు ఆ గది దగ్గరికే వచ్చి ఆగాయి. షాడో వూపిరి బిగపట్టి డాగర్ ను రెడీగా పట్టుకున్నాడు. లోపల అడుగు పెట్టిన వాడు ప్రాణాలతో బైటికిపోలేడు...ఒక్క క్షణం ఆగి తిరిగి ముందుకు పోయాడు.

ఒక్క చివరిగది తాళం వేసి వుంది. చొక్కా కాలరుకున్న సూదిలాంటి వస్తువును తీశాడు. తాళంలో పెట్టి రెండుసార్లు కదలించాడు.ఊడి వచ్చింది. 'బాంకు వాల్టులే ఊడదీసిన తనకు ఈ డొక్కు తాళం ఒక లెక్కా?' అనుకుంటూ తలుపులు తోసి, లోపలకు తొంగి చూశాడు. గోడ కానుకొని కూర్చున్నాడు చక్రవర్తి. గడ్డం బాగా పెరిగివుంది. సరియైన ఆహారం లేక బాగా చిక్కాపోయి నీరసంగా ఉన్నాడు. ఒకసారి బైటకు చూసి గదిలోకి అడుగు పెట్టాడు షాడో. డాగర్ తో అతనికి కట్టి ఉన్న తాళ్ళను కోసి వేశాడు.

అదే సమయంలో ఒక రివాల్వరు మోత ఆ లోయలో ప్రతిధ్వనించింది. పెద్దగా అరుస్తూ ఇంటిలో అటూ - ఇటూ పరుగెత్తసాగారందరూ.

"కమాన్ మాన్. హర్రీ" అంటూ అతని చెయ్యి పుచ్చుకొని బైటకు పరుగెత్తుకొచ్చాడు షాడో.

ఇంకా ఆ వరండాలోకి రాలేదు ఎవరూ! వెనుక తలుపులు సమీపించేసరికి ఒక వ్యక్తి ఎదురైనాడు వారికి. కుడివైపు గుండెలమీద ఎర్రగా నెత్తురు మరక కనిపిస్తుంది. తూలుకుంటూ లోపలికి వస్తున్నాడు. షాడో చేతిలో డాగర్ గాలిని చీల్చుకుంటూ పోయి అతని గొంతులో దిగబడింది. పరుగు ఆపకుండానే, అతన్ని పక్కకునెట్టి ఒక చేత్తో డాగర్ ను బైటికి లాక్కొని, ఇంటినుండి వెలుపలికి వచ్చాడు షాడో.

పాకదగ్గిర ఒక మూల వొదిగి కూర్చుని రివాల్వరుని గురిపెట్టి అటూ -ఇటూ చూస్తున్నాడు భంగూ. షాడోను చూడగానే బరువు తీరినట్లు లేచి నిలబడ్డాడు. అతన్ని మాట్లాడనీయకుండా పదమని సైగచేసి కొండలవైపు పరుగెత్తాడు షాడో.

నాగూర్ అనుచరులు వారినిచూసి కాల్పులు మొదలు పెట్టారు. బుల్లెట్లకు అందకుండా గజిబిజిగా అడుగులు వేస్తూ పరుగెత్తసాగాడు షాడో. ముందు భంగు, తర్వాత చక్రవర్తి, వారిద్దరి వెనకాల షాడో పరుగెత్తుతున్నారు.

ఒకవైపు నుంచి నాగూర్ ముఠా వారిని కొండలు చేరనీయకూడదని వారికన్నా ముందు కొండను చేరాలని పరుగెత్తుతున్నారు. భంగు పరుగెత్తుతూనే రెండుసార్లు రివాల్వర్ పేల్చాడు. కాని గురితప్పి వారి తలల మీదుగా పోయాయి గుళ్ళు.

కొందరు పక్కనుంచి కమ్ముకొస్తున్నారు. వెనుకనుంచి మరికొందరు వేగంగా వారిని సమీపిస్తున్నారు.

షాడో రివాల్వరుతో ఫైరింగ్ ఓపెన్ చేశాడు. ఒక్కక్షణం నిలబడి కొండలు చేరబోతున్న వారు కిందపడి నేలమీద తలదాచుకోవటానికి ప్రయత్నించసాగారు. వెనుతిరిగి వెనుక నుంచి వస్తున్నవారిమీద కూడా మరి రెండుసార్లు కాల్చి వారి వేగాన్ని తగ్గించాడు షాడో.

భంగూ, చక్రవర్తి పొదలలోకి ప్రవేశించారు. వారిద్దరూ సురక్షితంగా చేరగానే తనుకూడా పిక్కబలం చూపించాడు షాడో. ఒక పొద పక్క నుంచి రివాల్వర్ తో కవర్ యివ్వసాగాడు భంగు.

అతి కష్టంమీద కొండ ఎక్కారందరూ. చీమలలాగా వారి వెనుకే పొదలు గాలిస్తూ వస్తున్నారు శత్రువులు. పొదలను అడ్డం చేసుకొని, కొండ దిగి బోయరా వైపు దారి తీశాడు షాడో. దగ్గిరలో ఉన్న సురక్షిత స్థలం అదొక్కటే. రోజీ వాళ్ళు సహాయం చేయటానికి అవకాశం ఉంది.

చక్రవర్తి నీరసంగా వాలిపోతున్నాడు. ఏక్షణంలో నైనా పడిపోయే అవకాశం ఉంది. అతని పక్కనే పరుగెత్తుతూ అతనిమీద ఒక కన్ను వేసి వుంచాడు షాడో. బోయరా చేరగలిగితే...

"వెధవలు...దద్దమ్మలు..." అని నిప్పుతొక్కిన కోతిలా గంతులు వేస్తున్నాడు నాగూర్. "ఇంతమంది ఉండి వాళ్ళను చంపలేక పోయారు. మీ తెలివి తేటలు ఎందుకు? తగలబెట్టడానికా?" లోటా ఎత్తి గట - గటా త్రాగాడు.

"ఈ రాత్రికే వాడి అంతు చూడాలి. అందర్నీ రమ్మనండి. ఈ రాత్రికి జగత్ పురాను తగులబెట్టయినా ఆ పోలీసాఫీసర్ని మట్టు బెట్టాలి" అని ఆజ్ఞలు జారీ చేశాడు భంగు ఇచ్చిన ధైర్యంతో.

12

చక్రవర్తిని భుజంమీద వేసుకొని, ఆయాసంతో వగరుస్తూ వచ్చిన షాడోను చూసి ఆశ్చర్యపోయింది రోజీ.

"రోజీ. ఇతనే చక్రవర్తి. ఇతనికి కాస్త విశ్రాంతి అవసరం" అన్నాడు షాడో. వెంటనే అర్ధం చేసుకొని లోపలికిపోయి తగిన ఏర్పాట్లు చేసింది రోజీ. చక్రవర్తిని ఆమె రక్షణలో వదిలి గ్రామానికి బయలుదేరాడు షాడో. పశువుల శాలలో వున్న పెంకెగుర్రాన్ని స్వాధీన పరచుకొని దానిమీద భంగుతో జగత్ పురా చేరుకున్నాడు.

అప్పటికి సాయం సమయమైంది. చక్రవర్తిని తప్పించారన్న కక్షతో నాగూర్ జగత్ పురా మీద విరుచుకుపడే అవకాశం వుందని గ్రహించి కాకా, లక్ష్మణ్ లను హెచ్చరించాడు. అంతకుముందు నాగూర్ ముఠా దగ్గిర లాగుకున్న ఆయుధాలను గ్రామస్థులందరికీ పంచమని చెప్పాడు. గొడవ జరిగితే గురితప్పిన బుల్లెట్లు వారికి తగిలే అవకాశం వుంది. కనుక అందరినీ ఇళ్ళలోనుంచి బయటికి రాకుండా కట్టుదిట్టం చేసి తన గదికిపోయాడు.

రివాల్వర్ ని, రైఫిల్ ని క్లీన్ చేసి బుల్లెట్లు నింపాడు. మిగిలిన జేబుల నిండా నింపుకొని వరండాలో కూర్చున్నాడు.

* * *

నది దగ్గిర కాపలావున్న భంగు నాగూర్ ముఠాను చూడగానే పరుగు పరుగున గ్రామంలోకి వచ్చాడు. కాలుస్తున్న సిగరెట్ ని

అవతల పడవేసి గోడకు ఆనించిన రైఫిల్ ని అందుకున్నాడు షాడో. భంగును హోటల్ చాటున నిలబడమని తను వరండాలోనే వున్నాడు.

గ్రామమంతా నిశ్శబ్దంగా వుంది. గ్రామస్థులందరూ తలుపులు గడియలు పెట్టుకొని ప్రాణాలు అరచేతుల్లో వుంచుకొని కూర్చున్నారు.

ఇరవైమంది అనుచరులతో నదిని దాటి గ్రామంలోకి అడుగుపెట్టాడు నాగూర్. గ్రామాన్ని తగలబెట్టి అందర్నీ హడల కొట్టాలని అతని ఆలోచన. కానీ షంషేర్ అందుకు వ్యతిరేకించాడు. కందిరీగల లాంటి వాళ్లు గ్రామస్థులు. వారి జోలికి పోనంతవరకే వారు అమాయకులు. చెయ్యిపడిన మరుక్షణం తిక్కరేగి బయలుదేరితే తమను బోయరా అరణ్యాలు కూడా ఆదుకోలేవు.

దివిటీలతో ముందుకు వస్తున్న గుంపును చూడగానే రైఫిల్ ఎత్తాడు షాడో. ట్రిగ్గర్ మీద వేలుపెట్టి, వారు రైఫిల్ రేంజిలోకి వచ్చేదాకా ఆగాడు.

రెండు వందల గజాల దూరంలోకి వచ్చారు నాగూర్ ముఠా.

షాడో చేతిలోని రైఫిల్ నిప్పులు కక్కటం ప్రారంభించింది.

ముందు నడుస్తున్న వారిలో నలుగురు హతమైపోయారు. చెల్లా చెదరై ఇళ్ళచాటున చేరటానికి ప్రయత్నించారు వారందరూ.

రైఫిల్ మోతలతో దద్దరిల్లి పోయింది జగత్ పురా గ్రామం. కవర్ చేసుకున్న నాగూర్ అనుచరులు ఎదురు కాల్పులు మొదలెట్టారు.

షాడో చుట్టూ పిచ్చుకల లాగా ఎగర సాగాయి బుల్లెట్లు. ఇళ్ళ చాటుగా ముందుకు రాబోయిన వారిమీద కాకా, లక్ష్మణ్, డేవిడ్ లు బుల్లెట్లు పంపటం మొదలు పెట్టేసరికి పోరు మరింత జోరుగా ప్రారంభమయింది. డేవిడ్ దుకాణంలో నుంచి వర్షపు జల్లులాగా వస్తున్నాయి బుల్లెట్లు. హోటల్ బిల్డింగ్ మీది నుంచి కూడా ప్రారంభమయ్యాయి కాల్పులు.

ఆ సందడిలో ఒక సందులోకి పరుగెత్తుతున్న నాగుర్ ని గుర్తుపట్టాడు షాడో. ఒక్క గంతులో బజారుకు అడ్డం పడి అటు పోయాడు.

నాగూర్ ఒక గోడచాటున గండు పిల్లిలా పొంచి వున్నాడు. వేగంగా షాడో వచ్చేసరికి రైఫిల్ తో కాళ్ళమీద కొట్టాడు. ఆ దెబ్బకు ముందుకు బోర్లాపడ్డాడు షాడో. చేతిలోంచి రైఫిల్ జారి దూరంగా పడిపోయింది. తిరిగి రైఫిల్ ఎత్తి షాడో నెత్తి మీద కొట్టాడు నాగూర్. పక్కకు దొర్లి ఆ దెబ్బ తప్పించుకున్నాడు షాడో. ఒక చేత్తో కిందికి వాలిన రైఫిల్ పట్టుకొని గట్టిగా గుంజాడు. అలా గుంజటం వల్ల అప్రయత్నంగా ట్రిగ్గర్ నొక్కాడు నాగూర్. బుల్లెట్ షాడో తల పక్కగా పోయి నేలలో దిగబడింది. బార్ వేడికి షాడో చెయ్యి కమిలిపోయింది. బాధను సహించి మరొక్కసారి రైఫిల్ ను లాగాడు. ఊడి చేతుల్లోకి వచ్చింది.

ఎనుబోలా కత్తితీసి షాడో గుండెలమీదికి దూకాడు నాగూర్. షాడో సందులోకి పోగానే లేచి హోటల్ ముందుకు వచ్చి మెట్లపక్కన నిలబడ్డాడు భంగూ. గ్రామమంతా రైఫిల్ మోతలతో దద్దరిల్లి పోతుంది. డేవిడ్ , లక్ష్మణ్ లు అందరినీ వెనక్కి మళ్ళ వేయటంలో బిజీగా ఉన్నారు. నాగూర్ సందులోకి పోయాడు.? వణుకుతున్న చేతులను స్వాధీనపర్చుకోవటానికి ప్రయత్నిస్తూ కళ్ళు చించుకొని చీకట్లలోకి దృష్టి సారించాడు భంగూ.

కత్తి ఎత్తి బలంగా షాడో గుండెలమీద పొడిచాడు నాగూర్. ఎడమచేత్తో ఆ చేతిని కిందికి వాలకుండా ఆపాడు షాడో. ఐనా క్రమక్రమంగా కిందికి దిగుతున్నది. గుండె కానుకొన్నది కత్తి మొన. చివుక్కున పొడుచుకొని రక్తం బైటికి వచ్చింది. బలమంతా ఉపయోగించి చేతిని వెనక్కు నెట్టాడు. కుడికాలు ఎత్తి మెడకు అడ్డం వేసి తలను కూడా వెనకకు వంచాడు. ఆ బాధ భరించలేక షాడోమీది నుంచి లేచాడు నాగూర్. స్ప్రింగ్ లాగ డాగర్ ని లాగి నిలబడ్డాడు షాడో. చుట్టూ అవకాశం కోసం ఎదురుచూస్తూ తిరగసాగాడు. తడి ఆరిపోయిన పెదవులను తడుపుకున్నాడు నాగూర్. చంపుదామని ఆశతో వచ్చి వలలో చిక్కుకున్నాడు. తన అనుచరులను ఊచకోత కోస్తున్నారు ఇళ్ళల్లో నుంచి.

క్రోధంతో ముందుకు దూకాడు. మెలకువగా ప్రక్కకు తిరిగి తన డాగర్ తో ఆ బాకును అడ్డుకున్నాడు షాడో. స్టీలుకు స్టీలు రాసుకుని

మెరుపులు వచ్చాయి. ఎడమచేయి పిడికిలితో నాగూర్ పాత గాయంమీద గుద్దాడు. నాగూర్ గుండెలమీద అరంగుళం లోతున చీల్చింది డాగర్.

గోడచాటున రైఫిల్ గురిపెట్టి పాక్కుంటూ వస్తున్న షంషేర్ ను గుర్తుపట్టాడు భంగు. "ఇంకా పది అడుగులు రావాలి తన గన్ పని చేయాలంటే" అని పేచి కూర్చున్నాడు.

ఎడమచేతిని గుండెల కదుముకొని, ప్రాణాలు దక్కించుకోవటానికి ప్రయత్నం చేయసాగాడు నాగూర్. ఆఖరిదెబ్బ తీద్దామని ముందుకు దూకబోయాడు షాడో.

సందు మొదలుకు రాగానే ఎగిరి నిలబడి రైఫిల్ ని ఎత్తాడు షంషర్. "భయ్యా" రైఫిల్ మోతలను చీల్చుకుంటూ వచ్చిన కేక విని, వెనుతిరిగాడు షాడో. మృత్యుదేవతలా నిలబడి వున్న షంషేర్ ని చూశాడు.

ఎత్తిన చెయ్యి దించకుండా అలాగే డాగర్ ని విసిరాడు. సర్రునపోయి షంషేర్ గుండెల్లో గుచ్చుకుంది. అప్పుడే తన చోటు వదిలి ముందుకు పరుగెత్తుకువచ్చాడు భంగూ. షాడోను వెనుక నుంచి దెబ్బ తియ్యటానికి కత్తి ఎత్తిన నాగూర్ ని చూసి గ్రీనర్ ట్రిగ్గర్స్ రెండూ నొక్కాడు. ఆ మూవ్ మెంట్ గమనించి నేలమీద పడ్డాడు షాడో.

'బొయ్'మన్న గ్రీనర్ అందరి చెవులూ చిల్లులు పడవేసింది. పది అడుగుల దూరం వెనక్కి విరుచుకుపడ్డాడు నాగూర్. గుర్తు పట్టరాని విధంగా నజ్జునజ్జయి పోయాడు.

పోతున్న కొన ప్రాణాలు బిగపట్టుకొని తన ముందు నిలబడ్డ భంగూ వీపుకేసి రైఫిల్ పెట్టి ట్రిగ్గర్ నొక్కి మరణించాడు షంషేర్.

"అబ్బా" అంటూ గ్రీనర్ వదిలి ముందుకు వాలి పోయాడు భంగు. ఆత్రుతతో అతన్ని సమీపించాడు షాడో.

"భయ్యా జాగ్రత్త... దొంగ వెధవలు ఇంకా మిగిలి వున్నారు" అంటూ జాగ్రత్తలు చెప్పాడు భంగు.

"ఎక్కడ తగిలింది భంగూ! ఏది, నన్ను చూడనీ" అంటున్న షాడోని వారించాడు.

"లాభంలేదు భయ్యా! నా పని అయిపోయింది. మరణించే ముందు మనిషిగా మారానన్న ఆనందంతో హాయిగా కళ్ళు మూస్తున్నాను. ఒక్కమాట భయ్యా. నువ్వు చక్రవర్తిని గురించి అడుగుతావేమో, అందుకే నాకు సహాయం చేస్తున్నావేమో అని అనుమానించాను. నన్ను క్షమించు. నువ్వు మనిషివి కాదు. దే..వ.." తల వాల్చేశాడు భంగు.

షాడో కళ్ళముందు ప్రపంచం అంతా గిర్రున తిరిగింది. "అలా జరగకూడదు. బాగుపడి జీవితాన్ని నందనవనం చేసుకోబోతున్న తరుణంలో ఈ దుర్ఘటన..."

క్రింద పడిన షంషేర్ రైఫిల్ తీసుకొని వీధిలోకి పరుగెత్తాడు. పిచ్చి కోపంతో వెనుకా ముందూ చూడకుండా కాల్పులు సాగించాడు.

చావగా మిగిలిన నలుగురూ తలొక దిక్కుకీ పారిపోయారు.

ఆరాత్రి జరిగిన రక్తపాతం జగత్ పురా గ్రామం కనీ వినీ ఎరగనిదయింది.

13

"ఊరుకో చిలకా! నీ తండ్రి మంచి పనికోసం ప్రాణాలు అర్పించాడు. నా ప్రాణాలను కాపాడటానికి ప్రయత్నించి అసువులు వీడాడు" రోదిస్తున్న చిలకను వూరడించాడు షాడో.

ఉదయం పదిగంటలవేళ గ్రామ ప్రజలందరూ నడుంకట్టి శవాలన్నాటినీ ఒకే గోతిలో పూడ్చిపెట్టారు. భంగు దేహాన్ని ఊరేగింపుగా తీసుకుపోయి దహనం చేశారు.

తెల్లవారుతుండగానే చక్రవర్తితోపాటు వచ్చింది రోజీ. వెనుకే బయలుదేరి వచ్చాడు దాదా. అందరి అభినందనలు స్వీకరించి చక్రవర్తిని తన గదికి తీసుకుపోయాడు షాడో. తన ఐడెంటిటీని

చూపించి, అతను ఎలా బంధింపబడ్డాడో వివరాలు చెప్పమని అడిగాడు.

"దేవరాజును అనుసరించి, చుట్టుదారిన డోబ్రా చేరుకున్నాను సార్! అక్కడికి వచ్చిన తరువాత ఒకరోజు అతన్ని షాడో చేశాను. జగత్ పురా పోవటానికి మార్గం అడగడం విని వెంటనే హెడ్ క్వార్టర్స్ కి రిపోర్టు పంపాను. అక్కడ నా కోసం కాపు వేసినట్లున్నాడు, నేను గమనించలేదు. నేను చూడకుండా ముందుకుపోయేసరికి వెనుకనుంచి పట్టేశాడు. నేను ఒక రిపోర్టు పంపానని తెలుసుకున్నాడు గాని ఏమని పంపానో అతనికి తెలియదు. ఆ రహస్యమే నా ప్రాణాలు కాపాడింది. మరునాడు నాగూర్ ని కలుసుకొని యిద్దరూ ఒప్పందం చేసుకున్నారు. నాగూర్ ఇతనికి మిత్రుడే! నా ఎదుటే నా రూపంలో అతను ప్రజలను మోసం చేస్తుంటే ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఉండి పోయాను."

అతను చెప్పినదంతా విన్నాడు షాడో. "ఆల్ రైట్ మాన్! ఐతే నువ్వు ఒక పనిచెయ్యి. జరిగినవన్నీ రిపోర్టు వ్రాసి అండమాన్స్ గవర్నర్ గారికి అందజెయ్యి. రోజీ వాళ్ళ ఫాదర్ బాగుపడిన తరువాత ఆయన స్టేట్ మెంటు కూడా తీసుకొని సబ్ మిట్ చెయ్యి. నేను వెళ్ళిపోతాను."

అంతచేసికూడా జరగబోయే గౌరవాలు తనకు వదలి పోతానంటున్న వ్యక్తిని చూచి ఆశ్చర్యపోయాడు చక్రవర్తి.

షాడో మెట్లు దిగుతుండగా ఎదురయింది రోజీ.

అటూ - యిటూ చూసింది. ఎవరూ లేరు. మెరుపులా మీదికొచ్చి, అతని పెదిమలను చుంబించింది బిత్తర పోయాడు షాడో.

"ఇప్పుడు బాకీ చెల్లిపోయింది రాజు" అని గల - గల సెలయేరులా నవ్వుతూ బైటికి పారిపోయింది.

14

"జగత్ పురా డెవిల్స్ మిషన్ ' చాలా కష్టం అయిందంటావ్! అంతేనా?" ఆరిపోయిన సిగార్ ని అలాగే నోట్లో వుంచుకొని అడిగారు కులకర్ణిగారు.

"ఏం డెవిల్సో ఏమిటో! ఎక్కడ చెయ్యి వేసినా అరిచి గంతులు వేస్తున్నాడండీ" ఫిర్యాదు చేసింది బిందు.

"అది అంతేనమ్మా. నిన్ను చూసేసరికి ఎక్కడలేని బాధలూ వస్తాయి"

బల్లమీద పెట్టిన పనామా పాకెట్ అందుకుంటూ "అబ్బా..." అని రాగాలు తీశాడు షాడో. "ఏమైంది రాజు" ఖంగారుగా అడిగింది బిందు. నోరు తెరవబోయిన షాడో కులకర్ణిగారి వంక చూసి ఆగిపోయాడు.

"ఇదిగో రాజు హోంమినిస్టరుగారి పర్సనల్ సెక్రటరీ వస్తానంది. ఆమె ముందు నా పరువు తియ్యకు. నీ బాధ నాకు తెలుసు. ఎన్ని రోజులు కావాలి?"

రెండు వేళ్ళు చూపించి మళ్ళీ సర్దుకొని మూడు చూపించాడు షాడో.

"వాట్ మూడు వారాలా? ఇంపాజిబుల్! నేను వప్పుకోను. నాలుగురోజులకన్నా ఎక్కువ అరిచి పీక్కునా గ్రాంట్ చెయ్యను. అవసరంవస్తే నిన్ను వెతకటానికి నేనే వీధుల్లో పడాలి" అని అరిచారు కులకర్ణి.

అప్పటికే బిందు చెయ్యి పట్టుకొని పారిపోతున్నాడు షాడో. "ఐయామ్ సారీ! మూడు వారాల తర్వాతే మళ్ళీ కనిపించేది" అని అరిచి మాయమయ్యాడు.

"డెవిల్స్" అనుకున్నారు కులకర్ణి నవ్వుతూ.

-: అయిపోయింది:-

# Devils in Nicobar

**MADHU BABU**

